


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక


ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 100 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 20 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 100 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 20 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

### సజ్జనార్ నుంచి మరో అలర్ట్

- సెర్చ్ ఇంజిన్ ర్యాంకింగులను వాడుకుని పెరిగిపోతున్న సైబర్ మోసాలు
- ప్రభుత్వ, బ్యాంకింగ్ వెబ్‌సైట్లను పోలిన నకిలీ సైట్లతో వినియోగదారులకు వల
- వివరాలు నమోదు చేస్తే ఖాతాలు ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిక
- యూఆర్ఎల్ సరిచూసుకోవాలని, స్పాన్సర్డ్ లింకులపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- మోసపోతే వెంటనే 1930కి కాల్ చేయాలని ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

- మిగతా 2లో

## ఈ సారైనా.. హామీల అమలుకు
# నిధులు కేటాయించండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ
- రాబోయే బడ్జెట్‌లో హామీల అమలుకు నిధులు కేటాయించాలని డిమాండ్
- ఆరు గ్యారెంటీలు సహా 95 శాతం హామీలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శ
- నిధులు కేటాయించకపోతే ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరిక
- గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలన్న బీఆర్ఎస్

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం పదవీకాలం పూర్తికావస్తున్న తరుణంలో, ఇచ్చిన హామీల అమలుకు రాబోయే బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీల

2లో



# మంచి ఫలితాలు సాధించారు

## రేవంత్ రెడ్డి సహా తెలంగాణ నేతలకు ఖర్గే, రాహుల్ గాంధీ ప్రశంసలు

### ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సమావేశమైన తెలంగాణ కాంగ్రెస్ నాయకులు
### భవిష్యత్తు కార్యాచరణపై చర్చించినట్లు తెలిపిన మల్లికార్జున ఖర్గే
### సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటన

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తెలంగాణ కాంగ్రెస్ నాయకులను అభినందించారు. ఢిల్లీలోని ఖర్గే నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మల్లు భట్టివిక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, నామా నాగేశ్వరరావు ఆయనను కలిశారు. ఈ సమావేశంలో రాహుల్ గాంధీ కూడా ఉన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మున్సిపాలిటీలను కైవసం చేసుకున్నట్లు తెలంగాణ కాంగ్రెస్ నాయకులు వారి దృష్టికి తీసుకువెళ్లారు. ఫలితాలపై రాహుల్ గాంధీ, ఖర్గే అభినందించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణపై



చర్చించామని అన్నారు. తెలంగాణకు పార్టీ ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. సమానత్వంతో కూడిన తెలంగాణ నిర్మాణానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు. ప్రజా తెలంగాణ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లే దిశగా కార్యాచరణను రూపొందించినట్లు తెలిపారు.




## కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

### కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్

- ఏఐ పటంలో భారత్ ను నాయకుడిగా నిటబెట్టడమే లక్ష్యమన్న అశ్విని వైష్ణవ్
- విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను తీసుకొస్తామని వెల్లడి
- పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామన్న కేంద్ర మంత్రి

- మిగతా 2లో

## మంత్రుల అవినీతి చిట్టా
# బయటపెడతాం



- మంత్రుల అవినీతి, వారికి చెంచాగిరి చేస్తున్న ఐపీఎస్ అధికారుల జాబితా మా వద్ద ఉంది: బండి సంజయ్
- అవినీతి మంత్రుల చిట్టా తమ వద్ద ఉందన్న బండి సంజయ్
- ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించడానికే కాంగ్రెస్ అధికారంలో ఉందని విమర్శ
- 2029 నాటికి దేశంలో ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండదని జోస్యం

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ కాంగ్రెస్ మంత్రుల అవినీతి చిట్టా తమ వద్ద ఉందని, ఇంకా బయటకు తీస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మంత్రులు చేస్తున్న అవినీతి ఆధారాలను సేకరిస్తున్నామని,

- మిగతా 2లో

## ఉచిత పథకాలతో డబ్బు వృధా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..



- ఉచిత పథకాలపై సుప్రీంకోర్టు అసహనం.. ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని మండిపాటు!
- అందరికీ ఉచిత విద్యుత్తును ప్రకటించిన స్టాలిన్ ప్రభుత్వం
- రాష్ట్ర ఆర్థిక స్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్ ఎలా ఇస్తారన్న సుప్రీం
- ఉచితాల వల్ల దేశ అభివృద్ధి దెబ్బతింటుందని వ్యాఖ్య

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల
# పెట్టుబడి...

### ఏఐ రంగంలో రిలయన్స్ గ్రూప్ సంచలనం

- ఏఐ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్న జియో-రిలయన్స్
- వచ్చే ఏడేళ్లలో ఈ భారీ పెట్టుబడిని పెట్టనున్నట్లు ముకేశ్ అంబానీ వెల్లడి
- గిగావాట్ డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎడ్జ్ కంప్యూటింగ్‌పై ప్రధాన దృష్టి
- ఏఐ ఉద్యోగాలను సృష్టిస్తుందే తప్ప, తీసేయదని స్పష్టం చేసిన అంబానీ

- మిగతా 2లో



## తెలంగాణలో అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి పీపీపీని ప్రోత్సహిస్తున్నాం



- ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొన్న శ్రీధర్ బాబు
- అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు
- పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయన్న మంత్రి

- మిగతా 2లో



## ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్
# సమావేశాలు, 28న బడ్జెట్

- 23వ తేదీన మంత్రివర్గ సమావేశం
- 10 నుంచి 15 రోజుల పాటు బడ్జెట్ సమావేశాలు
- మొదటి రోజు గవర్నర్ ప్రసంగం

హైదరాబాద్ పెన్ పవర్:త్వరలో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26వ తేదీ నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28వ తేదీన ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

- మిగతా 2లో

## తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో
# ఎదురు కాల్పులు..
## ఇద్దరు మావోయిస్టులు మృతి

- మావోయిస్టు అగ్రనాయకుల కోసం కర్రెగుట్టల్లో భద్రతా దళాల గాలింపు
- సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంయుక్త ఆపరేషన్
- భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు

హైదరాబాద్ పెన్ పవర్:సీఆర్పీఎఫ్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టలో కూంబింగ్ ను కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో ఈరోజు భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దేవ్‌జీ, జూనియర్ క్యాడర్‌కు

- మిగతా 2లో



## త్వరలో 'ఎస్ఐఆర్'... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
# సహా పలు రాష్ట్రాలకు ఈసీ లేఖ

- బీహార్‌లో ఇప్పటికే పూర్తయిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ
- ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం సన్నాహకాలను త్వరగా పూర్తి చేయాలన్న ఈసీ
- రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఈసీ లేఖ

హైదరాబాద్ పెన్ పవర్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సిద్ధంగా ఉండాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 22 రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం లేఖ రాసింది

- మిగతా 2లో




## హైకోర్టులో రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ



- 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు
- గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదుతో కేసులు నమోదు
- క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన ముఖ్యమంత్రి
- కోర్టు హాజరు నుంచి మినహాయించిన హైకోర్టు

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# సమన్యాయంతోనే సమాజ సుస్థిర ప్రగతి

డిజిటల్ ప్రపంచంలో ఆర్థిక పరిపుష్టి, సామాజిక న్యాయంతోనే సుస్థిర సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుంది. ఇది సాకారం కావడానికి పేదరిక నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ, లింగ సమానత్వం, నిరుద్యోగ సమస్యను అధిగమించడం, సామాజిక భద్రత, ఆర్థిక అసమానతల తొలగింపు, జనాభా నియంత్రణ, నిరక్షరాస్యత నిర్మూలన లాంటి ప్రధాన అంశాలు దోహదపడతాయని నమ్మిన ఐరాస, అంతర్జాతీయ కార్మిక సంస్థలు 2009 నుంచి ప్రతి ఏడాది 20 ఫిబ్రవరి రోజున "ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సోషల్ జస్టిస్)" పాటించడం ఆనవాయితీగా వస్తోంది. సామాజిక న్యాయం సిద్ధించడానికి అందరికీ పని కల్పించడం, సామాజిక రక్షణ, రాజ్యాంగ హక్కుల కల్పన, సమసమాజ స్థాపనలకు చర్యలు తీసుకోవాలని సభ్య దేశాలకు ఐరాస–ఐఎల్ఓ సూచిస్తున్నది. విద్యార్థి దశ నుంచే పేదరిక నిర్మూలన, మానవ హక్కుల పరిరక్షణ ప్రాధాన్యం, గ్లోబల్ పౌరసత్వం లాంటి సున్నిత అంశాల పట్ల విద్యాలయాల్లోనే అవగాహనలు కల్పించాలని ఐరాస సిఫార్సు చేస్తోంది. ప్రపంచ సామాజిక న్యాయ దినం–2026 ఇతివృత్తంగా "సాంకేతికత మరియు భాగస్వామ్యాల మాద్యమంగా బహుముఖ సహకారంతో యువత ముందడుగు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది. ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అందరూ ఆర్థికంగా బలోపేతం అయినపుడు సహజంగానే సామాజిక న్యాయం వైపు అడుగులు పడతాయి. ప్రపంచవ్యాప్తంగా 2 బిలియన్లు, అందులో 40 కోట్ల యువత(15 – 29 ఏండ్ల వయస్సు) కడు పేదరికంలో మగ్గుతున్నారని, వీరిలో సగానికి పైగా పేదలకు పని కల్పన జరగడం లేదని తేలింది. దాదాపు 26 కోట్ల అంతర్జాతీయ వలసదారులు, అందులో 44 శాతం వరకు మహిళలు ఉన్నారని ఐఎల్ఓ అంచనా వేసింది. అర్హతకు తగిన పని, పనికి తగిన వేతనం లభించని సమాజంలో సామాజిక అన్యాయాలు, హింసాత్మక ఘటనలు రాజ్యమేలుతాయని మనకు తెలుసు. మానవ హక్కుల ఉల్లంఘనలు, కృత్రిమ సామాజిక అవరోధాలు, కులమత విద్వేషాలు, లింగ/ఆర్థిక అసమానతలు, వలస కూలీల ధీన పరిస్థితులు, దివ్యాంగుల సమస్యలు లాంటి సమస్యలకు సరైన సమాధానాలు సూచించగల సమాజంలో సామాజిక న్యాయం వర్ధిల్లుతుంది. కులం, మతం, వర్గం, వర్ణం, జాతి, పేదరికం, నిరుద్యోగం, ప్రాంతం, లింగం, సంస్కృతి సంప్రదాయాలు లాంటివి అవరోధంగా ఉన్నంతకాలం సామాజిక న్యాయం ఎండమావి అవుతుందని, వీటితో అశాంతి, అసహనాలు రెచ్చిపోయి హింస ప్రత్యక్షం అవుతుందని తెలుసుకోవాలి. ప్రపంచ మానవాళి మధ్య సామాజిక న్యాయం, సంఘీభావం, సమానత్వం, సామరస్యం నెలకొన్నపుడు మాత్రమే విశ్వ శాంతి కపోతం స్వేచ్ఛగా విహరించగలుగుతుందని తెలుసుకోవాలి. 'అందరికీ సమసమాజం, సమాగ్రాభివృద్ధిలో మనందరం" అనే భావనలతో ప్రభుత్వాలు పథకాల పావులు కదుపుతూ, ఉద్యోగ ఉపాధులు పెరిగి సామాజిక న్యాయం అనే ప్రతిఫలం సిద్ధించడం జరుగుతుంది. అజ్ఞానం, పేదరికం, అన్యాయం కోరలు చాచినపుడు సామాజిక శాంతి కొరవడుతుంది. అన్యాయాన్ని సహించిన సమాజం భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానంగా ఆర్థిక అసమానతలు తొలగినపుడు సామాజిక న్యాయ దేవత ప్రతిష్ట జరుగుతుందని గమనించి అందరం సామాజిక న్యాయాన్ని బలపరుచుదాం, ప్రపంచ శాంతి స్థాపన చేద్దాం.

# ఈ సారైనా.. హామీల అమలుకు నిధులు కేటాయించండి

- మొదటి పేజి తరువాయి

అమలుకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లోనైనా చిత్తశుద్ధి చూపాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. ఆరు గ్యారెంటీల పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటి అమలును పూర్తిగా పక్కన పెట్టిందని కేటీఆర్ తన లేఖలో విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో 95 శాతం ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని ఆరోపించారు. గత రెండు బడ్జెట్లలోనూ హామీల అమలుకు అవసరమైన కేటాయింపులు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో 2026–27 బడ్జెట్‌లో అయినా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత, రైతుల కోసం ఇచ్చిన హామీల మేరకు భారీగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓపిక నశిస్తోందని, వారిని ఇకపై వేచి చూసేలా చేయవద్దని సూచించారు.

కేవలం గ్యారెంటీలే కాకుండా, ఎన్నికలకు ముందు వివిధ డిక్లరేషన్ల రూపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు ఇచ్చిన వాగ్దానాలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కేటీఆర్ కోరారు. గత రెండేళ్లుగా ఆయా వర్గాలకు చెల్లించాల్సిన నిధులు, బకాయిలను ఈ బడ్జెట్‌లో చేర్చి వెంటనే విడుదల చేయాలని స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని గుర్తుచేశారు.

ఒకవేళ ఈ బడ్జెట్‌లో కూడా హామీల అమలుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా 'మోసకారి కాంగ్రెస్'ను ప్రజల పక్షాన ఎక్కడికక్కడ నిలదీస్తాం అని కేటీఆర్ తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఇంకెంతమాత్రం ఓపికపట్టే స్థితిలో లేదని, ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తామని తన లేఖలో స్పష్టం చేశారు.

# ఈ నెల 26 నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు, 28న బడ్జెట్

- మొదటి పేజి తరువాయి

23వ తేదీన మంత్రివర్గ సమావేశం అనంతరం బడ్జెట్ సమావేశాల తేదీని ప్రకటించనున్నారు. పది నుంచి పదిహేను రోజుల పాటు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.మొదటి రోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. మరుసటి రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఇప్పటికే ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క నేతృత్వంలో శాఖల వారీగా మంత్రులు, అధికారులతో సమావేశమై ప్రతిపాదనలను స్వీకరించారు.

# మంత్రుల అవినీతి చిట్టా బయటపెడతాం

- మొదటి పేజి తరువాయి

ఈ మంత్రులకు కొందరు ఐఏఎస్ అధికారులు చెంచాగిరి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులకు చెంచాగిరి చేస్తున్న అధికారులు వాళ్లు సంపాదించుకుంటూ, మంత్రులకు ఎలా కూడబెడుతున్నారో తమకు తెలుసని అన్నారు.ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు మూటలు పంపించడానికే తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉందని బండి సంజయ్ అన్నారు. ఒక్కో మంత్రి అవినీతి చిట్టా విప్పుతామని హెచ్చరించారు. అవినీతికి సంబంధించి ఆడియో రికార్డులు తమ వద్ద ఉన్నాయని అన్నారు. 2029 నాటికి దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండదని జోస్యం చెప్పారు.

మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలకు చెంప చెళ్లుమనిపించామని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ బరితెగించి అధికార కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కయిందని ఆరోపించారు. బీజేపీని అడ్డుకునేందుకు ఆ మూడు పార్టీలు ఒక్కటయ్యాయని మండిపడ్డారు. తన మిత్ర పక్షం మజ్లిస్ కోసమే హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి మూడు ముక్కలు చేశారని ఆరోపించారు.

# త్వరలో 'ఎస్ఐఆర్'... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలకు ఈసీ లేఖ

- మొదటి పేజి తరువాయి

. బీహార్, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల్లో అమలు చేసిన 'ఎస్ఐఆర్' ప్రక్రియను దేశవ్యాప్తంగా చేపట్టేందుకు ఈసీ కసరత్తు చేస్తోంది. వీటికి సంబంధించిన సన్నాహకాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచించింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూ, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కశ్మీర్, జార్ఖండ్, కర్ణాటక, లడఖ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఢిల్లీ, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్లకు ఎన్నికల సంఘం లేఖ రాసింది. ఏప్రిల్ నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశముంది.

దేశవ్యాప్తంగా 'ఎస్ఐఆర్' ప్రక్రియను చేపట్టాలని గత ఏడాది జూన్ నెలలో నిర్ణయించిన

విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బీహార్‌లో ఈ ప్రక్రియ పూర్తయింది. తొమ్మిది రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రక్రియ కొనసాగుతోంది. అసోంలో మాత్రం 'ఎస్ఐఆర్'కు బదులు ప్రత్యేక సవరణ పేరుతో ఓటరు జాబితా సవరణను పూర్తి చేశారు.

# నకిలీ వెబ్‌సైట్ల మాయాజాలం...

సాంకేతికత పెరిగాక ఏ చిన్న సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్ వంటి సెర్చ్ ఇంజిన్లను ఆశ్రయించడం సాధారణమైంది. అయితే, మనకున్న ఈ అలవాటే ఇప్పుడు సైబర్ నేరగాళ్లకు ఆయుధంగా మారింది. సెర్చ్ ఫలితాల్లో అగ్రస్థానంలో కనిపించినంత మాత్రాన అది అసలైన, సురక్షితమైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే నిలువునా మోసపోయే ప్రమాదం ఉందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగరూకతతో వ్యవహరించాలని ఆయన సూచించారు.

### మోసగాళ్ల కొత్త ఎత్తుగడ ఇదే

సైబర్ మోసగాళ్లు ఇప్పుడు 'సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్' (ఎస్ఈవో) అనే అధునాతన టెక్నిక్‌ను, పెయిడ్ ప్రకటనలను వాడుకుంటున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ పోర్టల్స్, ప్రముఖ ఈ–కామర్స్ సంస్థల పేర్లతో అచ్చుగుద్దినట్టు ఉండే నకిలీ 'ఫిషింగ్' వెబ్‌సైట్లను సృష్టిస్తున్నారు. వినియోగదారులు కస్టమర్ కేర్ నంబర్లు, ప్రభుత్వ పథకాలు లేదా ఇతర సేవల కోసం వెతికినప్పుడు, ఈ నకిలీ సైట్లు సెర్చ్ ఫలితాల్లో టాప్‌లో కనిపించేలా చేస్తున్నారు. వీటిపై 'హజూశీఅంశీతీవస' లేదా 'ూాస' అని చిన్న అక్షరాలతో ఉంటుంది. వాటిని గమనించకుండా నిజమైన వెబ్‌సైట్ అని భ్రమపడి క్లిక్ చేయగానే మోసం మొదలవుతుంది.వెబ్‌సైట్ ఓపెన్ అయిన వెంటనే వ్యక్తిగత వివరాలు, లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్/డెబిట్ కార్డు నంబర్లు, సీవీవీ, ఓటీపీ వంటి అత్యంత సున్నితమైన సమాచారాన్ని నమోదు చేయమని కోరతారు. ఆ వివరాలు వారికి చిక్కగానే క్షణాల్లో మీ బ్యాంకు ఖాతాను ఖాళీ చేస్తారు. కేవలం ఆర్థికంగా నష్టపరచడమే కాకుండా, మీ గుర్తింపు పత్రాలను దొంగిలించి 'ఐడెంటిటీ థెఫ్ట్'కు పాల్పడే ప్రమాదం కూడా ఉంది. అంటే మీ పేరు మీద రుణాలు తీసుకోవడం లేదా ఇతర నేరాలకు పాల్పడటం వంటివి చేయవచ్చు.

### రక్షణ కవచం అప్రమత్తతే

ఈ తరహా మోసాల బారిన పడకుండా ఉండేందుకు పోలీసులు కొన్ని కీలక సూచనలు జారీ చేశారు.

ఏదైనా వెబ్‌సైట్‌ను సందర్శించే ముందు దాని చిరునామా (ఖ=ా)ను క్షుణ్ణంగా పరిశీలించాలి. అసలు వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు, నకిలీ వెబ్‌సైట్ స్పెల్లింగ్‌కు చిన్న తేడాలుంటాయి.

వీలైనంత వరకు సెర్చ్ ఇంజిన్లలో వెతకడం కన్నా, మీకు తెలిసిన అధికారిక వెబ్‌సైట్ చిరునామాను నేరుగా బ్రౌజర్ అడ్రస్ బార్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడమే సురక్షితం.

సెర్చ్ ఫలితాల్లో Sponsored లేదా Ad అని కనిపించే లింకులపై క్లిక్ చేసేటప్పుడు రెట్టింపు జాగ్రత్త అవసరం.

ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలి లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో మన అప్రమత్తతే మనకు రక్షణ కవచమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

# బొత్స గారూ... మీకు చీజ్‌కు, నెయ్యికి తేడా తెలియదా?

హెరిటేజ్ సంస్థపై వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా ఖండించారు. చీజ్ ప్యాకెట్లు చేతిలో పట్టుకుని, వాటిని నెయ్యి అని చూపిస్తూ ప్రజలను, సభను తప్పుదోవ పట్టిస్తున్నారని, వైసీపీ నేతలకు కనీస అవగాహన ఉందా అని శాసనమండలిలో నిలదీశారు. మండలిలో వైసీపీ సభ్యుల తీరు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని ఆయన విమర్శించారు.ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని గత రెండు రోజులుగా తాను స్పష్టంగా సమాధానం ఇస్తున్నప్పటికీ, అదే అంశాన్ని పట్టుకుని సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని అచ్చెన్నాయుడు అన్నారు. ముఖ్యంగా మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను ఉద్దేశించి, "చీజ్ ప్యాకెట్లను చూపిస్తూ నెయ్యి ప్యాకెట్లు అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు. మీకు చీజ్‌కు, నెయ్యికి మధ్య తేడా కూడా తెలియదా?" అని ఎద్దేవా చేశారు. హెరిటేజ్‌పై అంతగా అనుమానాలు ఉంటే ఒక్కటంటే ఒక్క చిన్న ఆధారాన్నైనా సభ ముందు పెట్టాలని, లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ అసత్య ప్రచారాలపై హెరిటేజ్ సంస్థ ఇప్పటికే వైసీపీ నేతలకు లీగల్ నోటీసులు పంపిందని, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. "గతంలో రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలతో పచ్చని తోటలు నరికించినట్లు, ఇప్పుడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఆర్థిక మూలాలపై దాడి చేయాలని చూడటం మీ ఫ్యాక్షన్ మనస్తత్వానికి నిదర్శనం" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వాలను అడ్డం పెట్టుకుని భారతి సిమెంట్ పేరుతో ప్రభుత్వ ధనాన్ని దోచుకున్న చరిత్ర వైసీపీదని, కానీ హెరిటేజ్ సంస్థ ప్రభుత్వాలతో సంబంధం లేకుండా పారదర్శకంగా వ్యాపారం చేయాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సంస్థ అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. నిత్యం వాయిదా తీర్మానాలతో సభను పక్కదారి పట్టించడం మానేసి, దమ్ముంటే ఆధారాలతో మాట్లాడాలని, నిర్మాణాత్మక చర్చకు రావాలని వైసీపీకి ఆయన సవాల్ విసిరారు.

# హైకోర్టులో రేవంత్ రెడ్డి క్వాష్ పిటిషన్‌పై విచారణ

తనపై భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులు కొట్టివేయాలని కోరుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచార సభలలో తనపై నిరాధార, అనుచిత ఆరోపణలు చేశారంటూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఫిర్యాదు చేయడంతో రేవంత్ రెడ్డిపై రెండు కేసులు నమోదయ్యాయి.భూపాలపల్లి, మొగులపల్లి పోలీస్ స్టేషన్‌లలో తనపై నమోదైన కేసులను కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కోర్టులో హాజరునుంచి ముఖ్యమంత్రికి మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయడానికి గండ్ర వెంకటరమణారెడ్డి న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను 3 వారాలకు వాయిదా వేసింది.

# తెలంగాణలో అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి పీపీపీని ప్రోత్సహిస్తున్నాం: శ్రీధర్ బాబు

అమెరికా టెక్ దిగ్గజాలతో కలిసి తెలంగాణలో పీపీపీని ప్రోత్సహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని భారత మండపంలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్' సదస్సులో ఆయన పాల్గొన్నారు. అమెరికా, ఇండియా వాణిజ్య మండలి ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కృత్రిమ మేధ (ఏఐ) ఆవిష్కరణలకు తెలంగాణ వేదికగా ఉందని మంత్రి అన్నారు.పెట్టుబడిదారులకు ఐటీ రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలో తమ ప్రభుత్వ స్థిరమైన విధానాల కారణంగా ఏఐ పరిశోధనలకు రాష్ట్రం వేదికగా మారింది. ప్రజాసేవల్లోనూ ఏఐ ద్వారా వేగంగా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

# తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టలో ఎదురు కాల్పులు.. ఇద్దరు మావోయిస్టులు మృతి

- మొదటి పేజి తరువాయి

చెందిన బెటాలియన్ ఇన్‌ఛార్జ్ కేసా సోఢీ ఈ ప్రాంతంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టారు. సుమారు రెండు వేల మంది జవాన్లు కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో రెండు రోజులుగా జల్లెడ పడుతుండగా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు జరపగా, పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. సీఆర్పీఎఫ్, కోబ్రా, డీఆర్జీ, సీఏఎఫ్ సంయుక్త బలగాలు గత ఏడాది ఏప్రిల్ నెలలో 21 రోజుల పాటు కర్రెగుట్టలో నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో 31 మంది మావోయిస్టులు మృతి చెందారు. అయితే అప్పుడు మావోయిస్టు పార్టీ సీనియర్ క్యాడర్ తప్పించుకుంది. వారి కోసం భద్రతా బలగాలు జల్లెడపడుతున్నాయి.

# ఉచిత పథకాలతో డబ్బు వృథా.. సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..

రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఉచిత పథకాలు దేశ ఆర్థిక వృద్ధికి ఆటంకమవుతాయని సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్తు ఇవ్వడం కన్నా ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి సారించాలని సూచించింది. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వ ఉచిత విద్యుత్తు ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం సీరియస్‌గా స్పందించింది. వినియోగదారుల ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రాష్ట్రంలోని అందరికీ ఉచిత విద్యుత్ అందించేలా తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వంపై దాఖలైన పిటిషన్ ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పట్టించుకోకుండా ఉచిత విద్యుత్తును ఎలా అందిస్తారని ప్రశ్నించింది.చాలా రాష్ట్రాల్లో రెవెన్యూ లోటు పెరుగుతోందని... అయినప్పటికే ఉచిత పథకాల పంపిణీ జరుగుతోందని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి ఉచిత పథకాల వల్ల దేశ అభివృద్ధికి విఘాతం కలుగుతుందని వ్యాఖ్యానించింది. సంక్షేమ పథకాల్లో భాగంగా కరెంట్ బిల్లులు చెల్లించలేని వారికి ఉచిత విద్యుత్ అందిస్తామంటే ఒక అర్థం ఉంటుందని... కానీ, మీరు ఆర్థిక స్థాయితో సంబంధం లేకుండా అందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని చెబుతున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఆహారం, విద్యుత్ ఇలా అన్నీ ఫ్రీగా ఇస్తూ... మనం ఎలాంటి సంస్కృతిని అభివృద్ధి చేస్తున్నామని ప్రశ్నించింది. ఎన్నికలకు ముందే రాష్ట్రాలు ఇలాంటి ఉచిత పథకాలను ఎందుకు తీసుకొస్తున్నాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఎన్నికల సమయంలో అన్నీ ఉచితంగా ఇచ్చుకుంటూ పోతే... అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా కూడా మిగలదని వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

# కాలేజీలు, స్కూళ్లకు ఏఐని అందుబాటులోకి తీసుకొస్తాం

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026లో కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ భారత్ భవిష్యత్ ఏఐ ప్లాన్‌ను స్పష్టంగా వివరించారు. దేశాన్ని ప్రపంచ ఏఐ పటంలో నాయకుడిగా నిలబెట్టడమే లక్ష్యంగా పాఠశాల, కాలేజీ స్థాయి సిలబస్‌ను పూర్తిగా మారుస్తున్నామని ప్రకటించారు.విద్యార్థులకు ఏఐ నాలెడ్జ్ ను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి అన్నారు. పాఠశాలలు, కళాశాలలకు ఏఐ సాధనాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. విద్యార్థులు కేవలం సాంకేతికతను నేర్చుకోవడమే కాకుండా, సమస్యలకు కొత్త పరిష్కారాలను అభివృద్ధి చేసేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. "దేశంలో ప్రతిభకు కొరత లేదు. యువత భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా నైపుణ్యాలు మెరుగుపరుచుకుంటే... భారత్ ప్రపంచ ఏఐ పటంలో అగ్రస్థానంలో నిలుస్తుంది" అని అన్నారు. సెమీకండక్టర్, టెలికాం రంగాల్లో సాధించిన విజయాల తరహాలోనే ఏఐ మిషన్‌ను వేగవంతం చేస్తామని మంత్రి అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీ వంటి సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాయని ప్రశంసించారు.

# బాల్క సుమన్ ను 200 కి.మీ. దూరంలో ఉన్న జైలుకు తరలించడం అన్యాయం

- ఆదిలాబాద్ జైల్లో ఉన్న బాల్క సుమన్‌ను కలిసిన హరీశ్
- బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయమని వ్యాఖ్య
- భవిష్యత్తులో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్న హరీశ్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదిలాబాద్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తో మాజీ మంత్రి హరీశ్ రావు ములాఖత్ అయ్యారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. క్యాతనపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని మండిపడ్డారు. "ప్రజలు ఇచ్చిన తీర్పును కాదని బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడం సరికాదు. మంచిర్యాల

- మిగతా 4లో...

## పెన్ పవర్ తెలంగాణ రౌండప్



ఛత్రపతి శివాజీ తల్లి పాత్రలో మనస్విత చికిలే.. ఛత్రపతి విగ్రహం కూడా చూడవచ్చు..





## వీరనారి జిజియాబాయి పాత్రలో...
# మనస్విత చికిలే...

- పి.జి కళాశాలలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు..
- ఆకట్టుకున్న మనస్విత నటన.. పలువురి ప్రశంసలు..
- ఛత్రపతి శివాజీకి జన్మనిచ్చిన తల్లి స్ఫూర్తి, అయిన తల్లి జిజియాబాయి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** సికింద్రాబాద్‌లోని పి.జి కళాశాలలో నిర్వహించిన ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా మహారాష్ట్ర గర్వకారణమైన వీరనారి జిజియాబాయి పాత్రలో పి.జి మొదటి సంవత్సరం విద్యార్థిని మనస్విత చికిలే ఎంతగానో ఆకట్టుకుంది.. గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఆమె, ఛత్రపతి శివాజీకి స్ఫూర్తి అయిన ఆయన తల్లి జిజియాబాయి పాత్రను సమర్థవంతంగా పోషించి ప్రేక్షకులను మెప్పించింది.. శివాజీకి జన్మనివ్వడమే కాకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను నింపిన జిజియాబాయి వ్యక్తిత్వాన్ని వేదికపై సజీవంగా ప్రతిబింబించిన మనస్వితకు కళాశాల ప్రొఫెసర్లు, తోటి విద్యార్థులు


అభినందనలు తెలిపారు.. మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన జిజియాబాయి పాత్రను పోషించడం తనకు గర్వకారణమని మనస్విత పేర్కొంది.. ఈ కార్యక్రమం దేశభక్తి స్ఫూర్తిని నూరిపోసేలా సాగడంతో పాటు విద్యార్థుల్లో చరిత్రపట్ల ఆసక్తిని పెంపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. సికింద్రాబాద్ పి.జి కళాశాల వేదికగా జరిగిన ఈ వేడుకలు విద్యార్థుల సాంస్కృతిక ప్రతిభను వెలికితీసేలా నిలిచాయి.



మనస్విత చికిలే.. జిజియా బాయి వేషధారణలో..

## తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

- ఈసారి ఇంటర్ పరీక్షలు రాయనున్న 9.9 లక్షల మంది విద్యార్థులు
- ఈరోజు ఇంటర్ హాల్ టికెట్ల విడుదల
- ఎగ్జామ్ సెంటర్లను ఈజీగా గుర్తించేందుకు క్యూఆర్ కోడ్ ముద్రణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెల 25వ తేదీ నుంచి తెలంగాణలో ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 9.9 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజవుతున్నట్టు ఇంటర్ బోర్డు తెలిపింది. మరోవైపు ఇంటర్ పరీక్షల హాల్ టికెట్లను ఈరోజు విడుదల చేశారు. ఆయా కళాశాలల ఆన్ లైన్ లాగిన్లతో హాల్ టికెట్లను అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి





ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మాజీ కౌన్సిలర్..

# భౌరంపేట్‌లో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

- శివాజీ ఆశయాలు యువతకు స్ఫూర్తి: మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..
- ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన గ్రామస్తులు..
- "జై భవాని-వీర శివాజీ" నినాదాలతో, ఉత్సాహంతో ఊరంతా బైక్ ర్యాలీ..
- 18 ఏళ్లుగా జయంతి వేడుకలు నిర్వహిస్తున్న శివాజీ యూత్‌కు అభినందనలు..
- ధర్మ రక్షణ, స్వదేశాభిమానం, నీతి పాలనకు శివాజీ ఆశయాలు శాశ్వత స్ఫూర్తి..
- పార్టీలకు అతీతంగా నాయకులు, యువత, గ్రామపెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలు..

పార్టీలకు అతీతంగా గ్రామస్తుల బైకు ర్యాలీ..



**దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 19:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్ జీహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ గ్రామంలో, మహావీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.. గ్రామంలో "శివాజీ యూత్" ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.. ఈ సందర్భంగా గ్రామంలోని శివాజీ మహరాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.. అనంతరం యువత భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా "జై భవాని-వీర శివాజీ" నినాదాలతో బౌరంపేట్ గ్రామం మారుమ్రోగింది.. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, గత 18 సంవత్సరాలుగా శివాజీ యూత్ సభ్యులు నిర్విరామంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని అభినందించారు.. ధర్మ రక్షణ, స్వదేశాభిమానం, నీతి పాలన కోసం శివాజీ మహరాజ్ చూపిన పరాక్రమం భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు.. ఆయన ఆశయాలు ప్రతి భారతీయునికి శాశ్వత స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, మిద్దెల యాదిరెడ్డి, పీసరి కృష్ణారెడ్డి, పీసరి మహేందర్ రెడ్డి, నాచారం మురళీ యాదవ్, పాల్గొన్నారు. అలాగే శివాజీ యూత్ సభ్యులు శంభిపూర్ కుమార్, చింత రాము, కటకం విజయ్, కిరణ్ బాబు తదితరులతో పాటు గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# బాల్క సుమన్ ను 200 కి.మీ. దూరంలో ఉన్న జైలుకు తరలించడం అన్యాయం

-3 పేజి తరువాయి
జిల్లా క్యాతనపల్లిలో మహిళల పట్ల కాంగ్రెస్ నేతలు అసభ్యకరంగా ప్రవర్తించారు. మంత్రి వివేక్ సైతం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం మత్తులో బీఆర్ఎస్ మహిళా కౌన్సిలర్లను అగౌరవపరిచారు. అయినా పోలీసులు చోద్యం చూశారు. బాల్క సుమన్‌ను సమీప జైల్లో పెట్టకుండా 200 కి.మీ దూరంలో ఉన్న ఆదిలాబాద్ జైలుకు తరలించడం అన్యాయం" అని హరీశ్ మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తుంటే రాహుల్ గాంధీకి పట్టదా? అని ప్రశ్నించారు. ప్రజల రక్షణ కోసం కవాతు నిర్వహించాల్సిన పోలీసులు బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేసేందుకు కవాతు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని... పోలీసులు అత్యుత్సాహం చూపిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు, ఈ ములాఖత్‌లో మాజీ మంత్రి జోగురామన్న, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నాయకులు దివాకర్ రావ్, ప్రవీణ్ కుమార్, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇంటర్ హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

-3 పేజి తరువాయి
విద్యార్థులు తమ కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించి హాట్ టికెట్లు తీసుకోవాలని అధికారులు సూచించారు. మొబైల్ ఫోన్ల ద్వారా కూడా హాల్ టికెట్లను పొందే సదుపాయాన్ని కల్పించారు. బోర్డు వద్ద విద్యార్థులు నమోదు చేసుకున్న రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా హాల్ టికెట్ డౌన్ లోడ్ లింక్ ను పంపిస్తున్నట్టు బోర్డు తెలిపింది. హాల్ టికెట్లలో ఏమైనా తప్పులు ఉన్నట్టు గుర్తిస్తే... వెంటనే ప్రిన్సిపాళ్ల ద్వారా బోర్డు దృష్టికి తీసుకొచ్చి, తప్పులను సరిదిద్దుకోవాలని చెప్పారు.
మరోవైపు ఈసారి హాల్ టికెట్లపై ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ ను ముద్రించారు. దీన్ని స్కాన్ చేయడం ద్వారా ఎగ్జామ్ సెంటర్ ఎక్కడ ఉందో సులభంగా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# రేవంత్ వన్ మ్యాన్ షో

**హైదరాబాద్,, ఫిబ్రవరి 19 పెన్ పవర్:**
తెలంగాణలో ఇటీవల ముగిసిన మున్సిపల్ ఎన్నికలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఒక యాసిడ్ టెస్ట్‌గా నిలిచాయి. ప్రభుత్వ వ్యతిరేకత పేరుతో జరుగుతున్న ప్రచారాన్ని తిప్పికొట్టి.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 80 శాతానికి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరేయడం రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహ చతురతకు నిదర్శనంగా మారింది. ముఖ్యంగా పట్టణ ఓటర్లు కూడా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడం, గతంలో కేవలం గ్రామీణ పార్టీగా ఉన్న ముద్రను రేవంత్ చెరిపివేయగలిగారు. ఈ విజయంతో ఆయన హైకమాండ్ వద్ద తన పరపతిని అమాంతం పెంచుకున్నారు.ఢిల్లీ వేదికగా రేవంత్ రెడ్డి చేసిన నేనే రాజు.. నేనే మంత్రి వ్యాఖ్యలురాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. అయితే, దీనిపై ఆయన తర్వాతి కాలంలో స్పష్టత ఇచ్చారు. తాను ముఖ్యమంత్రిగా ఉండటంతో పాటు, మున్సిపల్ పరిపాలన శాఖను కూడా తానే పర్యవేక్షిస్తున్నందున, ఈ ఎన్నికల గెలుపోటములకు తానే పూర్తి బాధ్యత వహిస్తాననే ఉద్దేశంతో ఆ మాట అన్నట్లు వివరించారు. ఒక సేవకుడిగానే తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నానని చెబుతూనే, బాధ్యతను భుజానికెత్తుకునే విషయంలో తనకున్న తెగింపును ఈ వ్యాఖ్యల ద్వారా చాటారు. కాంగ్రెస్ పార్టీలో సహజంగా ఉండే గ్రూపు రాజకీయాలు రేవంత్ రెడ్డి విషయంలో ఇప్పుడు మచ్చుకైనా కనిపించడం లేదు. పార్టీలో ఆలస్యంగా చేరినప్పటికీ, సీనియర్లను సమన్వయం చేసుకుంటూనే, తన నిర్ణయాలే ఫైనల్ అనే స్థాయికి ఆయన ఎదిగారు. గతంలో బహిరంగంగా విమర్శలు చేసిన నాయకులు కూడా ఇప్పుడు మౌనం వహించడం. రేవంత్ నాయకత్వాన్ని సమర్థించడం ఆయన సాధించిన అతిపెద్ద రాజకీయ విజయం. హైకమాండ్ పూర్తి మద్దతు ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో రేవంత్ ఇప్పుడు ఒక్కడే మొనగాడుగా కనిపిస్తున్నారు. రాజగోపాల్ రెడ్డి వ్యతిరేక కామెంట్లు చేస్తున్నా ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ నెక్స్ట్ జనరేషన్ లీడర్‌గా గుర్తింపు పొందుతున్నారు. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడుతూ జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో పార్టీకి స్టార్ క్యాంపెయినర్‌గా మారుతున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నమ్మకాన్ని చూరగొనడంలో ఆయన సఫలీకృతులయ్యారు.వరుసగా అసెంబ్లీ, పార్లమెంట్, పంచాయతీ ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంతో తెలంగాణలో రేవంత్ రెడ్డికి ఎదురులేకుండా పోయింది. అటు విపక్ష బీఆర్ఎస్ బలహీనపడటం, ఇటు బీజేపీ పట్టణ ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో పుంజుకోకపోవడం రేవంత్‌కు కలిసొచ్చింది. తన సంక్షేమ పథకాలు, దూకుడుగా ఉండే రాజకీయ శైలితో రేవంత్ రెడ్డి తెలంగాణ రాజకీయ యవనికపై ఒక బలమైన ముద్ర వేశారు. ఇది రేవంత్ నాయకత్వ పరంగా పంజుకోవడానికి కలసి వచ్చింది.

# కాడిని వదిలేసిన రాకేష్ రెడ్డి

**నిజామాబాద్, ఫిబ్రవరి 19, పెన్ పవర్:**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో.. బీజేపీకి పట్టుంది. కాషాయం కంచుకోటల్లో.. ఆర్మూర్ పట్టణం ఒకటని నమ్ముతారు ఆ పార్టీ పెద్దలు. అందుకు తగ్గట్టే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి 18వేల మెజార్టీతోగెలిచారు. అలాగే... లోక్‌సభ ఎన్నికల్లోనూ.. ఆర్మూర్ టౌన్‌లో ఆ పార్టీకి చెప్పుకోతగ్గ ఓట్లు పడ్డాయి. పటిష్టమైన క్యాడర్, బలమైన సంఘ్ పరివార్ నేతలు ఉండటం ఇక్కడ మనకు ప్లస్ అంటూ లెక్కలేసుకుంటూఉంటారు కమలం లీడర్స్. అందుకే మున్సిపల్ ఎన్నికల్లో.. ఆర్మూర్ పీఠం మనదేనని గట్టిగా నమ్మారు. బయట కూడా ఈ టౌన్ బీజేపీదే అనేలా.. టాక్ నడిచింది. కానీ... తీరా చూస్తే.... యాంటీ క్లైమాక్స్ కనిపించింది.ఫలితాలు తలకిందులై ఆ పార్టీకి ఊహించని షాక్ ఇచ్చాయి. స్థానికంగా బీజేపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ.. కేవలం 8 వార్డులనే గెల్చుకోవడం ఏంటో అర్ధంగాక పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారట.అసలు ఎక్కడ తేడా కొట్టిందంటూ ఎవరికి వారు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఈ మున్సిపాలిటీలో 36 వార్డులు ఉండగా.. 19 చోట్ల గెలిచి ఛైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. కానీ... అంత హైప్ ఉన్నబీజేపీ మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితమై కొత్త సందేహాలకు లేవనెత్తిందంటున్నారు పరిశీలకులు. ఇక్కడ బీఆర్ఎస్ ఐదు, స్వతంత్రులు ముగ్గురు గెలవగా.. ఎంఐఎం అభ్యర్థి ఒక చోట విజయం సాధించారు. గెలుపుమాదేనని ధీమాగా ఉన్న బీజేపీ కేడర్ ఫలితాల షాక్ నుచి ఇంకా కోలుకోలేకపోతోందట. దీంతో అట్టర్ ఫ్లాప్ షోకు.. కారణం ఎవరన్న చర్చ పార్టీలో జోరుగా జరుగుతోంది.ఆర్మూర్ ఫలితాలపై విశ్లేషణ చేస్తామని పార్టీ ఎంపీసైతం అనడం, లోకల్ కేడర్‌కు ఎంపీ అర్వింద్ క్షమాపణ చెప్పడం లాంటి పరిణామాల్ని చూస్తుంటే.... ఇదేం యాదృచ్ఛికంగా జరిగింది కాదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయంటున్నారు కొందరు. పట్టణంలో బలమైన క్యాడర్ ఉండటం, స్థానికంగా పార్టీ ఎమ్మెల్యే ఉండటం లాంటి బలమైన కారణాలు చాలానే కనిపిస్తున్నా... గెలుపునకు బదులు సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం వెనకున్న కథల్ని వెలికితీసే పనిలో పార్టీ పెద్దలున్నట్టు
సమాచారం. ఆరెడీ రంగంలోకి దిగి విశ్లేషణలు మొదలుపెట్టినట్టు సమాచారం. సీనియర్ లీడర్స్ మధ్య అంతర్గత విబేధాలు, పట్టణంలో ముఖ్య నేతలు పోటీకి దూరంగా ఉండాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది..? ఎలక్షన్‌టైంలో సీనియర్స్ ఇళ్ళకే ఎందుకు పరిమితం కావాల్సి వచ్చింది లాంటి అనేక అంశాలపై చర్చ జరుగుతోందట. వాటన్నిటికీ మించి కాంగ్రెస్ మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న నాయకుడు పోటీ చేసిన వార్డులో బీజేపీ తన అభ్యర్థిని ఎందుకు నిలపలేదన్నది బిగ్ క్వశ్చన్.ఈ విషయంలో తెర వెనుక ఏం జరిగిందంటూ.... అన్ని అంశాలపై పార్టీ బాధ్యులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట తీరు, వాడే భాషసైతం ఫలితాలపై ప్రభావం చూపిందనే చర్చ ఉంది. ఆయన దూకుడు తత్వం అసెంబ్లీ ఎన్నికల్లో సక్సెస్‌కు కారణం కాగా.. మున్సిపల్ ఎన్నికలకు వచ్చేసరికి అదే మైనస్ అయిందన్న మాటలు సైతం వినిపిస్తున్నాయిఆర్మూర్‌లో. ఎమ్మెల్యే వైఖరి పార్టీని కూడా బలహీనపరుస్తోందని అంటున్నారు. సాధారణంగా....ఎన్నిక ఏదైనా దగ్గరుండి పర్యవేక్షించే ఎంపీ అర్వింద్.. ఆర్మూర్ మున్సిపాలిటీని ఎమ్మెల్యేకే వదిలేశారట. ఆయన పర్యవేక్షణ లేకపోవడం కూడా మెరుగైన ఫలితాలు రాకపోవడానికి ఓ కారణంగా చర్చ జరుగుతోంది. అందుకే... రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పర్యవేక్షణ బాధ్యతను ఎంపీనే తీసుకోవాలన్న డిమాండ్‌పెరుగుతోంది. ఆర్మూర్ ఫలితాల్లో లెక్క ఎక్కడ తప్పిందో....అది కాకతాళీయమా లేక కావాలనే జరిగిందా? తెర వెనక సంగతులేంటో... పార్టీ పెద్దలు తేల్చాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది ఆర్మూర్ కాషాయ దళంలో.

# రాజేందర్, రఘునందనరావులు ఎందుకలా...

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, పెన్ పవర్:**
తెలంగాణ బీజేపీ ఎంపీలు ఇద్దరు కాస్త తేడాగా వ్యవహరించారా? వాళ్ళ నిర్ణయంతో పార్టీ కేడర్ కూడా షాక్ అయిందా? ఆ మార్పు పార్టీకి తెలిసే జరిగిందా? లేక వ్యక్తిగతమా? ఎవరా ఇద్దరు లోక్‌సభ సభ్యులు? తేడా అనిపించేలా ఏం చేశారు? తెలంగాణలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. అందులో చిత్ర విచిత్ర పరిణామాలు చోటు చేసుకున్నాయి. హంగ్ వచ్చిన మున్సిపాలిటీల్లో ఎవరు ఎవరితో కలిశారు, ఏం పంచుకున్నారన్నది చివరి వరకు ఉత్కంఠగా మారి..... సస్పెన్స్ థ్రిల్లర్‌ని మరిపించింది. ఈ విషయంలో కమలం పార్టీ వైఖరి గురించి ప్రత్యేక చర్చలు జరుగుతున్నాయి. కాషాయ దళం ఒక్కో
మున్సిపాలిటీలో ఒక్కోలా వ్యవహరించి అసలు వీళ్ళు ఎటున్నారన్న సంగతి అర్ధంకాకుండా చేసింది. అనైతిక పొత్తులు పెట్టుకోబోం, ఎవరితో కలవబోమంటూ.... సింగిల్ లార్జెస్ట్ పార్టీగా ఉన్న కొన్ని చోట్ల ఉన్న అవకాశాన్ని వదిలేసుకుంది బీజేపీ. సరే... అది మంచి సంప్రదాయం, ఆదర్శవంతమైన రాజకీయం అనుకుంటుండగానే...మరికొన్ని చోట్ల అన్నిటినీ పక్కన పెట్టేసి అధికారం కోసం ప్రత్యర్థులతో జతకట్టి ముక్కున వేలేసుకునేలా చేసింది. ఒకచోట కాంగ్రెస్‌తో, మరొక చోట బీఆర్ఎస్‌తో చేతులు కలిపిన తీరును చూసి వీళ్ళేంటో... వీళ్ళ విధానాలేంటో... అసలేం అర్థంకావడం లేదన్న రావు రమేష్ సినిమా డైలాగ్‌ని గుర్తు చేసుకుంటున్నారు పొలిటికల్ పండిట్స్. అందరిలాగే... బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే మున్సిపాలిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ముందే అంచనాలు వేసుకుని పార్టీకి అవసరం అనుకున్న చోట నమోదు చేసుకున్నారు. అయితే... ఇద్దరు ఎంపీలు అండ్ సీనియర్ లీడర్స్ రఘునందన్ రావు, ఈటల రాజేందర్ అందుకు భిన్నంగా వ్యవహరించారు. అస్సలు ఎవరూ ఊహించని చోట వాళ్ళు ఎక్స్‌అఫిషియో ఓటర్స్‌గా నమోదు చేసుకున్నారు.ఈ విషయం బయటికి తెలిశాక ఆశ్చర్యపోతున్న చాలామంది వాళ్లు అక్కడే ఎందుకు నమోదు చేసుకోవాల్సి వచ్చింది? బ్యాక్‌గ్రౌండ్ స్టోరీ ఏంటి అంటూ చర్చించుకుంటున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ఇస్నాపూర్ మున్సిపాలిటీలో ఎక్స్ అఫిషియోగా నమోదయ్యారు. ఇక ఈటల రాజేందర్ ఎల్లంపేట మున్సిపాలిటీలో చేసుకున్నారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే... ఇస్నాపూర్‌లో బీజేపీ ఒక్క వార్డ్ కూడా గెలుచుకోలేదు. అయినా సరే... ఎంపీ అక్కడెందుకు ఓటు నమోదు చేసుకున్నారన్నది మిలియన్ డాలర్ క్వశ్చన్. పైగా.... లోకల్ ఎమ్మెల్యే మహిపాల్
రెడ్డి, రఘునందన్‌రావు కలిసి ఒకే కారులో రావడం చూసి అక్కడున్నవారంతా షాకయ్యారట. దీని గురించే పార్టీలో హాట్ హాట్ డిస్కషన్ నడుస్తోంది. మహిపాల్‌రెడ్డి బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకుని మళ్ళీ పాత గూటికి చేరుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆ ఎన్నికల్లో మహిపాల్‌రెడ్డి వర్గం మొత్తం బీఆర్ఎస్‌కే సపోర్ట్ చేసిందన్నది లోకల్‌గా చెబుతున్న మాట. పైగా... ఇస్నాపూర్‌లో ఛైర్మన్ సీటును బీఆర్ఎస్ గెల్చుకుంది. బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేయాలన్నది ఎంపీ సొంత నిర్ణయమా లేక ఇంకేదన్నా స్టోరీ ఉందా అన్న కన్ఫ్యూజన్‌లో ఉన్నారట బీజేపీ నాయకులు. స్థానిక రాజకీయాలను దృష్టిలో పెట్టుకొని రఘునందన్‌రావు ఆ నిర్ణయం తీసుకున్నారని ఆయన సన్నిహితులు చెబుతున్నా.... ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలిసి ఒకే కారులో రావడం చూస్తుంటే... అనైతిక పొత్తులు పెట్టుకోబోమన్న మాటలకు అర్థం ఏంటో తెలియడం లేదని మాట్లాడుకుంటున్నారు పార్టీ నాయకులు. ఇదే సమయంలో ఇస్నాపూర్‌లో బీఆర్ఎస్‌కు సపోర్ట్ చేసి మరోచోట ఆ పార్టీ మద్దతు తీసుకున్నారా అన్న చర్చలు సైతం నడుస్తున్నాయి.పార్టీకి తెలిసే ఎంపీ ఆపని చేశారని అంటున్నా... ఎమ్మెల్యేతో కలిసి రావడాన్ని మాత్రం జీర్ణించుకోలేకపోతున్నాయట స్థానిక కాషాయ శ్రేణులు. ఇక ఈటల రాజేందర్ విషయానికి వస్తే.... ఆయన ఎల్లంపేటలో ఎందుకు ఎక్స్‌అఫిషియోగా నమోదు చేసుకోవాల్సి వచ్చింది.... తెరవెనుక జరిగిన పరిణామాలు ఏంటన్న చర్చలు జోరుగా నడుస్తున్నాయి. మంచో చెడో చేసుకున్నారు సరే.... మరి ఛైర్మన్ ఎన్నికను ఎందుకు స్కిప్ చేశారన్నది ఇంకో పెద్ద ప్రశ్న. మేడ్చల్ మల్కాజ్ గిరి పరిధిలో ఆ పార్టీ ఒక చోట బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వగా మరో చోట కాంగ్రెస్‌కు ఇచ్చింది. రెండు చోట్ల బీజేపీకి వైస్ ఛైర్మన్ పదవి దక్కింది. అటు ఎల్లంపేటలో ఎమ్మెల్యే మల్లారెడ్డికి, ఈటలకు మధ్య
చర్చలు జరిగాయని, కానీ... అవి సక్సెస్ కాలేదన్న ప్రచారం ఉంది. తాను అనుకున్న విధంగా పరిణామాలు జరక్కపోవడం వల్లనే ఈటల ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్టు చెప్పుకుంటున్నారు. రేపు గ్రేటర్ పరిధిలో జరిగేమూడు మున్సిపల్ కార్పొరేషన్స్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా నమోదు చేసుకునే అవకాశం ఇద్దరు ఎంపీలకు ఉన్నా... దాన్ని వదిలేసి ఇలా చిన్న పురపాలక సంస్థల్లో ఎందుకు నమోదు చేసుకున్నారన్నది చర్చనీయాంశమైంది.

## కల్లు విక్రయం, స్థల వివాదమే ప్రాణం తీసింది




**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కల్లు విక్రయానికి అడ్డుపడటంతో పాటు స్థలాన్ని ఆక్రమించుకున్నాడనే కోపంతోనే తమ్ముడు మరో ఇద్దరితో కలిసి అన్నను హత్య చేసినట్లు అలంపూర్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. జనవరి 25న ఉండవల్లి మండలం కంచుపాడులో కృష్ణాగౌడ్(43) గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద హత్యకు గురయ్యాడు. పోలీసులు కేసును ఛేదించారు. సాయంత్రం సీఐ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన కృష్ణాగౌడ్ తన చిన్నాన్న కుమారుడు శ్రీనివాస్‌గౌడ్‌ను గ్రామంలో కల్లు విక్రయించకుండా అడ్డుకోవడంతో పాటు ఆయనకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకున్నాడు. దీంతో గ్రామం నుంచి హైదరాబాద్‌కు వెళ్లిపోయిన శ్రీనివాస్‌గౌడ్ అతడిపై కక్ష పెంచుకుని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

## ఇసుక పొలాల్లో చిరుత జాడ కనిపెట్టలేం

**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** మద్దలబండ చిన్నతండాలో చిరుత మంగళవారం రాత్రి రైతు వీరన్న పొలంలో ఉన్న గేదె దూడను లాక్కెళ్లి చంపినట్లు గ్రామస్థులు చెప్పడంతో అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీశారు. అటవీశాఖ క్షేత్రాధికారి ఫర్వీజ్ అహమ్మద్ వివరాల ప్రకారం. చిన్న తండాపరిధిలో రైతు వీరన్న పొలం వద్ద పశువులను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి గుర్తుతెలియని జంతువు దూడను చంపింది. ఘటన జరిగిన ప్రాంతంలో ఇసుక నేలలు ఉండటంతో దాడి చేసిన మృగం అడుగు జాడ గుర్తించలేక పోతున్నామని పేర్కొన్నారు. అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి సుమలత, సెక్షన్ అధికారిణి ప్రసన్నకుమారి, బీట్ అధికారిణి శ్వేత పాల్గొన్నారు.

## వేధింపులతో యువతి ఆత్మహత్య

**నారాయణపేట, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కేటీదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన యువతి (18) సొంత ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రాయచూరు ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునేలోపే ఆమె మృతి చెందినట్లు సమాచారం. స్థానికుల కథనం ప్రకారం.. యువతికి గత నెలలో కేటీదొడ్డి మండలానికి చెందిన హరి అనే యువకుడితో నిశ్చితార్థం అయింది. సదరు యువకుడికి కొన్నేళ్ల కిందట వివాహం కాగా మొదటి భార్య 8 నెలల కిందట ఆత్మహత్య చేసుకుంది. అతడి వేధింపుల కారణంగానే మొదటి భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు అప్పట్లో పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. తాజాగా చింతలకుంటకు ఈ యువతితో రెండో వివాహం నిశ్చయం కాగా ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారన్న కారణంతోనే యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు అంటున్నారు. విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో కేటీదొడ్డి ఎస్సై రాయచూరు ఆస్పత్రి వద్దకు చేరుకొని యువతి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలిసింది.

## పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు



**జడ్చర్ల, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు వెంకటేష్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులను హెచ్చరించారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

## ప్రేమించిన యువతి దూరం పెడుతుందని దారుణం

**సూర్యాపేట, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో ప్రేమించిన యువతి దూరం పెడుతుందన్న కారణంతో యువకుడు ఆమెపై సుత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో యువతి తీవ్రంగా గాయపడటంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. ప్రస్తుతం ఆమె ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ దారుణ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## న్యాయవాదులపై దాడులను ఖండించాలి




**కోదాడ, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కోదాడలో న్యాయవాదులపై దాడులను ఖండించాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య డిమాండ్ చేశారు. నల్గొండలో న్యాయవాది నరేష్ కుటుంబంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులపై దౌర్జన్యాలు పెరుగుతున్నాయని, రక్షణ చట్టం తక్షణమే తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కోదూరు వెంకటేశ్వరరావు, నవీన్, మురళి, తమ్మినేని హనుమంతరావు, రంగారావు, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని దంపతులు మృతి

**తుంగతుర్తి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** నల్గొండ జిల్లా హాలియాలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టడంతో పిట్టల వెంకటయ్య, మల్లమ్మ దంపతులు మృతి చెందారు. మంగళవారం సాగర్ ఎడమ కాలువ కల్వర్టు వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. లారీ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టడంతో దంపతులు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన సీసీ కెమెరాలో రికార్డయింది. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# పవిత్ర రంజాన్- ఉపవాస దీక్షలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ముస్లింల పవిత్ర మాసం రంజాన్ వచ్చేసింది. 18 ఫిబ్రవరి 2026 రోజు సాయంత్రం 7:30 గంటలకు నెలవంక స్పష్టంగా దర్శనం ఇవ్వడంతో మన తెలుగు రాష్ట్రాల ముస్లిం సోదర సోదరీమణులు 'చాంద్ ముబారక్'' అంటూ సంబరాలు చేసుకొని 19 ఫిబ్రవరి 2026 నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రారంభించి నెల రోజుల పాటు జరుపుకుంటారు. ఫిబ్రవరి మాసంలో దీక్షలు ప్రారంభం కావడం అరుదుగా జరుగుతుంది. 33 ఏండ్ల తర్వాత రంజాన్ ఫిబ్రవరి నెలలో ప్రారంభం కావడం విశేషం. రంజాన్ ఉపవాసాలు శీతాకాలంలో ప్రారంభమై వేసవి ప్రారంభ వేళల్లో ముగుస్తుంది. ఇస్లామిక్ కాలపట్టిక 'హిజ్రీ' ప్రకారం 9వ నెలను రంజాన్‌గా పిలుస్తారు. రంజాన్ మాసంలో పవిత్ర గ్రంథం ఖురాన్ అవతరించడం, నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆత్మ శుద్ధి, దాతృత్వం, భక్తిని పెంపొందిస్తాయని నమ్మకం. అల్లాహ్ కోసం ఆకలి, దప్పికను సహిస్తారు. అత్యంత అదృష్ట రాత్రి "లైలతుల్ ఖదర్'' కూడా ఈ మాసంలో రావడం ఒక విశేషం. ఇస్లామిక్ విశ్వాసాల ప్రకారం, దాదాపు 1,400 ఏండ్ల క్రితం రంజాన్ మాసంలో ప్రవక్త ముహమ్మద్‌కు ఖురాన్ వెల్లడైందని విశ్వాసం. సూర్యోదయానికి ముందు (సెహ్రి) భోజనం చేయడం, సూర్యాస్తమయం తర్వాత (ఇఫ్తార్) విందుతో ఫాస్టింగ్‌ను విడవడం ఈ నెల రోజుల పాటు కొనసాగుతుంది. ఉపవాస సమయంలో ఏమీ తినడం, తాగడం, ధూమపానం, మద్యపానం, సంభోగం లాంటివి జరగవు. ఈ మాసంలో అబద్ధాలు ఆడడం, చెడు మాటలు చెప్పడం, కోప్పడడం జరగదు. ప్రతి రోజు పవిత్ర గ్రంథం 'ఖురాన్' పఠనం విధిగా జరుగుతుంది. పేదలతో కలిసి సహారి భోజనాలు చేయడం, ఇఫ్తార్ విందులు, హలీం, ఖుబూబ్, ఖజార్ లాంటి రుచికరమైన వంటకాలు సువాసనలను వెదజల్లుతాయి. రంజాన్ శుభ గడియల్లో తమ సంపాదనలో 2.5 శాతం 'జకాత్' ఇస్తూ, పేదలకు దానధర్మాలు, అనాథలకు చేయూతలు అందిస్తారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, రోగులు, ప్రయాణీకులు, పిల్లలకు ఉపవాస దీక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు తర్వాత సమయాల్లో 'ఖజా' చేయవలసి ఉంటుంది. రంజాన్ ఉపవాస మాసం ముగిసిన రోజు నెలవంక కనిపించడంతో 'ఈద్ ఉల్ ఫితర్' రంజాన్ లేదా 'రమదాన్' పర్వదినం జరుపుకుంటారు. నెల రోజుల ఉపవాస దీక్షలతో జీర్ణ వ్యవస్థకు విశ్రాంతి, పునరుజ్జీవనం, గొప్ప ఆరోగ్య ప్రయోజనం కలుగుతాయి. ఏడాదిగా శరీరంలో పేరుకుపోయిన మలినాలను శుభ్రం చేసి తొలగించడానికి రంజాన్ ఉపవాసాలు ఉపయోగపడతాయి. సూర్యాస్తమయం తర్వాత 'ఇఫ్తార్' విందు చేసి నిద్ర పోవడం, సూర్యోదయానికి ముందు లేచి 'షహూర్' భోజనాలు చేయడం జరుగుతుంది. ఖర్జూరాలు, పరిమిత మాంసాహారాలు, కూరగాయలు, పండ్లు లాంటివి తీసుకోవడం మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏడాదికి ఒక రంజాన్ మాసం ఉపవాసాలతో మిగిలిన 11 నెలల పాటు శరీరం ఆరోగ్యంతో మెరుగ్గా పని చేస్తుంది. ఖురాన్ అవతరించిన రంజాన్ మాసంలో ఆత్మ పరిశీలన, స్వీయ నియంత్రణలకు ప్రాధాన్యం ఇస్తారు. రంజాన్ ఉపవాస దీక్షల శుభ సందర్భంగా ముస్లిమ్ సమాజానికి "రంజాన్ ముబారక్'', "రంజాన్ కరీం'' శుభాకాంక్షలు తెలియజేద్దాం.

# ఏఐ క్యాపిటల్‌గా భారత్

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా వాణిజ్య ఆధిపత్యం, చైనా ఒంటెత్తు పోకడలకు భిన్నంగా భారత్ ఒక 'మూడవ మార్గాన్ని' ప్రపంచానికి పరిచయం చేయబోతున్నదని చెప్పవచ్చు. కీలకమైన సంస్థల డేటా సెంటర్లు ఇండియాలో ఏర్పాటు చేస్తుండటంతో అంతర్జాతీ యంగా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా పనిచేయాలి? దాని పరిమితులు పరిధులు కూడా నిర్ణయించే దిశగా అడుగులు వేస్తున్నది. ఈ సదస్సు చివరిరోజున అంటే ఫిబ్రవరి 20వ తేదీన భారత్ 'ఢిల్లీ డిక్లరేషన్' పేరిట ఓ డ్రాఫ్ట్ విడుదల చేయ బోతున్నది. అది భవిష్యత్తులో ఏఐ ఎలా పనిచేయాలన్న విధివిధానాలకు మార్గదర్శకంగా నిలవబోతున్నది. ఇప్పటికే ప్రధాని డీప్ ఫేక్ లాంటి సమస్యలను బహిరంగంగానే లేవనెత్తారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఎలా ఉండాలన్నది డిక్లరేషన్‌లో చర్చకు రానున్నది. ఇక ఏఐ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం కాకు డదని.. ఆఫ్రికా వంటి పేద దేశాలకు కూడా అందేలా చూడాలని పిలుపు ఇవ్వనున్నారు.. మొత్తంగా ఏఐకి భారత్ క్యాపిటల్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతిమంగా భారత్ ఇప్పుడు కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదు.. ఏఐ ప్రపంచానికి మార్గదర్శి లేదా దిక్సూచిగా మారబోతోంది. భారత్ ఏఐ హబ్‌గా మారడానికి ఉన్న అవకాశాలు మరే దేశానికీ లేవన్నది వాస్తవం. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. డేటా వైవిధ్యం.. భారత్‌లోని భాషలు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులు ఏఐ అల్గారిథమ్స్ శిక్షణకు అద్భుతమైన ముడిసరుకు.. ఇక్కడ ఒక ఏఐ మోడల్ సక్సెస్ అయిందంటే, అది ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయగలదని అంతర్జాతీయంగా పేరొందిన టెక్ కంపెనీలు నమ్ముతున్నాయి. అందుకే అమెరికాలోనే ఉచితంగా ఇవ్వని ఏఐ అత్యాధునిక మోడళ్లను ఇక్కడ ఉచితంగా అందజేస్తున్నాయి. ఇక డెమోగ్రాఫిక్ డివిడెండ్.. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభాతోపాటు ఇంగ్లిష్ మాట్లాడే సాంకేతిక నిపుణులు భారత్ సొంతం. ఇది అంతర్జాతీయ సంస్థలను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. దీంతో పాటు ప్రధానమైన మరో అంశం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. యూపీఐ లాంటి వ్యవస్థల ద్వారా సామాన్యుడిని డిజిటల్ పరిధిలోకి తెచ్చిన అనుభవం భారత్‌కు ఉంది. ఇప్పుడు అదే స్ఫూర్తితో 'ఇండియా ఏఐ మిషన్' సాగుతున్నది.

కొన్నేళ్ల క్రితమే భారత ప్రభుత్వం ఒక నిబంధన తెచ్చింది. 'భారతీయుల డేటా (ముఖ్యంగా బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు) భారత గడ్డపై ఉన్న సర్వర్లలోనే ఉండాలి.' దీంతో గతంలో అమెరికా లేదా సింగపూర్‌లో సర్వర్లు పెట్టుకున్న గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు తప్పనిసరిగా భారత్‌లో డేటా సెంటర్లు నిర్మించా ల్సి వచ్చింది. ఇది ఒక ముందస్తు 'మాస్టర్ ప్లాన్'. అందుకోసమే ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం డేటా సెంటర్ల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విదేశీ క్లౌడ్ కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు పెట్టి ఇక్కడి నుండి ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తే, వారికి 2047 వరకు పన్ను మినహాయింపులు ప్రకటించింది. డేటా సెంటర్లను 'మౌలిక సదుపాయాల' జాబితాలో చేర్చడం వల్ల వీరికి తక్కువ వడ్డీకే రుణాలు దొరుకుతున్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్, ముంబై, పుణె ప్రాంతాల్లో సుమారు 21.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నది. విశాఖపట్నంలో గూగుల్ తన మొదటి పూర్తిస్థాయి 'ఏఐ హబ్'ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్లు కేటాయించింది. రిలయన్స్, అదానీ వంటి స్వదేశీ దిగ్గజాలు కూడా గిగావాట్ స్థాయి డేటా సెంటర్లను గుజరాత్, మహారాష్ట్ర తోపాటు ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మిస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా సెంటర్ నిర్వహణ ఖర్చు (ముఖ్యంగా లేబర్, కన్స్ట్రక్షన్) చాలా తక్కువ. భారత్ సౌర విద్యుత్ రంగంలో దూసుకుపోతున్నది. డేటా సెంటర్లకు కావలసిన భారీ విద్యుత్తును గ్రీన్ ఎనర్జీ ద్వారా అందించడం వల్ల అంతర్జాతీయ కంపెనీలకు తమ 'కార్బన్ ఫుట్‌ప్రింట్' తగ్గించుకునే అవకాశం దొరుకు తోంది. 'డేటా ఇస్ ద న్యూ ఆయిల్' అని మనందరికీ తెలుసు.. ఆ చమురును నిల్వ చేసే 'ట్యాంకర్లే' ఈ డేటా సెంటర్లు.. భారత్ ఇప్పుడు ప్రపంచానికి డిజిటల్ గిడ్డంగిగా మారబోతున్నది. ఏఐ వల్ల కలిగే లాభాల కంటే, దాని మిస్ యూజ్ గురించిన ఆందోళనలే ఎక్కువ. అందుకే నియమ నిబంధనల విషయంలో భారత్ కఠినంగా వ్యవహరించనున్నది. భారతీయ వినియోగదారుల డేటా భారత గడ్డపైనే ఉండాలి. విదేశీ సంస్థలు మన డేటాను 'టెస్టింగ్ ల్యాబ్'గా వాడుకోవచ్చు కానీ, దానిని మనకు వ్యతిరేకంగా వాడకుండా చూడాలి. జర్నలిజం రంగంలో ఏఐ వల్ల తప్పుడు వార్తలు వ్యాపించే ప్రమాదం ఉంది. దీనిని అరి కట్టేలా ఏఐ కంటెంట్‌కు 'డిజిటల్ వాటర్‌మార్క్' తప్పనిసరి చేసే దిశగా చట్టాలు రాబోతున్నాయి. ముఖ్యంగా బ్యాం కింగ్, వైద్యం వంటి రంగాల్లో ఏఐ వాడకంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ అవసరం. అంతేకాకుండా కొన్ని దశాబ్దాల కిందట భారతదేశం మెడికల్ డ్రగ్ ట్రయల్స్‌కు బలైంది.. గతంలో జరిగిన 'డ్రగ్ ట్రయల్స్' చేదు జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు జరుగుతున్న 'డేటా ట్రయల్స్' విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. ప్రజలు సమాచారాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఆ సమాచారం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. డేటా సెంటర్లు సహా ఇతర వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఎన్ని రాయితీలు ఇచ్చినా డేటా దుర్వినియోగం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నది.

## ఆర్టీఏ కార్యాలయాల్లో ఆగని నకిలీ దందా

**పాలకుర్తి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** వరంగల్ జిల్లా ఆర్టీఏ కార్యాలయం ఆవరణ నకిలీ ధ్రువీకరణ పత్రాల తయారీకి అడ్డాగా మారింది. గతంలో నకిలీ పత్రాలతో ఓ ట్రాక్టర్‌ను యజమానికి తెలియకుండా.. ఆధార్ కార్డుపై మరొకరి ఫొటో పెట్టి రిజిస్ట్రేషన్ చేసిన విషయం మరవకముందే తాజాగా మంగళవారం మరో నకిలీ ఆధార్‌కార్డు జతచేసిన దరఖాస్తు పత్రాలతో వచ్చిన దళారిని ఆర్టీఏ సిబ్బంది పట్టుకున్నారు.

## సంగారెడ్డిలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**సంగారెడ్డి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రహదారిలో గురువారం చత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా శివాజీ విగ్రహానికి పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. 'జై శివాజీ' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు విజయభాస్కర్, వెంకటరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశాలకు సిద్ధం చేయండి

**రామగుండం, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** మొదటి దశలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పనులను మార్చి 31లోగా పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు నిర్వహించుకునేలా చూడాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. అలుగునూరు, రేణికుంట, కోతిరాంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. నిర్మాణానికి అయిన ఖర్చు, బిల్లులు మంజూరు, పనుల్లో ఇబ్బందులపై ఆరా తీశారు. బిల్లులను లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. క్వారీల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

## బీజేపీ-బీఆర్ఎస్ పొత్తుపై పెరుగుతున్న చర్చ

**హైదరాబాద్, ఫిబ్రవరి 19, పెన్ పవర్:**



ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ-కాంగ్రెస్, బీఆర్ఎస్-బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్-మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

## నేలకొండపల్లిలో శివాజీ జయంతి వేడుకలు

**పినపాక, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** నేలకొండపల్లి గ్రామంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పొట్టి శ్రీరాములు సెంటర్ వద్ద హిందువులు చత్రపతి శివాజీ దేశానికి, హిందూ ధర్మానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన హిందూ ప్రజలకు న్యాయం జరిగేలా పోరాడారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రజలు, హిందువులు, క్రైస్తవులు పాల్గొన్నారు. అనంతరం భారీ ర్యాలీతో గ్రామంలో ప్రచారం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో చిన్నలు, పెద్దలు, యువకులు, వృద్ధులు పాల్గొని విజయవంతం చేశారు.

## ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద మున్సిపాలిటీ డ్రైవర్ల ఆందోళన

**భద్రాచలం, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** ఖమ్మం కొత్త బస్టాండ్ వద్ద గురువారం తెల్లవారుజామున ఏఐటీయుసీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. డ్రైవర్ల వేతనాలను కనీసం రూ. 26 వేలకు పెంచాలని, వారికి సేఫ్టీ పరికరాలు అందించాలని, విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల హామీతో నిరసనను తాత్కాలికంగా విరమించారు.

## తల్లికి తలకొరివి పెట్టిన కూతుళ్లు



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని మంగాపురంతండాకు చెందిన తేజావత్ భాగ్యలక్ష్మి (45) అనారోగ్యంతో మరణించారు. ఆమెకు కుమారులు లేకపోవడంతో, ఆమె ఇద్దరు కుమార్తెలు లక్ష్మీప్రసన్న, శ్రీలత (కవలలు) ముందుకు వచ్చి తల్లి అంత్యక్రియల్లో పాల్గొని, పాడె మోశారు. చిన్న కుమార్తె శ్రీలత తన తల్లికి తలకొరివి పెట్టి, తల్లి రుణం తీర్చుకుంది. ఈ సంఘటన అందరినీ కంటతడి పెట్టించింది.

## డంపింగ్ యార్డ్‌లోని సమస్యలను పరిష్కరించాలి

**ఇల్లందు, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** డంపింగ్ యార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పారిశుద్ధ్య వాహన డ్రైవర్లు గురువారం తెల్లవారుజాము నుంచే ఆందోళన చేపట్టారు. ఖమ్మం మున్సిపల్ వాహనాల పార్కింగ్ వద్ద ధర్నాకు దిగారు. ప్రతిరోజు ఒక్కో ట్రాక్టర్ 9 ట్రిప్పులు వేయాలని అధికారులు నిర్ణయించారు. అయితే అది సాధ్యం కాదంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి సరిగా లేకపోవడంతో వాహనాలు డంపింగ్ యార్డ్ లోపలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. రహదారిపై పేరుకుపోయిన చెత్తకుప్పలను తొలగించకుండా తాము వాహనాలను నడపలేమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సహాయ కమిషనర్ అనిల్ కుమార్ తెలిపారు.

## ఘోరం.. నిండు ప్రాణం తీసిన అప్పులు

**నర్సంపేట, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** దామెర మండలంలోని పసరగొండలో తీగుళ్ల చేరాలు (44) అనే ఆటో డ్రైవర్ అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారు. తన ఇంటిని తాకట్టు పెట్టి, బంగారం తనఖా పెట్టి సుమారు రూ. 20 లక్షల వరకు అప్పు తీసుకున్న చేరాలపై రుణ సంస్థల నుంచి ఒత్తిడి పెరిగింది. మనస్తాపానికి గురైన ఆయన తెల్లవారుజామున ఇంట్లోని రేకుల షెడ్డులో ఇనుప పైపునకు ఉరి వేసుకుని మృతి చెందారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు.

## చిన్నారి జీవితాన్ని చిదిమేసిన ఆటో

**పరకాల, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** స్టేషనఘన్పూర్ పట్టణం చాగల్లు ఎస్సీ కాలనీలో సాయంత్రం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. చేపూరి అనూష, రమేశ్ దంపతుల రెండేళ్ల కుమార్తె మన్విత, ఇంటి వద్ద ఆడుకుంటుండగా, నీటి ప్లాంట్ ట్రాలీ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆటో వెనక్కి వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి అనూష నీటి క్యాన్ కొనుగోలు చేసేందుకు వెళ్ళినప్పుడు ఈ దుర్ఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

## బైక్స్ పై స్టంట్ చేసిన అవినాష్ కాలేజీ స్టూడెంట్స్

**జనగామ, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** వరంగల్ ఆకుతోట కన్వెన్షన్ హాల్ లో జరిగిన అవినాష్ కాలేజ్ ఫెవరల్ పార్టీ సందర్భంగా, విద్యార్థులు బైకులపై గురువారం ప్రమాదకరమైన స్టంట్స్ చేశారు. లక్షల్లో ఫీజులు కడుతున్నది చదువు కోసమా లేక బైక్ స్టంట్స్ కోసమా అని స్థానికులు ప్రశ్నించారు. పార్టీ ముగిసిన తర్వాత రోడ్లపై బైకులతో హల్చల్ చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థులను అదుపులోకి తేవడంలో కాలేజీ యాజమాన్యం విఫలమైంది. విద్యార్థులు నడిపిన బైకులకు నంబర్ ప్లేట్లు లేకపోవడం గమనార్హం.

## వైద్యుల నిర్లక్ష్యం.. పీహెచ్‌సీకి తాళం

**భూపాలపల్లి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** భూపాలపల్లి మండలంలోని ఆజంనగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావడం లేదని ఉదయం 9 గంటలకు గ్రామస్థులు పీహెచ్‌సీ ప్రధాన గేట్‌కు తాళం వేసి నిరసన తెలిపి మాట్లాడారు. 'ఆజంనగర్ పీహెచ్‌సీలోని వైద్యులు, సిబ్బంది సక్రమంగా విధులు హాజరు కావడం లేదు. ఉదయం 9 గంటలు దాటినా ఒక్కరు రావడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే చికిత్స పొందే అవకాశం లేకుండా పోయింది. ఈ విషయాన్ని చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎలాంటి మార్పు రాలేదని' గ్రామస్థులు అన్నారు.

## గెలుపు ఆశతో.. అప్పుల ఊబిలోకి..!

**ములుగు, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** ఆటల్లో క్రీడాకారుల నైపుణ్యం.. సామర్థ్యాలు గెలుపోటములకు కారణమవుతాయి. ఎన్నికల విషయానికొస్తే పోటీదారుల గుణగణాలు, పార్టీ సిద్ధాంతాలు ప్రభావం చూపుతాయి. ఎన్నికలంటే ప్రజాస్వామిక ప్రక్రియ అనేది మరిచిపోతున్నాం. చిన్న పదవి కోసం పెద్దమొత్తంలో ఖర్చు చేసే తంతుగా మార్చేశాం. తాజాగా జరిగిన పురపాలక సంఘాల ఎన్నికలు ఇందుకు నిదర్శనమని ప్రజాస్వామ్యవాదులు అంటున్నారు. పోటీని స్నేహపూర్వకంగా తీసుకుంటే సమస్య రాదు. ఆర్థికంగా నష్టపోయే అవకాశమే ఉండదంటున్నారు.

# బెల్లంపల్లిలో కనిపించని బంద్ ప్రభావం

**మంచిర్యాల, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అరెస్ట్ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన మంచిర్యాల జిల్లా బంద్ పిలుపు బెల్లంపల్లి పట్టణంలో పెద్దగా ప్రభావం చూపలేదు. గురువారం ఉదయం బీఆర్ఎస్ నాయకులు దుకాణాలను మూసివేయించినప్పటికీ, యజమానులు వెంటనే వాటిని తిరిగి తెరిచారు. ఆటోలు, బస్సులు యధావిధిగా నడిచాయి.

## పెళ్లి ఇంట్లో తీవ్ర విషాదం

**బెల్లంపల్లి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** బోథ్ మండలం ధన్నూర్ గ్రామానికి చెందిన దోపతి రాధ–భూమన్నల చిన్న కుమారుడు సురేందర్ (33) వివాహం మార్చి 9న జరగాల్సి ఉంది. ఇటీవల దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన సురేందర్, పెళ్లి పనుల్లో ఉండగా, మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా కుచలాపూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సురేందర్ ఆదిలాబాద్ రిమ్స్ లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# రూ. 1. 30 కోటి వ్యవసాయ పనిముట్ల పంపిణీ-రైతులకు అండగా పాల్వాయి

**సిర్పూర్, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కాగజ్ నగర్ బీట్ మార్కెట్ ఆవరణలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ఎస్ఎంఏఎం పథకం కింద రూ. 1.30 కోట్ల విలువైన వ్యవసాయ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. యాంత్రీకరణ ద్వారా దిగుబడి పెంచుకోవాలని, ప్రకృతి వ్యవసాయం చేపట్టి అధిక ఆదాయం పొందాలని సూచించారు. వడ్ల కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు తెలిపారు. ప్యాడి బైలర్, పవర్ రోటోవేటర్, పవర్ ప్లవు, బ్యాటరీ స్ప్రేయర్ వంటి పనిముట్లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిద్ధల దేవయ్య, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి పాల్గొన్నారు.

## పత్తి రైతులు ఆందోళన చెందవద్దు: డా. పాల్వాయి హరీష్ బాబు

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కాగజ్ నగర్లో పత్తి కొనుగోళ్లపై నెలకొన్న అనిశ్చితి నేపథ్యంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు రైతులకు భరోసా ఇచ్చారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న కొనుగోళ్లు ఫిబ్రవరి 20 నుంచి నిలిపివేస్తారనే వార్తలతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ విషయంపై గోడం నాగేష్ మరియు సీసీఐ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని గడువు పొడిగింపునకు చర్యలు చేపడుతున్నారని, రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు.

## పత్తి రైతులు ఆందోళన చెందవద్దు.. ఎమ్మెల్యే

**చెన్నూరు, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కాగజ్నగర్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోళ్లు ఫిబ్రవరి 20 నుంచి నిలిపివేస్తారనే వార్తలపై రైతులు ఆందోళన చెందుతున్నారని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు గురువారం తెలిపారు. ఈ అంశంపై ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్, సీసీఐ ఉన్నతాధికారులు చొరవ తీసుకుని కొనుగోలు గడువును పొడిగించే చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. పత్తి రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

# రాయితీపై వ్యవసాయ యంత్రాల పంపిణి



**జగిత్యాల, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట రైతు వేదిక వద్ద గురువారం, వ్యవసాయ యాంత్రీకరణ పథకం 2025–26 కార్యక్రమంలో భాగంగా, ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఏవో భాస్కర్, సర్పంచ్ గోడిసెల గంగాధర్, ఉప సర్పంచ్ నారాయణ, ఎంపీడీవో విజయ లక్ష్మి, ఎంపివో వాసవి, ఏడిఏ తిరుపతి, నాయకులు నక్కల రవీందర్ రెడ్డి, బాల ముకుందం, రైతులు పాల్గొన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి వస్తాయి.

# 2 లక్షల ఎల్వోసి అందజేసిన ఎమ్మెల్యే



**ధర్మపురి, ఫిబ్రవరి 19 పెన్ పవర్::** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన మల్యాల బాలయ్య యాదవ్ చెట్టుపై నుంచి పడి మెదడు, వెన్నుపూసకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దృష్టికి వెళ్లడంతో, ఆయన వెంటనే స్పందించి, మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయ నిధి ద్వారా 2 లక్షల రూపాయల ఎల్వోసీని బాలయ్య కుటుంబానికి గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఈ సంఘటన బాలయ్య కుటుంబానికి ఊరటనిచ్చింది.

# ఇందిరమ్మ ఇళ్ల ప్రవేశాలకు సిద్ధం చేయండి

**కోరుట్ల, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** మొదటి దశలో ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పనులను మార్చి 31లోగా పూర్తి చేసి లబ్ధిదారులు గృహ ప్రవేశాలు నిర్వహించుకునేలా చూడాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ కార్యదర్శి, హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతమ్ అధికారులను ఆదేశించారు. అలుగునూరు, రేణికుంట, కోతిరాంపూర్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. నిర్మాణానికి అయిన ఖర్చు, బిల్లులు మంజూరు, పనుల్లో ఇబ్బందులపై ఆరా తీశారు. బిల్లులను లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. క్వారీల నుంచి ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# మహిళ బలవన్మరణం

**పెద్దపల్లి, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** అనారోగ్యం తాళలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు ప్పాలడిన ఘటన వేములవాడ పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలానికి చెందిన రోహిణి (32)కి వేములవాడకు చెందిన వెంగల దినేశ్తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. రోహిణి కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నారు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ ఆరోగ్యం కుదుటపడలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రోహిణి తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకున్నారు.

# ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు



**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 19 పెన్ పవర్:** కేశంపేట మండలం పోమాలపల్లి గ్రామంలో గ్రామ యువకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి, మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువ నాయకుడు కంచుకోట మహేష్ మాట్లాడుతూ, శివాజీ మహారాజ్ బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడని, స్వరాజ్య స్థాపనకు పునాది వేసిన గొప్ప యోధుడని కొనియాడారు. చిన్న వయసులోనే స్వరాజ్య స్వప్నాన్ని సాకారం చేసిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# స్థానిక విజయాల ఊపు పరిషత్ ఎన్నికలపై ప్రభుత్వ చూపు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రజా పరిషత్ ఎన్నికల నిర్వహణ గురించి, ప్రభుత్వ యోచన అనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపును సంతరించుకుంది. గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థలో కీలక స్థానం కలిగిన ప్రజా పరిషత్లు కేవలం పరిపాలనా యంత్రాంగం మాత్రమే కాదు; అవి గ్రామీణ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా, సామాజిక కోణాలను సమగ్రంగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన దిశ కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలనలో ఏర్పడిన అంతరాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరిపాలన తాత్కాలిక పరిష్కారమే గానీ, ప్రజా ప్రతినిధుల ద్వారా నేరుగా జరిగే పాలనకు ఇది ప్రత్యామ్నాయం కాలేదు. గ్రామీణ స్థాయిలో అభివృద్ధి పనుల ప్రాధాన్యత, స్థానిక అవసరాలపై స్పందన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ? ఇవన్నీ ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే సమర్థవంతంగా సాధ్యమవుతాయి. అందుకే పరిషత్ ఎన్నికల నిర్వహణపై ఆసక్తి పెరుగుతోంది. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ అత్యధిక స్థానాలను దక్కించుకోవడం రాజకీయంగా కీలక మలుపుగా భావించ బడుతోంది. ఈ విజయాలు గ్రామీణ, పట్టణ స్థాయిల్లో అధికార పక్షానికి బలమైన మద్దతు ఉందన్న సంకేతాలను ఇస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలను త్వరగా నిర్వహిస్తే రాజకీయ లాభం చేకూరుతుందన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయం నిర్ణయించడంలో ఈ రాజకీయ లెక్కలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పరిషత్ ఎన్నికలు నిర్వహించడం పరిపాలనా పరంగా చిన్న విషయం కాదు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల అమలు, భౌగోళిక పునర్విభజన, చట్టపరమైన అనుసరణ ? ఇవన్నీ సమన్వయంతో జరగాలి. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధత కీలకం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. రాజకీయ కోణంలో చూస్తే పరిషత్ ఎన్నికలు సాధారణ స్థానిక పోటీగా మిగలడం లేదు. ఇవి రాష్ట్ర రాజకీయాల దిశను సూచించే సూచికలుగా మారుతున్నాయి. గ్రామీణ ఓటరు తీర్పు సాధారణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి అనుకూలంగా రావడం వల్ల అదే ధోరణి పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఎన్నికల రాజకీయాల్లో స్థానిక అంశాల ప్రాధాన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి ప్రాంతంలో సమీకరణాలు వేరుగా ఉండే అవకాశం కూడా ఉంది. సామాజిక దృష్టితో పరిశీలిస్తే పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని చైతన్యవంతం చేసే ప్రక్రియ. మహిళల రిజర్వేషన్లు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, యువ నాయకత్వానికి అవకాశాలు ? ఇవన్నీ స్థానిక పాలనను సమగ్రంగా మారుస్తాయి. ఎన్నికలు జరిగితే గ్రామస్థాయి నాయకత్వం పునరుద్ధరించ బడుతుంది. ప్రజల సమస్యలు నేరుగా ప్రతినిధుల దృష్టికి చేరుతాయి. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. ఆర్థిక పరంగా ప్రజా పరిషత్ల ప్రాముఖ్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ మౌలిక వసతులు ? రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, పాఠశాల సదుపాయాలు ? ఇవన్నీ స్థానిక సంస్థల ద్వారానే అమలవుతాయి. ఎన్నికలు ఆలస్యం అయితే అభివృద్ధి కార్యక్రమాల్లో నిరంతరత దెబ్బతింటుంది. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల స్థానిక అవసరాలు ఉన్నతస్థాయికి చేరే ప్రక్రియ మందగిస్తుంది. అందువల్ల పరిషత్ ఎన్నికలు నిర్వహించడం గ్రామీణ అభివృద్ధికి వేగం అందించే చర్యగా భావించ బడుతోంది. రాజకీయ వ్యూహాల పరంగా అన్ని పార్టీలు గ్రామీణ స్థాయిలో తమ బలగాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. అధికార పక్షం ఇటీవల వచ్చిన విజయాల ఊపును కొనసాగించాలని చూస్తే, ప్రతిపక్షాలు తమ లోపాలను సరిదిద్దుకొని కొత్త వ్యూహాలతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం ? ఇవే ప్రధాన ప్రచార అజెండాలుగా మారే అవకాశం ఉంది.

ప్రభుత్వ దృష్టిలో ఎన్నికల సమయం నిర్ణయం సున్నితమైన అంశం. పరిపాలనా సిద్ధత, న్యాయపరమైన అంశాలు, రాజకీయ సమీకరణాలు ? ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. త్వరితగతిన ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దోహదం అవుతుంది. అదే సమయంలో అన్ని ప్రక్రియలు చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి కావడం కూడా అవసరం. ప్రజల నమ్మకం నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశం. చివరగా చూస్తే ప్రజా పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబించే కీలక ప్రక్రియ. ఇటీవలి స్థానిక ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ యోచనలు, పరిపాలనా సన్నాహాలు ? ఇవన్నీ కలిసి ఒక కీలక రాజకీయ దశను సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రజల ఆశలు, అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలు ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన దిశను పొందగలవు. ప్రజాస్వామ్య వ్యవస్థ పునాది గ్రామంలోనే బలపడితేనే రాష్ట్ర పరిపాలన సమగ్రంగా ముందుకు సాగుతుంది. పరిషత్ ఎన్నికలు ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచే అవకాశముంది.

# తెలంగాణలో కాంగ్రెస్ ముందున్న సవాళ్లు

**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ పదవి విషయంలో చోటుచేసుకున్న పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు తెర లేపాయి. తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం, పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నానని ప్రకటించడం, అదే సమయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కే.సి. వేణుగోపాల్ ఆయనకు ఫోన్ చేసి ఢిల్లీకి చర్చలకు ఆహ్వానించడం?ఈ పరిణామాలన్నీ రాష్ట్ర కాంగ్రెస్ అంతర్గత సమీకరణాలను, అధికార రాజకీయాల నడతలను, భవిష్యత్ వ్యూహాలను ప్రశ్నార్థకంగా నిలబెట్టాయి. జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ పదవి కేవలం స్థానిక సంస్థలోని ఒక హోదా మాత్రమే కాకుండా, ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్ ప్రభావం, నాయకత్వ సమన్వయం, కేడర్ మనోభావాల ప్రతిబింబంగా మారింది. జీవన్ రెడ్డి తెలంగాణ రాజకీయాల్లో దశాబ్దాల అనుభవం కలిగిన నేత. ఎమ్మెల్యేగా, మంత్రిగా, శాసనసభలో ప్రతిపక్ష ధ్వనిగా తన ముద్ర వేశారు. కాంగ్రెస్ పార్టీ బలహీన దశల్లో కూడా పార్టీ పట్ల విశ్వాసం కోల్పోకుండా నిలిచిన నాయకుల్లో ఆయన ఒకరు. 2014లో తెలంగాణ ఏర్పాటుకు అనంతరం కాంగ్రెస్ ఎదుర్కొన్న రాజకీయ సంక్షోభాల్లోనూ, 2018లో భారీ పరాజయానంతరం పార్టీ పునర్నిర్మాణం లోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో, పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన నేతలకు సముచిత గౌరవం లభిస్తుందనే అంచనాలు సహజమే. అయితే జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ పదవి విషయంలో ఆయనకు ఎదురైన అనుభవం ఆ అంచనాలను దెబ్బతీసిందనే భావన ఆయన అనుచరుల్లో వ్యక్తమవుతోంది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం వార్డుల సంఖ్య, పార్టీల బలం, కౌన్సిలర్ల సమీకరణాలు? ఈ అంశాలు చైర్పర్సన్ ఎన్నికలో కీలక పాత్ర పోషించాయి. స్థానికంగా కాంగ్రెస్ కౌన్సిలర్లు మెజారిటీకి చేరువలో ఉన్నా, ప్రత్యక్ష ఎన్నికల తర్వాత రాజకీయ చర్చలు, మైత్రి యత్నాలు, క్రాస్ ఓటింగ్ అనుమానాలు వంటివి వాతావరణాన్ని ఉద్రిక్తం చేశాయి. ఈ సందర్భంలో భాజపా, భారాసా, కాంగ్రెస్ మధ్య స్థానిక స్థాయిలో జరిగిన సంప్రదింపులు కూడా ప్రాధాన్యం సంతరించు కున్నాయి. ముఖ్యంగా భారాసా నుంచి గెలిచి తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్కు అనుకూలంగా పని చేస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్కు ప్రాధాన్యత జీవన్ రెడ్డి వర్గాన్ని కలవరపరిచాయి. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన నేతను పక్కనపెట్టి, ఇటీవల చేరిన నాయకుడికి అవకాశమిస్తే కేడర్లో ఏ సందేశం వెళ్తుందన్న ప్రశ్నలు తెరపైకి వచ్చాయి. ఇక్కడ ఒక కీలక అంశం రాజకీయ పునర్వ్యవస్థీకరణ. అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలు విస్తరణ వ్యూహాన్ని అనుసరించడం సహజం. ఇతర పార్టీల నుంచి నాయకులను ఆకర్షించడం, స్థానిక బలాలను సమీకరించడం, ఎన్నికల లాభనష్టాలను దృష్టిలో పెట్టుకోవడం? ఇవి అధికార రాజకీయాల భాగం. అయితే ఈ ప్రక్రియలో పాత కేడర్ మనోభావాలు దెబ్బతినకుండా చూడటం కూడా సమానంగా అవసరం. జీవన్ రెడ్డి అసంతృప్తి ఈ సమతౌల్యం లోపించిందనే సంకేతాన్ని ఇస్తోంది. జీవన్ రెడ్డి "పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నాను" అని చెప్పడం కేవలం భావోద్వేగ వ్యాఖ్య కాదు; అది ఒక రాజకీయ హెచ్చరికగా కూడా చూడవచ్చు. తెలంగాణ రాజకీయాల్లో పార్టీ మార్పులు కొత్త విషయం కావు. గత దశాబ్దంలో అనేక మంది నేతలు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చారు. అధికార పార్టీ వైపు ఆకర్షణ సహజమైతే, అసంతృప్తి కారణంగా ప్రతిపక్ష వైపు మొగ్గు చూపడం కూడా జరిగిందే. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్కు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. అయితే అదే సమయంలో ఢిల్లీ నుంచి వచ్చిన స్పందన పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. కే.సి. వేణుగోపాల్ ఫోన్ చేసి ఢిల్లీకి ఆహ్వానించడం ద్వారా కేంద్ర నాయకత్వం ఈ అంశాన్ని చిన్నదిగా తీసుకోవడం లేదని స్పష్టమైంది. ఇది రెండు సందేశాలను ఇస్తోంది. మొదటిది?జీవన్ రెడ్డి పార్టీకి విలువైన నాయకుడు అన్న గుర్తింపు. రెండవది?రాష్ట్ర స్థాయి సమన్వయంలో లోపాలున్నాయన్న అవగాహన. ఢిల్లీలో జరిగే చర్చలు కేవలం జగిత్యాల అంశానికే పరిమితం కాకుండా, తెలంగాణ కాంగ్రెస్లో నాయకత్వ సమీకరణాలు, అధికార పంపిణీ, భవిష్యత్ ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించే అవకాశముంది. సిట్టింగ్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్కు లభించిన ప్రాధాన్యం కూడా రాజకీయంగా పరిశీలించ దగిన అంశం. భారాసా నుంచి గెలిచి, తరువాత సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కాంగ్రెస్కు అనుకూలంగా పనిచేస్తున్న నాయకుడికి అవకాశమివ్వడం ద్వారా ప్రభుత్వం స్థానిక స్థాయిలో తన ప్రభావాన్ని బలోపేతం చేయాలని భావించిందనే వాదన ఉంది. రాజకీయాల్లో స్నేహ శత్రుత్వాలు శాశ్వతం కావు; ప్రయోజనాలు శాశ్వతం. ఈ దృష్టిలో చూస్తే, సంజయ్ కుమార్ను సమీకరించడం ఒక వ్యూహాత్మక నిర్ణయంగా కనిపించవచ్చు. కానీ అదే సమయంలో జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతకు గౌరవం ఇవ్వకపోతే దీర్ఘకాలిక అసంతృప్తి ఏర్పడే ప్రమాదం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ అంతర్గత సమన్వయం కీలకం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయానికి అనేక మంది సీనియర్ నాయకుల కృషి కారణమైంది. జిల్లాల వారీగా బలమైన నాయకత్వం లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం తగ్గే అవకాశం ఉంటుంది. జగిత్యాల వంటి ప్రాంతాల్లో జీవన్ రెడ్డి ప్రభావం గణనీయమని స్థానిక రాజకీయ వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఆయన అనుచరుల సంఖ్య, కేడర్పై పట్టుదల, సామాజిక వర్గాల మద్దతు? ఇవి పార్టీకి ఆస్తులే. జీవన్ రెడ్డి పార్టీ మారతారా? కాంగ్రెస్ లోనే కొనసాగుతారా? అన్న ప్రశ్నలకు తక్షణ సమాధానం ఇవ్వడం కష్టం. రాజకీయంగా చూస్తే ఆయనకు మూడు మార్గాలు ఉన్నాయి. మొదటిది?పార్టీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని చర్చల ద్వారా పరిష్కరించుకోవడం. రెండవది?సక్రియ రాజకీయాల నుంచి కొంత దూరంగా ఉండడం. మూడవది?ఇతర పార్టీ ఆహ్వానం స్వీకరించడం. అయితే గత అనుభవాలను పరిశీలిస్తే జీవన్ రెడ్డి కాంగ్రెస్ సిద్ధాంతాలకు దగ్గరగా ఉన్న నాయకుడిగా గుర్తింపు పొందారు. కాబట్టి వెంటనే పార్టీ మార్పు జరిగే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. ఢిల్లీ చర్చల ఫలితమే దీనిపై స్పష్టతనిస్తుంది. ఈ పరిణామం మరో కోణాన్ని కూడా వెలుగులోకి తీసుకొస్తోంది?అధికార రాజకీయాల్లో గుర్తింపు, గౌరవం, భాగస్వామ్యం అన్న మూడు అంశాలు సమానంగా ఉండాలి. కేవలం పదవులు పంచడమే కాకుండా, నిర్ణయ ప్రక్రియలో సీనియర్ నేతలకు స్థానం కల్పించాలి. లేకపోతే అసంతృప్తి బయట పడటమే కాకుండా, కేడర్లో నిస్సహాయత పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలు, పరిషత్ పోటీలు, భవిష్యత్ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాంగ్రెస్కు ఏకత అవసరం.జగిత్యాల చైర్పర్సన్ వివాదం తాత్కాలికమేనా, లేక దీర్ఘకాలిక ప్రభావం చూపే పరిణామమా అన్నది రాబోయే రోజుల్లో తేలుతుంది. అయితే ఒక విషయం స్పష్టం?జీవన్ రెడ్డి వంటి నాయకుల మనోభావాలను పట్టించుకోకుండా తెలంగాణ కాంగ్రెస్ ముందుకు సాగడం సులభం కాదు. కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకోవడం సానుకూల సంకేతమే. ఇది పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యానికి నిదర్శనంగా కూడా చూడవచ్చు. చివరికి, ఈ సంఘటన కాంగ్రెస్కు ఒక పాఠం. అధికారంలోకి వచ్చిన తర్వాత విస్తరణ వ్యూహం అవసరమే అయినా, పాత సైనికులను మరచిపోవడం ప్రమాదకరం. జీవన్ రెడ్డి నిర్ణయం ఏదైనా కావచ్చు; కానీ ఈ సంక్షోభం తెలంగాణ రాజకీయాల్లో సమన్వయ రాజకీయాల ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేసింది. ఢిల్లీ చర్చల అనంతరం పరిణామాలు ఎలా మలుపు తిరుగుతాయో అన్న ఆసక్తి రాష్ట్ర రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ లో కొనసాగుతూ గౌరవప్రద పరిష్కారం సాధిస్తారా, లేక కొత్త రాజకీయ అధ్యాయం ప్రారంభిస్తారా?ఈ ప్రశ్నకు సమాధానం సమీప భవిష్యత్తులో వెలువడనుంది.

# అర్ధం కానీ పవన్ వ్యూహం

కాకినాడ, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్)
జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి తన గ్రాఫ్ తగ్గించుకుంటున్నట్లే కనపడుతుంది. ప్రశ్నించాలని రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఆయన ప్రశ్నించడమే మానేశారని సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు వినిపిస్తున్నాయి. కేవలం జగన్ ఓటమి కోసమే పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చారా? లేక ఆయన ముఖ్యమంత్రి కావడానికి వచ్చారా? అని జనసైనికులే ప్రశ్నిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ పవన్ కల్యాణ్ పై ఇంతకు ముందు ఫైర్ కనిపించడం లేదని పోస్టు చేస్తున్న వీడియోలు ఇందుకు నిదర్శనం. పార్టీ నేతల నుంచి అభిమానుల వరకూ పవన్ కల్యాణ్ వ్యూహం ఎవరికీ అర్ధం కాకుండా ఉంది. మరొకవైపు జగన్ ను ఓడించాలంటే మనం సీట్లు త్యాగం చేయాల్సిందేనని ఇప్పటి నుంచే చెబుతున్న హితోక్తులు కూడా వారిని కలవరపెడుతున్నాయి.జగన్ ను ఓడించడానికి అయితే రాజకీయాల్లోకి రావడం ఎందుకన్న ప్రశ్న కాపు సామాజికవర్గం నుంచి వస్తుంది. తొలిసారి కాపు సామాజికవర్గం నుంచి ఒక వ్యక్తి ముఖ్యమంత్రి అయితే చూడాలనుకున్నామని, కానీ పవన్ కల్యాణ్ మాటలను చూస్తుంటే ఆయన ఎప్పటికీ సీఎం పదవి కోరుకోవడం లేదని అర్థమవుతుందన్న అభిప్రాయం ఎక్కువ మందిలో వినిపిస్తుంది. మరొకవైపు కాపు సామాజికవర్గం సమస్యలపై కూడా ఆయన మాట్లాడకపోవడాన్ని వారు తప్పుపడుతున్నారు. కాపు రిజ్వేషన్లు అమలు చేయించడం, కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి పేదలైన కాపు కుటుంబాలను ఆదుకునే పనికి కూడా పవన్ కల్యాణ్ చేపట్టడం లేదన్న విమర్శలున్నాయిఈ నేపథ్యంలో క్రమేపీ పవన్ కల్యాణ్ గ్రాఫ్ ఇటు కాపు సామాజికవర్గంలోనూ అటు పార్టీ క్యాడర్ లోనూ పోతుంది. మరొకవైపు ఆయన సినీ అభిమానులు మాత్రం చెక్కు చెదరకుండా ఉన్నారు. నియోజకవర్గాల్లో తమకు విలువ లేకుండా చేస్తున్నారని చెప్పినా పవన్ వినిపించుకోవడం లేదని, తాము తమ బాధలను ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని జనసేన ద్వితీయ శ్రేణి నేతలు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జనసేనలో చాలా మంది సైలెంట్ అయ్యారు. పవన్ కల్యాణ్ వ్యూహం తమకు అర్థమయిందని, కేవలం జగన్ ఓడించడానికి మాత్రమే రాజకీయాల్లోకి వచ్చారని, తాను ముఖ్యమంత్రి కావడానికి రాలేదన్నది స్పష్టంగా కనిపిస్తుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో కనిపిస్తున్నాయి. కానీ పవన్ కల్యాణ్ ను అభిమానించే వారు మాత్రం ఆయన ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతోనే అనుభజ్ఞుడైన చంద్రబాబుకు మద్దతిస్తున్నారని, అందుకే తగ్గుతున్నారని అంటున్నారు.



# ఏపీలో వెల్త్ ఫండ్స్

**విజయవాడ, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. అప్పులు ఆంధ్రప్రదేశ్ అని పేరు తెచ్చుకున్న రాష్ట్రాన్ని సంపన్న ఆంధ్రప్రదేశ్‌గా మార్చడానికి ఒక భారీ ఆర్థిక ప్రయోగం మొదలైంది. అదే ఆంధ్రప్రదేశ్ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్టు 2026-27 బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రతిపాదించారు.ఓ నిధి ఏర్పాటుకు అధికారికంగా పచ్చజెండా ఊపారు. ఇది కేవలం ఒక ప్రభుత్వం సంస్థ కాదని, రాబోయే తరాల భవిష్యత్‌ను బంగారు మయం చేసే ఆర్థిక యంత్రమని ప్రభుత్వం చెబుతోంది. మనం ఇంట్లో ఉన్న అదనపు డబ్బును లేదా బంగారాన్ని ఎలాగైతే బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామో లేదా భూమిని కొని దాని మీద వచ్చే ఆదాయంతో మరిన్ని ఆస్తులు కొనే ప్రయత్నం చేస్తామో ప్రభుత్వం అలాంటి ప్రయత్నమే చేస్తుంది. ప్రభుత్వం దగ్గర ఉన్న కొన్ని ఆస్తులను కేవలం ఖాళీగా ఉంచకుండా వాటిని ఆదాయం ఇచ్చే వనరులుగా మార్చుకుంటుంది. వాటిని ఈ వెల్త్‌ఫండ్స్‌లో జమ చేస్తుంది. ప్రపంచంలో నార్వే, సింగపూర్ వంటి దేశాలు ఇలాంటి సోవర్నిటీ వెల్త్ ఫండ్ ఏర్పాటు చేసి నేడు ప్రపంచంలోనే అత్యంత ధనవంత దేశాలుగా ఎదిగాయి. భారత్ దేశంలో ఒక రాష్ట్ర స్థాయిలో ఇలాంటి ప్రయోగం జరగడం ఇదే మొదటిసారి. 2024లో చంద్రబాబు అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉంది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్ వంటి ఆదాయం వచ్చే నగరం లేకపోవడంతో అప్పులు పెరిగిపోయాయి. ప్రస్తుతం ఆ అప్పులు 12 నుంచి 1 లక్ష కోట్లు వరకు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఏపీ కడుతున్న వడ్డీలే యాభై వేల కోట్లకుపైగా ఉంటోంది. కేవలం ప్రజల మీద పన్నులు వేయడం ద్వారా లేదా మళ్లీ అప్పులు చేయడం ద్వారా ఈ పరిస్థితి మార్చలేమని ప్రభుత్వం గుర్తించింది. అందుకే సంపద సృష్టి అనే మంత్రాన్ని జపిస్తోంది. ప్రభుత్వం వద్ద ఉన్న వనరులను తెలివిగా వాడుకొని ఆస్తులను అమ్మకుండానే ఆదాయం సంపాదించడం ఏకైక మార్గమని వెల్త్ ఫండ్‌ను తెరపైకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు 2047 నాటికి అంటే భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు నిండే నాటికి ఏపీని అగ్ర రాష్ట్రాల జాబితాలో చూడాలని అనుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగానే ఈ ఫండ్‌ను క్రియేట్ చేస్తున్నారు. దీని వల్ల ప్రతి ఆంధ్రప్రదేశ్‌లో ఉండే వ్యక్తి ఆదాయం జాతీయ సగటు కంటే మూడు రెట్లు పెరుగుతుందని చెబుతున్నారు. పేదరికాన్ని జీరోకు వస్తుందని లెక్కలు వేస్తున్నారు. అమరావతి, పోలవరం వంటి మెగా ప్రాజెక్టులకు నిధుల కొరత కూడా ఉండబోదని వివరిస్తున్నారు. డబ్బులు లేని రాష్ట్రంలో ఈ ఫండ్‌లో డబ్బులు ఎలా పెడుతుందని అనుమానం చాలా మందికి ఉంటుంది. ఇక్కడే అసలైన ట్విస్ట్ ఉంది. ప్రభుత్వం ఈ నిధిలో నగదు కంటే ఎక్కువగా ఆస్తులను పెట్టుబడిగా పెట్టనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ చేతిలో మూడు నుంచి నాలుగు లక్షల ఎకరాల భూమి ఉంది. దీని విలువ మార్కెట్‌లో పది నుంచి 15 లక్షల కోట్లు ఉంటుంది. ఈ భూములను డెవలప్ చేసి లీజుకు ఇస్తే ఆదాయం వస్తుంది. ఏపీఎస్ఆర్టీసీ, జెన్కో వంటి సంస్థల్లో ఉన్న వాటాలను తెలివిగా వాడుకోవాలని చూస్తోంది. సముద్ర తీరంలోని ఇసుక, ఆయిల్, గ్యాస్ నిక్షేపాల నుంచే ఆదాయాన్ని ఫండ్‌కు తరలిస్తారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు, రాష్ట్రంలో ఉన్న వ్యాపారవేత్తలు ఇతర ఉన్నత వర్గాలు దీనికి ఫండ్ ఇచ్చేలా ప్రోత్సహిస్తారు. ఇప్పటికే దీనికి ప్రారంభ పెట్టుబడిగా 100 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ కేటాయించింది. నార్వే దగ్గర ఆయిల్ ద్వారా వచ్చిన డబ్బుతో ఒక ఫండ్ ఏర్పాటు చేశారు. ఈ రోజు ఆ ఫండ్ విలువ సుమారు .1.7 ట్రిలియన్‌లు అంటే 140లక్షల కోట్లు. నార్వేలో ప్రతి పౌరుడి పేరు మీద కొన్ని కోట్ల రూపాయలు సంపద ఉంది. అక్కడ ప్రజలు ఉచిత విద్య, వైద్యం ఈ ఫండ్ ద్వారానే అందుతుంది. 1974లో సింగపూర్ ప్రభుత్వం తన కంపెనీలను నిర్వహించడానికి టెమాసెక్ అనే సంస్థను పెట్టింది. చంద్రబాబు ఈ మోడల్‌ను చాలా ఇష్టపడతారు. సింగపూర్ ఎయిర్‌లైన్స్, డీబీఎస్ బ్యాంకు వంటివన్నీ ఈ ఫండ్ లాభాలతోనే నడుస్తున్నాయి. అందుకే సింగపూర్ వెళ్లినప్పుడు అక్కడి నిపుణులతో చర్చిస్తారు. ఆంధ్రప్రదేశ్ వెల్త్ ఫండ్ ఏర్పాటుతో సామాన్యుడికి ఎలాంటి ప్రయోజనం ఉంటుందనే అనుమానం చాలా మందిలో ఉంటుంది. అయితే ప్రభుత్వం తన ఆస్తుల ద్వారా ఆదాయం సంపాదిస్తే, సామాన్యుడిపై పన్నుల భారం తగ్గుతుంది. వెల్త్ ఫండ్ ద్వారా ఇండస్ట్రీయల్ పార్కులు, టెక్ పార్కులు వస్తే ఉద్యోగాలు లభిస్తాయి. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, స్కూళ్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం అప్పు చేయకుండానే ఈ ఫండ్ లాభాల నుంచి ఖర్చు చేస్తుంది. భవిష్యత్‌లో ఈ ఫండ్ చ్చే లాభాల నుంచే ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందివచ్చు. వెల్త్‌ఫండ్ అనేది ఒక సూపర్ కంపెనీలా ఉంటుంది. దీనిలో మొదటిగా ప్రభుత్వం తన భూములను, ఇతర వనరులను మ్యాపింగ్ చేస్తుంది. ఆ తర్వాత ఆ భూమిలో ఏం చేస్తే లాభమో చూస్తారు. అంటే ఒక ప్రాంతంలో పాడైపోయిన ప్రభుత్వం భవనం ఉంటే, అందులో కార్యకలాపాలు జరగపోతే దాన్ని పడగొట్టి పెద్ద షాపింగ్ మాల్‌కో, ఐటీ ఆఫీస్‌కో అద్దెకు ఇస్తారు. దీని వల్ల ప్రభుత్వం వద్దే భూమి ఉంటుంది. కానీ అద్దె మాత్రం ఈ ఫండ్‌లో జమ అవుతుంది. ఇదే అసట? మానిటైజేషన్ అంటారు. ప్రభుత్వ భూములు ప్రైవేటు వాళ్లకు దారాదత్తం చేస్తారనే అపవాదు ప్రభుత్వానికి వస్తుంది. ప్రజలకు అర్థం కాకుంటే అధికార పార్టీకి ప్రమాదం. ప్రభుత్వ భూములు అమ్మడం కాదు వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం వస్తుందనే భావన వారికి చేరవేయాలి. ప్రభుత్వం మారినప్పుడల్లా ఈ ఫండ్ పాలసీలు మారకుండా ఉండేందుకు గ్లోబల్ ఎక్స్‌పర్ట్స్‌తో ఒక స్వతంత్ర బోర్డు ఏర్పాటు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

# వైసీపీ సెల్ఫ్ గోల్

**నెల్లూరు, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్)**
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొత్తేమీ కాదు. కానీ, ఆధారాలు లేకుండా చేసే విమర్శలు ఒక్కోసారి బూమరాంగ్ అయి ఎదుటిపక్షానికి ఆయుధంగా మారుతుంటాయి. తాజాగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రీలంక పర్యటన విషయంలో వైసీపీ చేసిన ఆరోపణలు ఇప్పుడు ఆ పార్టీకే ఇబ్బందికరంగా మారాయి. వ్యక్తిగత పర్యటనను ప్రభుత్వ ఖర్చుగా చిత్రీకరించే ప్రయత్నం చేయబోయి, వైసీపీ మరోసారి రాజకీయంగా 'సెల్ఫ్ గోల్' వేసుకుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.భారత్ -- పాకిస్థాన్ మధ్య జరిగిన ఉత్కంఠభరిత క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నారా లోకేశ్ శ్రీలంక వెళ్లారు. దీనిపై వైసీపీ సోషల్ మీడియా వింగ్, ఆ పార్టీ అనుబంధ మీడియా సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారాన్ని మొదలుపెట్టాయి. మంత్రి హోదాలో ఉన్న లోకేశ్, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ విదేశాల్లో విలాసాలు చేస్తున్నారని, విమాన ప్రయాణాల నుండి మ్యాచ్ టికెట్ల వరకు అన్నీ ప్రభుత్వ ఖజానా నుంచే చెల్లించారని ఆరోపించారు. గతంలో ఆయన విదేశీ పర్యటనలపై చేసిన విమర్శలనే ఇప్పుడు కూడా కొనసాగించే ప్రయత్నం చేశారు.వైసీపీ ఆరోపణలపై లోకేశ్ తనదైన శైలిలో స్పందించారు. కేవలం ఖండించడమే కాకుండా, నేరుగా వైఎస్ జగన్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టూ నాదే.. నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా?" అంటూ రాయలసీమ యాసలో ఆయన ఇచ్చిన కౌంటర్ నెట్టింట వైరల్ అయ్యింది. తన వ్యక్తిగత పర్యటనలకు సంబంధించిన ఖర్చులను తనే భరించుకున్నానని, ఇందులో ప్రభుత్వానికి కానీ, ప్రజలకు కానీ సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక మంత్రిగా తన వ్యక్తిగత సమయాన్ని గడిపే హక్కు తనకు ఉందని, దానికి కూడా రాజకీయ రంగు పూయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు.కేవలం లోకేశ్ వ్యక్తిగత స్పందనకే పరిమితం కాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఈ విషయంలో అధికారికంగా 'ఫ్యాక్ట్ చెక్' విడుదల చేసింది. లోకేశ్ శ్రీలంక పర్యటన కోసం ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదని స్పష్టం చేసింది. సాధారణంగా మంత్రులు విదేశాలకు వెళ్లేటప్పుడు అనుసరించాల్సిన ప్రోటోకాల్, భద్రతాపరమైన అనుమతులు తప్ప, ఆర్థికంగా ఎటువంటి భారమూ ప్రభుత్వంపై పడలేదని ఆధారాలతో సహా వివరించింది.గతంలో కూడా లోకేశ్ విదేశీ పర్యటనలపై ఇలాంటి ఆరోపణలే చేసింది వైసీపీ. అప్పట్లో ఆయన పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లినా, వ్యక్తిగత పర్యటనలని ప్రచారం చేసింది. అయితే, ఇప్పుడు పరిస్థితి మారింది. కేవలం బురదజల్లే ఉద్దేశంతో చేసే ఆరోపణలు ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోతున్నాయి. ప్రతి చిన్న విషయాన్ని వివాదం చేయడం వల్ల ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. వైసీపీ ఆరోపణలు చేసిన వెంటనే, కూటమి మద్దతుదారులు పాత రికార్డులను, ఖర్చుల వివరాలను బయటపెడుతుండటంతో వైసీపీ సోషల్ మీడియా వింగ్ డిఫెన్స్‌లో పడిపోతోంది.రాజకీయాల్లో విమర్శలు ప్రతిపక్షాల హక్కు. కానీ, ఆ విమర్శలు వాస్తవాలకు దగ్గరగా ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. లోకేశ్ క్రికెట్ మ్యాచ్ పర్యటనపై వైసీపీ చేసిన రగడ, చివరికి ఆయన వ్యక్తిగత స్వేచ్ఛను ప్రశ్నించినట్లుగా మారి, ప్రజల్లో వైసీపీపై ప్రతికూలత పెరిగేలా చేసింది. తప్పుడు ప్రచారాలతో ప్రత్యర్థిని ఇరుకున పెట్టాలనుకున్న వైసీపీ, తానే బొక్కబోర్లా పడటం ఈ ఎపిసోడ్ ద్వారా మరోసారి స్పష్టమైంది.



## పిల్లలను వదిలేసి... ప్రియుడు దగ్గరకు వెళ్లి

**తిరుపతి, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్):** సోషల్ మీడియా పరిచయాలు ఎలాంటి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయో మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అనైతిక సంబంధాలు, అసాంఘిక పనులకు సోషల్ మీడియాను మాధ్యమంగా వాడుకుంటున్నారు కొందరు. తాజాగా సోషల్ మీడియా పరిచయం ఓ వివాహితను దారి తప్పేలా చేసింది. పెళ్లై, పిల్లలున్న వివాహిత సోషల్ మీడియా మాయలో పడింది. ఏపీలో పరిచయం అయిన వ్యక్తిని నమ్మి.. అతని ప్రేమలో మునిగిపోయింది. కానీ ఆ నమ్మకంలో చేసిన తప్పు.. చివరకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. వివరాల్లోకి వెళ్తే.. జార్ఖండ్‌కు చెందిన 30 ఏళ్ల వివాహితకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఇద్దరు గంటల కొద్దీ చాటింగ్‌లో మునిగితేలారు. ఆపై ఆడియో, వీడియో కాల్స్ కూడా నడిచాయి. వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. తనను ధనవంతుడిగా, అనుభవం ఉన్న వ్యాపారవేత్తగా పరిచయం చేసుకున్న ఆ వ్యక్తి మాటలను ఆమె పూర్తిగా నమ్మేసింది. భర్త, ముగ్గురు చిన్నారులను వదిలి.. ఇన్‌స్టాగ్రామ్ ప్రియుడితో కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ఆ మహిళ ఇంటి నుంచి పారిపోయి ఏపీ చేరుకుంది. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో తన ఆన్ లైన్ ప్రియుడ్ని కలుసుకుంది. అయితే అక్కడే అసలు నిజం బయటపడింది. తనను ధనవంతుడు అని చెప్పుకున్న వ్యక్తి వాస్తవానికి దినసరి కూలీగా పనిచేస్తున్నాడని తెలిసి ఆమె షాక్ గురైంది. తాను మోసపోయానని గ్రహించి తీవ్ర నిరాశకు లోనైంది.. ఇంతలో ఆమె కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఫోన్ సిగ్నల్, సోషల్ మీడియా వివరాల ఆధారంగా ఆమె ఉన్న ప్రదేశాన్ని గుర్తించారు. పోలీసుల జోక్యంతో మహిళను సురక్షితంగా తీసుకువచ్చారు. తల్లిదండ్రులు, బంధువులు కలిసి ఆమెకు నచ్చజెప్పడంతో చివరకు తిరిగి తన కుటుంబం వద్దకు చేరింది.ఈ ఘటనలో విశేషం ఏమిటంటే భార్య దారి తప్పినా.. భర్త మంచి మనసుతో తిరిగి ఆమెను ఏలుకునేందుకు అంగీకరించాడు. కుటుంబం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం మరో అవకాశాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. టెక్నాలజీ దూరాలను దగ్గర చేస్తుంది. కానీ మరోవైపు చెడు సావాసాలను కూడా పరిచయం చేస్తుంది. అందుకే అప్రమత్తత అవసరం అని సైబర్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తిరుమలలో స్మార్ట్ షూ ట్రాకింగ్

**తిరుమల, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్):** ఏడుకొండల వాడి చెంతకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఌ= కోడ్ ఆధారిత పాదరక్షల ట్రాకింగ్ అండ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ అద్భుత ఫలితాలను ఇస్తోంది. గత ఆరు నెలల్లోనే సుమారు 8.45 లక్షలకు పైగా పాదరక్షల లావాదేవీలను ఈ విధానం ద్వారా సమర్థవంతంగా నిర్వహించారు. భక్తులు తమ పాదరక్షలను భద్రపరుచుకోవడంలో గతంలో ఎదుర్కొన్న గందరగోళానికి ఈ ఆధునిక సాంకేతికత చెక్ పెట్టింది. 2025 సెప్టెంబర్ నుండి 2026 ఫిబ్రవరి 15 వరకు ఈ స్మార్ట్ విధానం ద్వారా మొత్తం 4,24,047 పాదరక్షలను భక్తులు దర్శనానికి వెళ్తూ భద్ర పరుచుకోగా.. అందులో లిలి4,21,769 జతలనులిలి అత్యంత సురక్షితంగా తిరిగి అందజేశారు. అంటే సేకరించిన వాటిలో దాదాపు 99 శాతం విజయవంతంగా పంపిణీ కావడం ఈ వ్యవస్థ పనితీరుకు అద్దం పడుతోంది. కేవలం ఫిబ్రవరి మొదటి 15 రోజుల్లోనే 1.35 లక్షల లావాదేవీలు జరగడం ఈ వ్యవస్థ పట్ల భక్తులకున్న నమ్మకాన్ని తెలియజేస్తోంది.తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో పీఏసీ-5 కేంద్రం అత్యధికంగా 1.38 లక్షల పాదరక్షల నిర్వహణతో అగ్రస్థానంలో నిలిచింది. రామ్ భగీచా వద్ద 76,556, కృష్ణ తేజ సర్కిల్ వద్ద 56,019, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం వద్ద 55,238, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద 53,250, ఏటీజీహెచ్ వద్ద 44,714 జతల చెప్పులను భక్తులకు సురక్షితంగా అందచేశారు. పై కేంద్రాల్లో పాదరక్షలు తప్పిపోయే అవకాశం లేకుండా టెక్నాలజీ సాయంతో భక్తులకు వేగంగా సేవలు అందుతున్నాయి.గతంలో రద్దీ ప్రాంతాల్లో పాదరక్షలు అస్తవ్యస్తంగా పడి ఉండటం వల్ల భక్తులు పడే ఇబ్బందులను గమనించిన టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి ఈ వినూత్న పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో, డిప్యూటీ ఈవో శ్రీ సోమన్నారాయణ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్ట్ భక్తులకు చేరువైంది. భక్తుల నుంచి ఈ విధానంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతుండటంతో, త్వరలో కల్యాణకట్ట, బేడి ఆంజనేయస్వామి ఆలయం, ఏటీసీ సర్కిల్ వద్ద మరో మూడు నూతన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారుశ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధులు అత్యంత పవిత్రమైనవని, అక్కడ నిత్యం స్వామి వారు విహరిస్తుంటారు కాబట్టి పాదరక్షలు ధరించడం నిషిద్ధమని టీటీడీ గుర్తు చేసింది. భక్తులు తమ పాదరక్షలను నిర్ణీత కౌంటర్లలో ఈ స్మార్ట్ పద్ధతి ద్వారా డిపాజిట్ చేసి, దర్శనం అనంతరం సులభంగా పొందాలని కోరింది. ఈ 'స్మార్ట్ షూ కీపింగ్' విధానం తిరుమలలో పరిశుభ్రతను పెంచడమే కాకుండా, సామాన్య భక్తులకు ఆహ్లాదకరమైన దర్శన అనుభూతిని కలిగిస్తోంది.

## మున్సిపల్ పోరు కు రెడీ

**ఒంగోలు, ఫిబ్రవరి 19, (న్యూస్ పల్స్):** కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలుగుదేశం పార్టీ అధినేత స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్ రెండేళ్ల తర్వాత జరిగిన ఎన్నికల్లో విజయం సాధించడంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా లోకల్ బాడీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించడంలో ఎలాంటి సందేహాలు లేవన్నది నాయకత్వానికి స్పష్టమయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుండటం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతుండటంతో ఇక కూటమి ప్రభుత్వం కూడా త్వరలోనే దీనికి సంబంధించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశాలున్నాయి. అయితే ఎండల సమయంలో కంటే తర్వాత పోలింగ్ జరపడం మంచిదని భావిస్తున్నట్లు సమాచారం. ఎండాకాలంలో ఓటింగ్ శాతం పై ప్రభావం పడుతుందని, అలాగే కొన్ని ఇబ్బందులు కూడా తలెత్తే అవకాశముందన్న అంచనాలో ఉంది.ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి సంబంధించి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. జులై నెలలో అయితే కొంత ఎండల తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారు. లేదంటే ఆగస్టులోనైనా స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం సిద్ధమన్న సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజాస్వామికంగా ఎన్నికలు జరగకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చింది. మున్సిపాలిటీల్లోనూ తాడిపత్రి ఒక్కటే టీడీపీ గెలుచుకుంది. ఈ సారి అలా కాకుండా హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ ను స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించే ప్లాన్ ను చంద్రబాబు సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ముందుగా జిల్లాల పర్యటనలు కూడా ఆయన చేస్తారని తెలిసింది.స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగితే తమ ఓటు బ్యాంకు మరింత బలపడుతుందని, రాజకీయంగా తమకు లాభిస్తుందని చంద్రబాబు అంచనా. అనేక మందికి పదవులు దక్కుతాయి. ఇప్పటి వరకూ పదవులు దక్కలేదని నిరాశలో ఉన్న వారి అసంతృప్తిని చల్లారవచ్చు. మరొకవైపు శాసనసభ్యులను కూడా యాక్టివ్ చేయవచ్చు. వారి నియోజకవర్గంలో జరిగే పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గెలిపించుకునే బాధ్యత వారిపైనే ఉండటంతో వారు నిరంతరం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. దానివల్ల ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడుతుందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే వీలయినంత త్వరగానే స్థానిక సంస్థలకు వెళ్లేలా చంద్రబాబు రోడ్ మ్యాప్ ను సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## కలెక్షన్ కింగ్ అరెస్ట్ కు రంగం సిద్ధం

**తిరుపతి, ఫిబ్రవరి 19 (న్యూస్ పల్స్):** కొంతకాలంగా సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా లో మోహన్ బాబ యూనివర్సిటీ) గురించి వస్తున్న కథనాలు మొత్తం మనం చూస్తూనే ఉన్నాం. విద్యార్థుల వద్ద ఇష్టమొచ్చినట్టు డబ్బులు వసూలు చేస్తున్నారని, అలా అక్రమంగా పాతిక కోట్ల రూపాయిల వరకు వసూలు చేశారని, ఆ డబ్బులు మొత్తం తిరిగి విద్యార్థులకు ఇచ్చేయాలంటూ ప్రభుత్వం సైతం ఆర్డర్లు ఇవ్వడం, మోహన్ బాబు యూనివర్సిటీ నుండి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడం, విద్యార్థులు ప్రతీ రోజు ధర్నాలు చేయడం, విద్యార్థి సంఘాలు కూడా మద్దతుగా నిల్చి మోహన్ బాబు యూనివర్సిటీ ఎదుట నిరసన కార్యక్రమాలు చేయడం, ఇలా చాలానే గడిచిన కొద్దిరోజుల నుండి జరుగుతూనే ఉన్నాయి. అయితే విద్యార్థి సంఘాల నాయకులను మోహన్ బాబు బౌన్సర్లు కిడ్నాప్ చేసి, అతని ఫార్మ్ హౌస్ లో దాచారని , అందుకు సంబంధించిన విజువల్స్ తో సహా కోర్టు కి సమర్పించారు.మోహన్ బాబు తనకు అరెస్ట్ నుండి రక్షణ కల్పించాలని గత కొంతకాలం క్రితం హై కోర్టు కి అప్పీల్ చేసుకున్నాడు. నేడు మోహన్ బాబు అప్పీల్ ని హై కోర్టు విచారించి, ఆయన రిక్వెస్ట్ ని తిరస్కరించింది. అంతే కాకుండా ఫోన్ కాల్స్, మెసేజ్లపై ఫోరెన్సిక్ రిపోర్టు అవకాశమని పేర్కొంటూ విచారణను మార్చి 3 కి వాయిదా వేసింది. అయితే హై కోర్టు ముందస్తు బైలు నిరాకరించడంతో పోలీసులు ఈ కేసు విషయం లో ఒకవేళ మోహన్ బాబు ని విచారణ కోసం రిమాండ్ కి తీసుకెళ్లినా అడిగేవాళ్ళు ఉండరంటూ సోషల్ మీడియా లో విశ్లేషకులు కామెంట్స్ చేస్తున్నారు. క్రమశిక్షణ కు మారుపేరుగా పేరొందిన మోహన్ బాబు, ఇలా రిమాండ్ కి వస్తే రావాల్సి వస్తే ఆయన మనసు చాలా నొచ్చుకునే అవకాశం ఉందని అంటున్నారు విశ్లేషకులు. అయితే ఆయన విచారణ కి అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న.ఇదంతా పక్కన పెడితే చాలా కాలం తర్వాత మోహన్ బాబు మళ్లీ సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇస్తూ చేస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్'. నేచురల్ స్టార్ నాని హీరో గా నటిస్తున్న ఈ చిత్రం లో మోహన్ బాబు నాని కి తండ్రి పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల అవ్వగా, ఆడియన్స్ నుండి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం తో పాటు అజయ్ భూపతి దర్శకత్వం లో రమేష్ బాబు తనయుడు జయ కృష్ణ , మరియు రాషా తండాని హీరో హీరోయిన్లు గా నటిసున్న 'శ్రీనివాస మంగపురం' చిత్రం లో కూడా మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నాడు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# అమెరికాపై సంచలన వ్యాఖ్యలు చేసిన ఇరాన్ సుప్రీం లీడర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోయడంలో అమెరికా ఎప్పటికీ విజయం సాధించలేదని, భవిష్యత్తులోనూ సాధించలేదని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సైన్యం ఉన్నవారికైనా తీవ్ర ఎదురుదెబ్బ తగలవచ్చని హెచ్చరించారు. ఇరాన్‌లో పాలన మార్పు, యుద్ధ నౌకల మోహరింపు అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనల నేపథ్యంలో ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. అదే సమయంలో జెనీవా వేదికగా ఇరాన్ – అమెరికాల మధ్య పరోక్ష అణు చర్చలు కొనసాగుతుండటం ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఖమేనీ చేసిన వరుస ట్వీట్లలో .. తమ సైన్యం ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదని అమెరికా అధ్యక్షుడు చెబుతున్నారు. కానీ, కొన్ని సందర్భాల్లో అది కోలుకోలేనంత దెబ్బతినే అవకాశమూ ఉంది. ఇరాన్ వైపు యుద్ధ నౌకలను పంపిస్తున్నామని ప్రకటిస్తున్నారు. అవి ప్రమాదకరమైనవే. అయితే, వాటిని సముద్రంలో ముంచేసే సామర్థ్యమున్న ఆయుధం మరింత ప్రమాదకరం. 47 ఏళ్లుగా ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఏమీ చేయలేకపోయామని అమెరికానే అంగీకరిస్తోంది. ఇకముందూ చేయలేరు. అణు చర్చలు జరుపుదామంటారు. కానీ చివరికి మీ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని ముందే తీర్పు చెబుతారు. చర్చల ఫలితాలను ముందుగానే నిర్ణయించడం మూర్ఖత్వమే అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

# ఇజ్రాయిల్ ఆక్రమణలు సహించం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంపై తన ఆధిపత్యాన్ని విస్తరించుకునేందుకు ఇజ్రాయిల్ చేస్తున్న ప్రయత్నాలను 80కిపైగా ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు ఖండించాయి. పాలస్తీనాలో అధిక భాగం తన ఆస్తే అంటూ ఇజ్రాయిల్ చేస్తున్న వాదనను అవి తిప్పికొట్టాయి. వెస్ట్‌బ్యాంక్‌లో చట్టవిరుద్ధంగా తన ఉనికిని పెంచుకునేందుకు ఇజ్రాయిల్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, చర్యలను తాము తీవ్రంగా నిరసిస్తున్నామని ఐరాసలో పాలస్తీనా రాయబారి రియాద్ మన్సూర్ తెలిపారు. ఐరాసలో ఎనభై ఐదు సభ్య దేశాల కూటమి, అనేక అంతర్జాతీయ సంస్థల తరఫున ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ చట్టం ప్రకారం ఇజ్రాయిల్ నెరవేర్చాల్సిన కర్తవ్యాలకు ఇలాంటి నిర్ణయాలు భిన్నంగా ఉన్నాయని, కాబట్టి వీటిని వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆక్రమణ ఏ రూపంలో జరిగినా దానిని వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. తూర్పు జెరూసలేం సహా 1967 నుంచి ఆక్రమించిన పాలస్తీనా భూభాగం యొక్క కూర్పును, స్వభావాన్ని, స్థితిని మార్చేందుకు ఇజ్రాయిల్ చేపట్టే అన్ని చర్యలనూ తిరస్కరిస్తున్నామని మన్సూర్ చెప్పారు. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తాయని, శాంతి–సుస్థిరత కోసం జరుగుతున్న ప్రయత్నాలను దెబ్బతీస్తాయని, ఇజ్రాయిల్–హమాస్ మధ్య గత నవంబరులో కుదిరిన సమగ్ర ప్రణాళిక ఒప్పందానికి భిన్నంగా ఉంటాయని, శాంతి ఒప్పందం దిశగా జరుగుతున్న ప్రయత్నాలను ప్రమాదంలో పడేస్తాయని తెలిపారు. ఇజ్రాయిల్ చర్యలు, నిర్ణయాలను వ్యతిరేకిస్తూ సంయుక్త ప్రకటనపై సంతకాలు చేసిన దేశాలలో ఆస్ట్రేలియా, కెనడా, చైనా, ఫ్రాన్స్, పాకిస్తాన్, రష్యా, దక్షిణ కొరియా, సౌదీ అరేబియా, తుర్కియే, యూఏఈతో పాటు యూరోపియన్ యూనియన్, అరబ్ దేశాల లీగ్, ఇస్లామిక్ సహకార సంస్థ ఉన్నాయి. పాలస్తీనా భూభాగాన్ని 1967లో ఆక్రమించుకున్న తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లోని ఏరియా–సీలో భూ రిజిస్ట్రేషన్లను అమలు చేయాలని ఇజ్రాయిల్ నిర్ణయించడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో సంయుక్త ప్రకటన వెలువడింది. వెస్ట్‌బ్యాంక్‌లోని 60 శాతం భూభాగం ఏరియా–సీలోనే ఉంది.

# మూడు పడవలపై అమెరికా దాడులు

**హైదరాబాద్ పెన్ పవర్:** లాటిన్ అమెరికా సముద్ర జలాల్లో డ్రగ్స్ రవాణాకు పాల్పడుతున్నాయన్న ఆరోపణలతో మూడు పడవలపై యూఎస్ మిలిటరీ దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో మొత్తం 11 మంది మరణించారు. ఈ విషయాన్ని అమెరికా సైన్యం వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేసింది. సోమవారం ఈ దాడులు జరిగినట్టు వివరించింది. గత కొన్ని నెలలుగా కొనసాగుతున్న డ్రగ్ వ్యతిరేక సైనిక చర్యల్లో ఇది అత్యంత ప్రాణనష్టం జరిగిన ఘటనల్లో ఒకటని అధికారులు పేర్కొన్నారు. కాగా తాజా దాడులతో.. గత సెప్టెంబర్ ప్రారంభం నుంచి చిన్న పడవలలో ప్రయాణించే 'నార్కో టెర్రరిస్టులు'గా అభివర్ణిస్తున్న వారిపై చేపట్టిన చర్యల్లో మరణించినవారి సంఖ్య కనీసం 145కు చేరిందని సైన్యం వివరించింది. గతంలో జరిగిన 42 దాడులలాగానే.. ఈ సారి కూడా స్మగ్లింగ్ జరుగుతున్నట్టు గుర్తించిన మార్గాల వెంబడి లక్ష్యాలను ఎంచుకున్నట్టు యూఎస్ సదరన్ కమాండ్ తెలిపింది. కాగా డ్రగ్స్ ఆరోపణల పేరుతో అమెరికా చేస్తున్న ఈ దాడులపై అనేక అనుమానాలు ఉన్నాయి. లాటిన్ అమెరికా జలాల్లో పట్టు సాధించడం కోసం యూఎస్ సైన్యం ఇలాంటి దాడులకు పాల్పడుతున్నదని పలువురు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. డ్రగ్స్ రవణా చేస్తున్న పడవలపై దాడులు చేశామని చెప్తున్న యూఎస్ అధికారులు.. అసలు ఆ పడవలు నిజంగానే డ్రగ్స్‌ను తరలిస్తున్నాయన్న విషయానికి సంబంధించి ప్రత్యక్ష ఆధారాలను మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం. అయితే దాడుల్లో పడవలు పూర్తిగా ధ్వంసమవుతున్న వీడియోలను మాత్రం యూఎస్ సైన్య విడుదల చేసింది.

# హార్ముజ్ జలసంధిలో రష్యా, చైనా, ఇరాన్ సైనిక విన్యాసాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రష్యా, చైనా, ఇరాన్ దేశాలకు చెందిన నౌకా దళాలు హార్ముజ్ జలసంధి చుట్టూ ఉన్న జలాలలో యుద్ధ నౌకలను మోహరించి సైనిక విన్యాసాలకు సిద్ధమయ్యాయి. ఈ జలసంధి పర్షియన్ సింధుశాఖ నుంచి మహా సముద్రాలలోకి దారితీసే ఏకైక సముద్ర మార్గం. ఇది ప్రపంచంలోని అత్యంత వ్యూహాత్మక ప్రాంతాలలో ఒకటి. దీనికి ఉత్తర తీరంలో ఇరాన్, దక్షిణ తీరంలో యూఏఈ, ముసందమ్, ఒమన్ ఉన్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా తన సైనిక బలగాలను మోహరిస్తున్న నేపథ్యంలో రష్యా, చైనా, ఇరాన్ ఈ మూడు దేశాలు హార్ముజ్ జలసంధిలో విన్యాసాలు జరపబోతున్నాయి. సముద్ర కార్యకలాపాల సమన్వయాన్ని బలోపేతం చేసుకునేందుకు, వాణిజ్య నౌకా మార్గాలను రక్షించుకునేందుకు ఇరాన్ నేతృత్వంలో విన్యాసాలు చేపడతామని రష్యా అధ్యక్షుని సలహాదారు నికొలే పాత్రుషెవ్ చెప్పారు. రష్యాకు చెందిన ఓ దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాత్రుషెవ్ మాట్లాడుతూ వైమానిక సిబ్బంది, లాజిస్టిక్ నౌకలు, నౌకాదళ విమానయాన దళాలు విన్యాసాలలో భాగస్వాములవుతాయని తెలిపారు. యాంటీ పైరసీ, సెర్చ్–రెస్క్యూ డ్రిల్స్ నిర్వహిస్తామని, కమ్యూనికేషన్ విన్యాసాలు జరుపుతామని, వాణిజ్య నౌకలకు రక్షణ కల్పించడం కూడా వీటిలో భాగంగా ఉంటాయని వివరించారు. కాగా హర్ముజ్ జలసంధి ద్వారా ప్రతి రోజూ 17 నుంచి 20 మిలియన్ బ్యారల్స్ చమురు రవాణా అవుతోంది. అంటే ప్రపంచ దేశాలు వినియోగిస్తున్న చమురులో ఐదో వంతు ఈ జలసంధి మీదుగానే సరఫరా అవుతోంది. ఇది ప్రపంచంలోని అత్యంత కీలక ఇంధన చెక్‌పాయింట్లలో ఒకటి. ఈ మార్గంలో లిక్విఫైడ్ సహజ వాయువు కూడా గణనీయంగానే రవాణా అవుతుంది. ఈ సరఫరాలకు ఏ మాత్రం అంతరాయం కలిగినా అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడుతుంది.

# జపాన్‌తో అమెరికా భారీ వాణిజ్య ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:** జపాన్‌తో భారీ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మంగళవారం ప్రకటించారు. జపాన్ ఆర్థిక సాయంతో అమెరికాలో చేపట్టే మూడు ప్రాజెక్టులను ఆయన ఆవిష్కరించారు. వీటి విలువ 36 బిలియన్ డాలర్లు. జపాన్ సాయంతో టెక్సాస్‌లో చమురు ఎగుమతి కేంద్రం, జార్జియాలో కీలక ఖనిజాల ప్లాంట్, ఒహియోలో సహజ వాయువు విద్యుత్ ప్లాంటు ఏర్పడతాయి. ఒప్పందంలో భాగంగా అమెరికాలో జపాన్ 550 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుంది. తొలి విడతగా ఈ మూడు ప్రాజెక్టులు చేపడతారు. జపాన్ పెట్టుబడులకు ప్రతిగా ఆ దేశంపై విధించిన సుంకాలను పదిహేను శాతానికి తగ్గిస్తామని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో తెలియజేశారు. 'అమెరికాలో 550 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు పెట్టేందుకు జపాన్ సిద్ధపడింది. వీటిలో తొలి విడతగా అధికారికంగా 36 బిలియన్ డాలర్ల పెట్టుబడితో మూడు ప్రాజెక్టులు చేపట్టబోతోంది' అని ట్రంప్ తెలిపారు. అమెరికా పారిశ్రామిక రంగానికి జవసత్వాలు కల్పించేందుకు ఈ చారిత్రక ఒప్పందం దోహదపడుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుల పరిధి చాలా పెద్దదని, సుంకాలు అనే ప్రత్యేక మాట లేకుండా అవి సాధ్యపడవని వ్యాఖ్యానించారు. ఒప్పందం కుదరడానికి తన వాణిజ్య విధానాలే కారణమని చెప్పుకున్నారు. జపాన్ ప్రధాని సనే తకైచీ త్వరలో అమెరికాలో పర్యటించబోతున్నారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్ ప్రకటన వెలువడింది. జపాన్‌తో కుదిరిన ఒప్పందంతో వేలాది మంది అమెరికన్లకు ఉద్యోగాలు లభిస్తాయని ఆయన చెప్పారు. 'అమెరికా మళ్లీ నిర్మాణం అవుతోంది. మళ్లీ ఉత్పత్తి చేస్తోంది. మళ్లీ విజయం సాధిస్తోంది' అని అన్నారు. ఇది రెండు దేశాలకూ ఉత్తేజకరమైన, చారిత్రకమైన సమయమని ట్రంప్ వ్యాఖ్యానించారు. సహజ వాయువుతో విద్యుత్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు జపాన్ 33 బిలియన్ డాలర్లు వెచ్చిస్తుందని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుత్నిక్ చెప్పారు. అమెరికా చరిత్రలోనే అతి పెద్ద ప్లాంటు అని తెలిపారు. ఇది ఏటా 9.2 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని, ఒహియోలోని నివాస గృహాలకు విద్యుచ్ఛక్తిని అందించేందుకు అది సరిపోతుందని అన్నారు. కాగా ఈ ఒప్పందం దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామ్యమని శ్వేతసౌధం అభివర్ణించింది.

# ఇరాన్‌పై భారీ దాడికి అమెరికా సిద్ధమవుతోందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా, ఇరాన్ మధ్య అణు చర్చలపై ప్రతిష్టంభన నెలకొన్న వేళ ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇరాన్‌పై అమెరికా త్వరలోనే భారీ దాడులకు దిగవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. గతేడాది ఇరాన్‌పై ఇజ్రాయెల్ 12రోజుల పాటు చేసిన యుద్ధం కన్నా భారీ స్థాయిలో ఈ సైనిక చర్య ఉండవచ్చని ఆక్సియోస్ నివేదిక అంచనా వేసింది. "ట్రంప్ విసిగిపోతున్నారు. యుద్ధానికి వెళ్లవద్దని ఆయన చుట్టూ ఉన్న కొందరు హెచ్చరిస్తున్నారు. కానీ, మరికొన్ని వారాల్లోనే భారీ స్థాయి సైనిక చర్య ఉండే అవకాశాలు 90శాతం ఉన్నాయి" అని అమెరికా అధ్యక్షుడి సలహాదారుడు చెప్పినట్లు తాజా నివేదిక వెల్లడించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చితో ట్రంప్ సలహాదారులు జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్‌కాఫ్‌లు జెనీవాలో చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ నివేదిక రావడం గమనార్హం. అయితే, చర్చల్లోని అంశాలపై నిర్ణయం తీసుకునేందుకు ఇరాన్‌కు రెండు వారాల గడువు ఉండడం, ఇదే సమయంలో వైట్‌హౌస్ యుద్ధానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తాజా నివేదికలు అంచనా వేస్తున్నాయి.

# జెనీవాలో అర్ధంతరంగా ముగిసిన రష్యా- ఉక్రెయిన్ శాంతి చర్చలు

**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా–ఉక్రెయిన్ మూడో దఫా శాంతి చర్చలు రెండో రోజైన బుధవారం అర్ధంతరంగా ముగిశాయి. రెండో రోజు చర్చలు ప్రారంభమైన రెండు గంటలకే ముగిశాయని అధికారులు తెలిపారు. చర్చల సందర్భంగా ఇరుదేశాల మధ్య నెలకొన్న రాజకీయ, సైనిక వైరుధ్యాలను తొలగించేందుకు అమెరికా అధికారులు ప్రయత్నించారు. రాజకీయ, సైనిక అంశాలపై చర్చలు జరిగాయని ఉక్రెయిన్ ప్రతినిధి బృందం సభ్యుడైన రుస్తెమ్ ఉమరోవ్ తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. తొలి రోజైన మంగళవారం ఐదు నుంచి ఆరు గంటల పాటు సాగిన చర్చలు మరుసటి రోజు అంతకంటే చాలా తక్కువ సమయం సాగాయి" అని మీడియా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇంతకు ముందు అబుధాబీలో జరిగిన చర్చలు కూడా ఎలాంటి సానుకూల ఫలితాలూ సాధించలేదు. గత సంవత్సర కాలంగా ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు తమ ప్రభుత్వం చేస్తున్న కృషి అర్థవంతమైన ప్రగతి సాధిస్తోందని అమెరికా ప్రభుత్వ దూత స్టీవ్ విట్కాఫ్ సోషల్ మీడియా ద్వారా చెప్పారు. ఉక్రెయిన్‌లోని పౌర ఆవాసాలపై రష్యా క్షిపణుల వర్షం కురిపిస్తోంది. తాజాగా 126 దీర్ఘశ్రేణి డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిందని ఉక్రెయిన్ వైమానిక దళం ఒక ప్రకటనలో తెలిపింది.

# రాహుల్ గాంధీ దేశ భద్రతకు అతి ప్రమాదకరం కిరణ్ రిజిజు సంచలన ఆరోపణలు



**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కాంగ్రెస్ నేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒఐఐతో మాట్లాడిన రిజిజు, రాహుల్ గాంధీ భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు కలిగి ఉన్నారని, ఆయన దేశ భద్రతకు అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా మారారని మండిపడ్డారు. ఆయన దేశంలోనూ విదేశాల్లోనూ నక్సలైట్లు, తీవ్రవాదులు, కొందరు భావజాలవేత్తలు, జార్జ్ సొరోస్ వంటి వ్యక్తులను కలుస్తున్నారని ఆరోపించారు. రిజిజు ప్రకారం, రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల సమయంలో జార్జ్ సొరోస్ వంటి వ్యక్తులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇలాంటి సంబంధాలు దేశ భద్రతను దెబ్బతీసేలా ఉన్నాయని, రాహుల్ భారత వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి కార్యకలాపాలు దేశాన్ని బలహీనపరచే ప్రయత్నాలుగా భావిస్తున్నట్లు రిజిజు స్పష్టం చేశారు. ఈ ఆరోపణలు రాజకీయ వేడిని మరింత పెంచాయి. రాహుల్ గాంధీపై లోక్‌సభలో ఒక తీర్మానం కూడా ప్రవేశపెట్టినట్లు రిజిజు పేర్కొన్నారు. దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని, భారత వ్యతిరేక శక్తుల సహాయంతో పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇది ప్రస్తుత రాజకీయ వాతావరణంలో మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ సంఘటన బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచే అంశంగా కనిపిస్తోంది. రాహుల్ గాంధీపై ఇలాంటి ఆరోపణలు గతంలో కూడా వచ్చినప్పటికీ, ఇప్పుడు నక్సలైట్లు, సొరోస్ వంటి నిర్దిష్ట పేర్లతో రిజిజు చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి.

# కనీసం ముగ్గురు పిల్లలను కనాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నో: హిందూ సమాజం ఏకం కావాల్సిన అవసరం ఏర్పడిందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా, అప్రమత్తంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. హిందూ జనాభా తగ్గిపోవడంపైనా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే హిందూ కుటుంబాలు ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చేందుకు ఆలోచించాలని సూచించారు. మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్ లక్నోలోని సరస్వతి శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మత మార్పిళ్లను అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇతర మతాల్లోకి వెళ్లిన వారిని తిరిగి హిందూ మతంలోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని తెలిపారు. సామరస్యం లేకపోవడం వల్లే వివక్షకు కారణం అవతుందని, పౌరులందరూ ఒకే దేశం–ఒకే జన్మభూమి అనే భావన కలిగి ఉండాలన్నారు. మన సంస్కృతిలో పురుషులకు సంపాదించే హక్కు ఉంటుంది. అదే మన తల్లులకు దానిని ఎలా ఖర్చు చేయాలో నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. దేశంలోకి చొరబడే ఆక్రమణదారులను గుర్తించి, తిరిగి పంపించాలని మోహన్ భాగవత్ చెప్పారు. ముఖ్యంగా వారికి ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకూడదని అభిప్రాయపడ్డారు.

# ఢిల్లీలో మైనర్ బాలుడు చేసిన ప్రమాదానికి క్షమాపణలు కోరిన తండ్రి

**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలో ఇటీవల ఓ బాలుడు కారు నడుపుతూ 23 ఏళ్ల యువకుడి మృతికి కారణమైన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంపై నిందితుడి తండ్రి తాజాగా స్పందించి బహిరంగంగా క్షమాపణలు తెలిపారు.తన కుమారుడు చాలా పెద్ద తప్పు చేశాడని, అందుకు ఒక కుటుంబంగా తాము తీవ్రంగా సిగ్గుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి తల్లిని తన జీవితాంతం క్షమాపణ కోరుతూనే ఉంటానని ఆయన అన్నారు.ఈ నెల 3న ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో ఈ దుర్ఘటన జరిగింది. 17 ఏళ్ల బాలుడు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా తన తండ్రికి చెందిన స్కార్పియో కారును వేగంగా నడుపుతూ, ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో 23 ఏళ్ల సాహిల్ ధనేశ్రా అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం కారు అదుపుతప్పి ఆగి ఉన్న ట్యాక్సీని ఢీకొట్టడంతో దాని డ్రైవర్ కూడా గాయపడ్డాడు.అయితే, మృతుడి తల్లి ఇన్నా మకన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తన కుమారుడి మృతికి ప్రమాదం కారణం కాదని, నిందితుడు తన సోదరితో కలిసి సోషల్ మీడియా కోసం 'ఫన్ రీల్స్' చిత్రీకరిస్తూ, రాంగ్ లేన్‌లో అతివేగంగా కారు నడపడం వల్లే ఈ ఘోరం జరిగిందని ఆమె ఆరోపించారు. దీనిపై నిందితుడి తండ్రి మాట్లాడుతూ తాను పని మీద గోరఖ్‌పూర్‌లో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగిందని, తెలియని వయసులో తన కొడుకు కారు తాళాలు తీసుకుని ఉంటాడని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే తన కొడుకు పారిపోలేదని, సహాయం చేశాడని కూడా ఆయన పేర్కొన్నారు.ఈ కేసులో నిందితుడైన మైనర్‌ను జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచగా, అతడిని అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించారు.

# భారతదేశానికి యువతే బలం: ప్రధాని మోడీ



**హైదరాబాద్ పెన్ పవర్:** : భారతదేశానికి యువతే బలం, బలగమని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ఇవాళ ఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026ను ఆయన ప్రారంభించారు. ఈ సమ్మిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్, వివిధ దేశాల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, 500లకు పైగా టెక్ దిగ్గజ కంపెనీల సీఈవోలు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ఏఐ సమ్మిట్ అని తెలిపారు. ప్రపంచంలో ఆరో వంతుకు భారత్ ప్రాతినిధ్యం వహిస్తోందని కామెంట్ చేశారు. ఏఐకి కేంద్రంగా ఇండియా రూపాంతరం చెందుతోందని అన్నారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ టెక్నాలజీకి భారత్ కేంద్రంగా ఉందన్నారు. మానవుల సామర్థ్యాన్ని ఏఐ మరింత పెంచుతోందని తెలిపారు. భవిష్యత్తులో ఏఐ ఏం చేస్తోందనేది కాదని.. ఇప్పుడు ఏఐతో మనం ఏం చేస్తున్నామనేది ముఖ్యమని పేర్కొన్నారు.

## ముచ్చటగా మూడోసారి..

# టాటా బోర్డ్ ఛైర్మన్‌గా మళ్లీ ఎన్.చంద్రశేఖరన్!




టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్.చంద్రశేఖరన్ మరో ఐదేళ్లపాటు కొనసాగే అవకాశం ఉంది. ఫిబ్రవరి 24న జరగనున్న టాటా సన్స్ బోర్డు సమావేశంలో ఆయనకు మూడోసారి బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనకు ఆమోదం లభించవచ్చని వార్తలు వస్తున్నాయి. బోర్డు ఆమోదం తెలిపితే.. చంద్రశేఖరన్ 2032 వరకు ఛైర్మన్‌గా కొనసాగుతారు. ఆయన ప్రస్తుత రెండవ పదవీ కాలం ఫిబ్రవరి 2027తో ముగియనుంది. టాటా గ్రూప్ నిబంధనల ప్రకారం ఎగ్జిక్యూటివ్ పదవులకు రిటైర్మెంట్ వయస్సు 65 ఏళు మాత్రమే. అయితే, చంద్రశేఖరన్ 2028లో 65 ఏళ్లకు చేరుకుంటారు. కాబట్టి ఆయన కొనసాగింపు కోసం బోర్డు ప్రత్యేక మినహాయింపు ఇవ్వనుంది. మెజారిటీ వాటాదారు అయిన టాటా ట్రస్ట్, ముఖ్యంగా ఛైర్మన్ నోయెల్ టాటా, చంద్రశేఖరన్ నాయకత్వం పట్ల పూర్తి విశ్వాసంతో ఉన్నట్లుగా సమాచారం. సెమీకండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాలు (ఇఎ), ఎయిరిండియా పునరుద్ధరణ కోసం టాటా గ్రూప్ ప్రణాళిక చేసిన 120 బిలియన్ల డాలర్ల పెట్టుబడులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆయన లీడర్‌షిప్ అవసరమని బోర్డు భావిస్తోంది.

# అందరికీ అందుబాటులో ఏఐ




భారత్‌లో రైతులకు ఏఐ అండగా నిలుస్తోందని.. గతంలో ఉన్న భాషా అండకులకు చెక్ పెట్టామని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ తెలిపారు. ఇవాళ ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026 లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత వేసవిలో భారత ప్రభుత్వం లక్షలాది మంది రైతులకు ఏఎ ఆధారిత వాతావరణ అంచనాలను పంపిందని తెలిపారు. గూగుల్ అభివృద్ధి చేసిన న్యూరల్ జీసీఎం మోడల్ సహాయంతో ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. దీంతో వాతావరణ మార్పులను ముందే పసిగట్టి పంటలను కాపాడుకునే అవకాశం రైతులకు లభించిందని పిచాయ్ తెలిపారు. ఏఐ అందరికీ అందుబాటులో ఉండాలన్నది గూగుల్ లక్ష్యమని సుందర్ పిచాయ్ అన్నారు. గూగుల్ త్వరలోనే ఫుల్‌స్టాక్ ఏఐ హబ్‌లు ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఘనాలోని విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి 20కి పైగా ఆఫ్రికన్ భాషలలో పరిశోధనలు, ఓపెన్ సోర్స్ టూల్స్‌ను విస్తరిస్తున్నామని తెలిపారు. భారతీయ భాషల్లో కూడా ఇటువంటి పురోగతికి ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, ఆర్థిక అవకాశాల మెరుగుదలకు ఏఎ ఒక శక్తివంతమైన సాధనమని, సాంకేతికత అందించే ప్రయోజనాలు సమాజంలోని ప్రతి వ్యక్తికీ అందేలా చూడటం మన బాధ్యత అని అన్నారు. సాంకేతికత అద్భుతమైన ప్రయోజనాలను తెస్తుందని, కానీ అవి అందరికీ అందుబాటులో ఉండేలా విస్తరించజేయాలని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు.

# తగ్గిన బంగారం దిగుమతులు..

# వెండి 56 శాతం జంప్



బంగారం, వెండి ధరలు పెరుగుతున్నప్పటికీ మనదేశంలో వీటికి గిరాకీ ఏ మాత్రం తగ్గట్లేదు. భారీ ధరల కారణంగా బంగారం విషయంలో ప్రాలు, ఇన్వెస్టర్లు కొంత తక్కువ ఆసక్తి చూపిస్తున్నప్పటికీ, వెండి విషయంలో పెద్ద ఎత్తున కొనుగోళ్లను కొనసాగిస్తున్నారు.తాజాగా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. దీని ప్రకారం, గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో బంగారం దిగుమతులు 18.3 శాతం తగ్గి 522 టన్నులకు చేరింది. విలువ పరంగా దిగుమతుల బిల్లు 1.8 శాతం పెరిగి 49.4 బిలియన్ డాలర్లు(రూ. 4.48 లక్షల కోట్ల)కు చేరింది. ఇదే సమయంలో బంగారం ధరలు దాదాపు 25 శాతం మేర పెరిగాయి. అధిక ధరల కారణంగానే దిగుమతులు తగ్గాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇక, వెండి విషయంలో గణాంకాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. సమీక్షించిన సమయంలో వెండి దిగుమతులు ఏకంగా 56 శాతం పెరిగి 5,727 టన్నులుగా నమోదయ్యాయి. విలువ పరంగా 7.8 బిలియన్ డాలర్లు(రూ. 70 వేల కోట్లు)గా ఉంది. ఇది అంతకుముందు ఏడాది 9 నెలల సమయంలో దిగుమతి అయిన 3.4 బిలియన్ డాలర్ల(రూ. 30.8 వేల కోట్ల) కంటే రెట్టింపు జరిగింది.

# స్వయంగా షాపింగ్ చేయనున్న ఏఐ




ఏఐ సంస్థ ఆంథ్రోపిక్‌తో కలిసి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త వ్యవస్థను బుధవారం పరీక్షించింది. వినియోగదారులు ఆంథ్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐ యాప్ ద్వారా కిరాణా సామాగ్రి, ఆహారాన్ని ఆర్డర్ చేయడంతో పాటు, యూపీఐ ఉపయోగించి చెల్లించడాన్ని పరీక్షిస్తున్నామని ఎన్‌పీసీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా తెలిపారు.షాపింగ్‌ను సులభతరం చేయడమే లక్ష్యంతో దీన్ని అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే భవిష్యత్తులో యాప్‌లను మార్చాల్సిన అవసరం లేకుండా వినియోగదారులు ఆర్డర్‌లను ఇవ్వమని, స్వయంగా చెల్లింపులు కూడా చేసేలా ఏఐని కోరవచ్చు. ప్రస్తుతం, దీన్ని కొంతమందితో పరీక్షిస్తున్నారు. బిగ్‌బాస్కెట్, జొమాటో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లాంటి ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఏఐ షాపింగ్ చేస్తుంది. ఏఐ స్వయంగా ఖర్చు చేసేందుకు కస్టమర్లు రూ. 15,000 వరకు పరిమితిని సెట్ చేయవచ్చు.

# నిస్సాన్ 7 సీట్ల ఎంపీవీ గ్రావిటీ




నిస్సాన్ మోటార్ ఇండియా 7 సీట్ల బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) గ్రావిటీని ఆవిష్కరించింది. దీని పరిచయ ధర రూ.5.65 లక్షలు (ఎక్స్-షోరూమ్). రౌండ్ ఎల్‌ఈడీ లైటింగ్, సిగ్నేచర్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్స్ విత్ ఇంటిగ్రేటెడ్ డీఆర్‌ఎల్స్, క్రిస్టల్ ఎడ్జ్ ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్‌ఈడీ ఫాగ్ ల్యాంప్స్, పియానో బ్లాక్ 2డి గ్రిల్లే, ఫంక్షనల్ రూఫ్ రెయిల్స్, వైడ్-ఓపెనింగ్ డోర్స్, 20.32 సెంటిమీటర్ల ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్ విత్ వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, 17.78 సెం.మీ. డిజిటల్ క్లస్టర్, వైర్‌లెస్ ఛార్జర్, వాక్ అవే లాక్, ఫ్రంట్ అండ్ రేర్ పార్కింగ్ సెన్సార్లు వంటి సదుపాయాలు ఉన్నాయి. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఈఎస్‌సీ, టీసీఎస్, హెచ్‌ఎస్‌ఏ, బీఏఎస్ ఏబీస్ విత్ ఈబీడీ, సీట్ బెల్ట్ రిమైండర్స్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. 1.0 లీటర్, 3 సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్, 5-స్పీడ్ ఈజెడ్ షిఫ్ట్ (ఏఎంటీ) ఆప్షన్లలో ఈ కారు లభ్యమవుతుంది. వేరియంట్ల వారీగా విసియా రూ.5.65 లక్షలు, అసెంటా రూ.6.59 లక్షలు, ఎన్-కనెక్టా రూ.7.20 లక్షలు, టెక్నా రూ.7.91 లక్షలు, ఎన్-కనెక్టా ఏఎంటీ రూ.7.80 లక్షలు, టెక్నా ఏఎంటీ రూ.8.49 లక్షల్లో (ఎక్స్-షోరూమ్) లభిస్తాయి. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. గ్రావిటీ తర్వాత టెక్టాన్ ఎస్‌యూవీ, లార్జ్ సెవన్ సీటర్ సి సెగ్మెంట్ ఎస్‌యూవీలను ఈ ఏడాది చివర్లో తీసుకొస్తామని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు.

# 2028 నాటికి 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థను నిర్మించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఎకనామిక్ కోఆపరేషన్ (జీఈసీ) సమ్మిట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి.. భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో పటిష్టమైన భాగస్వామ్యాలు, వాణిజ్య సంబంధాల విషయంలో సమర్థవంతంగా పనిచేస్తోంది. ఇతర దేశాల నుంచి నమ్మకాన్ని పొందుతున్నామని, ప్రపంచ అవసరాల ఆధారంగా దేశ వాణిజ్య, పెట్టుబడులను ప్లాన్ చేస్తున్నట్టు గోయల్ తెలిపారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం తొమ్మిది వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు నమ్మకం, పరస్పర ప్రయోజనంపై ఆధారపడి ఉన్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భవిష్యత్ వృద్ధి కోసం ఉద్దేశించినవి, ఇతర దేశాలు భారత అభివృద్ధిలో భాగం కావడానికి అవకాశం ఇస్తాయని ఆయన వివరించారు. భారత ప్రభుత్వం రెండు ప్రధాన సూత్రాల ఆధారంగా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ఆయన అన్నారు. అవి నమ్మకం, సామర్థ్యం. ఈ ఒప్పందాలపై సంతకం చేసే సమయంలోనూ ప్రభుత్వం ముఖ్యమైన రంగాలను రక్షిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. రాబోయే సంవత్సరాల్లో భారత ఆర్థికవ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతుందని గోయల్ అన్నారు. 2047 నాటికి దేశ ఆర్థికవ్యవస్థకు 26 ట్రిలియన్ డాలర్లను జోడిస్తుంది. దేశ చరిత్రలో ఈ రకమైన వేగవంతమైన వృద్ధి ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వాలు టాయిలెట్లు వంటి ప్రాథమిక అవసరాలపై తగినంత దృష్టి పెట్టలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అందరి జీవన నాణ్యతను మెరుగుపరచడం, అందరినీ కలుపుకునేలా కృషి చేసిందని ఆయన వెల్లడించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలలో జరుగుతున్న మార్పులను పీయూష్ గోయల్ ప్రస్తావించారు. 5జీ ఇంటర్నెట్ మారుమూల ప్రాంతాలకు కూడా చేరిందని, మనదేశం ఇప్పుడు 500 గిగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో రెండవ అతిపెద్ద విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఆర్థిక దౌత్యం అంటే దూరంగా ఉండటానికి బదులుగా బిజినెస్ లీడర్లు, ఇంటర్నేషనల్ పార్ట్‌నర్స్ దగ్గరి సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఏ దేశమైనా ఇకపై ఒంటరిగా అభివృద్ధి చెందలేవని, ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# భారత్‌లో 'వాలియో' రూ. 2,100 కోట్ల పెట్టుబడులు



ప్రముఖ ఫ్రెంచ్ కార్ల విడిభాగాల తయారీ సంస్థ వాలియో దేశీయంగా భారీ పెట్టుబడులు ప్రకటించింది. భారత మార్కెట్లో 200 మిలియన్ యూరోలకు పైగా(మన కరెన్సీలో రూ. 2,146.18 కోట్లు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్టు కంపెనీ బుధవారం ప్రకటనలో తెలిపింది. దీని ద్వారా దేశంలో కంపెనీ గణనీయంగా విస్తరించే అవకాశం లభిస్తుందని, ఈ పెట్టుబడులు 'ఎలివేట్ 2028' ప్రణాళికలో భాగంగా ఉంటాయని కంపెనీ వెల్లడించింది. దీని ద్వారా 2024 నాటికి కంపెనీ అమ్మకాల విలువ 220 మిలియన్ యూరోల నుంచి 2028 నాటికి 700 మిలియన్ యూరోలకు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. కంపెనీ అమ్మకాలు రాబోయే మూడేళ్లలో మూడు రెట్లు పెరుగుతాయని వాలియో సీఈఓ క్రిస్టోఫ్ పెరిల్లాట్ చెప్పారు. అంతేకాకుండా 2028 తర్వాత కూడా కంపెనీ మరింత వేగంగా వృద్ధిని సాధిస్తుందనే నమ్మకం ఉందని అభిప్రాయపడ్డారు. భారత్‌తో పాటు అంతర్జాతీయంగా కార్ల తయారీ కంపెనీలకు పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల వేగవంతమైన వృద్ధిని, కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తోంది. భారత్‌ను తాము ప్రపంచవ్యాప్తంగా మూడు ముఖ్యమైన మార్కెట్లలో ఒకటిగా పరిగణిస్తున్నట్టు వెల్లడించింది. కాగా, వాలియో కంపెనీ భారత మార్కెట్లో 1997 నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తోంది. కంపెనీకి చెన్నై, పూణె, సనంద్, గుర్గావ్‌లో ఆరు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. చెన్నై, బెంగళూరులలో గ్లోబల్ ఆర్అండ్‌డీ సెంటర్లు కూడా ఉన్నాయి. కంపెనీలో 7,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

# చేదు లేకుండా కాకరకాయ వెల్లుల్లి కారం ఇలా చేయండి




చాలా మంది కాకరకాయను దూరం పెడతారు. ఎందుకంటే ఇది చేదుగా ఉంటుంది కాబట్టి. కానీ, దీని వలన మన శరీరానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. అయితే, వెల్లుల్లి కారంతో కాకరకాయను చేసుకుని తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.

**కావాల్సిన పదార్థాలు** : అర కిలో కాకరకాయలు, అర టీ స్పూన్ పసుపు, ఒక టీ స్పూన్ ఉప్పు, ధనియాల పొడి అర టేబుల్ స్పూన్, ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర, 2 టేబుల్ స్పూన్స్ కారం, వెల్లుల్లి, నూనె , రుచికి పడినంత ఉప్పు, కరివేపాకు.ముందుగా కాకరకాయలు తీసుకుని బాగా కడిగి ముక్కలు చేసుకుని పక్కన పెట్టుకోండి. చేదు పోవడానికి ఉప్పులో ముక్కలను బాగా కడగండి. ఆ తర్వాత దానిలో పసుపు, ఉప్పు వేసుకుని 20 నిమిషాల పాటు ఆ మిశ్రమాన్ని పక్కన పెట్టండి.ఇలా చేస్తే కాకరకాయల్లో ఉండే చేదు మొత్తం పోతుంది. ఇంకా ఆ తర్వాత వీటిని వేయించడానికి కూడా సులభంగా ఉంటుంది. ఇక ఇప్పుడు వెల్లులి కారం కోసం ధనియాలు వేయించి మెత్తగా పొడి పట్టుకోవాలి.ఆ తర్వాత వెల్లుల్లి పాయలు కూడా వేసి బాగా గ్రైండ్ చేసుకోవాలి. ఇప్పుడు ఇక కాకరకాయ ముక్కలు తీసుకుని నీరు లేకుండా పిండి ప్లేట్ లో పక్కన పెట్టుకోవాలి. స్టవ్ వెలిగించి పాన్ పెట్టి దానిలో నూనె వేసి అది వేడయ్యాక కాకరకాయ ముక్కలను వేసుకుని బాగా వేయించాలి. గరిటేతో వాటిని తిప్పుతూ ఉండాలి. ముక్కలు రంగు మారిన తర్వాత కిందకు దించేయండి. కాకరకాయ ముక్కలు మగ్గిన తర్వాత వెల్లుల్లి కారం, రుచికి సరిపడేంత ఉప్పు, కరివేపాకు వేసి ఐదు నిమిషాలు పాటు అలా ఉంచి కిందకు దించేయండి. అంతే కాకరకాయ వెల్లుల్లి కారం రెడీ.

# మగవారికే గురక ఎక్కువగా ఎందుకు వస్తుంది?

గురక నిద్రకు అంతరాయం కలిగించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుంది. ఇటీవలి కాలంలో 40 ఏళ్ల పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. పురుషులు, మహిళలు ఇద్దరూ గురక పెడతారు. కానీ పురుషులు మహిళల కంటే ఎక్కువగా గురక పెడుతుంటారు. ఇలా ఎందుకు జరుగుతుందనే విషయంలో చాలా మందికి సందేహం వస్తుంది.. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పురుషుల కంటే మహిళలే 2 నుంచి 3 రెట్లు ఎక్కువగా గురక పెట్టే అవకాశం ఉంది. వయసు పెరిగే కొద్దీ మహిళలు కూడా ఈ సమస్యతో బాధపడుతుంటారు. కానీ పురుషులే మహిళల కంటే ఎక్కువగా ప్రభావితమవుతారు. కాబట్టి దీనికి కారణం ఏమిటి? ఈ సమస్య పురుషులలో ఎందుకు ఎక్కువగా కనిపిస్తుంది? ఢిల్లీలోని మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీలోని ఇఎన్‌టి విభాగం అధిపతి డాక్టర్ రవి మహర్ దీని గురించి మాట్లాడుతూ.. పురుషులు ఎక్కువగా గురక పెట్టడానికి అనేక కారణాలు ఉన్నాయి. పురుషుల గొంతులోని వాయుమార్గం మహిళల కంటే ఇరుకైనది. ఇది నిద్రలో శ్వాస తీసుకునేటప్పుడు ఎక్కువ కంపనానికి కారణమవుతుంది. ఇది గురకకు దారితీస్తుంది. మహిళల్లో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ వంటి హార్మోన్లు వాయుమార్గ కండరాలను బలంగా ఉంచడంలో సహాయపడతాయి. కానీ ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ స్థాయిలు తగ్గడం ప్రారంభించినప్పుడు ఈ సమస్య పెరుగుతుంది. కాబట్టి ఈ సమస్య వయస్సుతో పాటు కూడా పెరుగుతుంది. మరొక కారణం ఏమిటంటే, మహిళలతో పోలిస్తే పురుషుల గొంతు చుట్టుపక్కల కండరాల చుట్టూ ఎక్కువ కొవ్వు ఉంటుంది. ఇది గురక పెరగడానికి దారితీస్తుంది. గురక అంటే వాయుమార్గం స్వల్పంగా మూసుకుపోయినప్పుడు వచ్చే శబ్ధం. అంటే ముక్కు, గొంతు పూర్తిగా తెరచుకోకపోవడం. దీనివల్ల గాలి పీల్చినప్పుడు, బయటకు వదిలినప్పుడు మీ గొంతులోని కణజాలాలు కంపించేలా చేస్తాయి. దీనిని గురక అంటారు. దీనికి ఊబకాయం, టాన్సిల్స్, ముక్కులో నిర్మాణ సమస్యలు, నిద్ర లేకపోవడం వంటి అనేక కారణాలు ఉన్నాయి. తేలికపాటి గురక సమస్య కాదు. కానీ ఈ సమస్య అధిక కాలం కొనసాగితే ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. ఎందుకంటే ఇది స్లీప్ అప్నియాకు సంకేతం కావచ్చు. ఈ సమస్యలో నిద్రపోతున్నప్పుడు కొన్ని సెకన్ల పాటు శ్వాస ఆగిపోతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి దీనిని విస్మరించడం సరైనది కాదు.



# రాజ పోషకాలు రాగులు..



రాగి జావ ప్రోటీన్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్, కాల్షియం వంటి పోషకాలతో నిండి ఉంటుంది. ఇది శరీరానికి మంచి శక్తిని అందించి, ఎముకలను బలోపేతం చేస్తుంది. రాగుల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. కాల్షియం, ఐరన్, ఫైబర్, ప్రోటీన్లతో కూడిన అత్యంత పోషకమైన తృణధాన్యం. అందుకే.. రాగి జావ తాగమని ఆయుర్వేద నిపుణులు చెబుతుంటారు. ఇది అత్యంత ఆరోగ్యకరమైన పౌష్టికాహారం.. రాగిజావ.. అద్భుతమైన శక్తిని ఇస్తుంది. అంతేకాకుండా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.. ఎముకలను బలోపేతం చేస్తుంది.. బరువు తగ్గడానికి, డయాబెటిస్ నియంత్రణకు సహాయపడుతుంది. ఉదయం పూట బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉండవచ్చు.. ముఖ్యంగా బలహీనంగా ఉన్నవారికి లేదా ఎక్కువ కష్టపడి పనిచేసేవారికి ఇది ఒక అద్భుతమైన ఎనర్జీ డ్రింక్.. రాగి జావ వంటకాలు కేవలం రుచికరమైనవి మాత్రమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడినవి. నేటి తరం ఆహారపు అలవాట్లలో ప్రోటీన్ కొరత సాధారణం అయిన నేపథ్యంలో, ఈ రాగి జావను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వలన శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. రాగిలో పుష్కలంగా ఉండే ఫైబర్, కార్బోహైడ్రేట్స్, కాల్షియం సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిస్తాయి. ఇది శరీరానికి తక్షణ శక్తినిచ్చి, ఎముకలను ఉక్కులా దృఢంగా మారుస్తుంది. రాగి జావ, మజ్జిగ రాగి జావలను తయారుచేసుకుని తాగవచ్చు.. ఈ రెండు రకాల జావలు పిల్లల నుండి పెద్దల వరకు ఎవరైనా తీసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువ శారీరక శ్రమ చేసేవారికి లేదా నీరసంగా, బలహీనంగా అనిపించేవారికి ఈ రాగి జావ ఒక అద్భుతమైన ఎనర్జీ డ్రింక్‌గా పనిచేస్తుంది. ఉదయం టిఫిన్ చేయలేని లేదా ఏమి చేయాలని తోచని సమయాల్లో ఈ రాగి జావను సులభంగా తయారుచేసుకుని తీసుకోవచ్చు. ఇది భోజనం సమయం వరకు ఆకలిని కూడా నియంత్రిస్తుంది.మొదటగా ఒక పెద్ద గిన్నెలో మూడు టేబుల్ స్పూన్ల రాగి పిండిని తీసుకుని, కొద్దికొద్దిగా నీళ్లు కలుపుతూ పిండి ముద్దలు లేకుండా బాగా కలపాలి. ఆ తరువాత, మరో రెండు గ్లాసుల నీళ్లు కలిపి (మొత్తం మూడు గ్లాసుల నీళ్లు), పిండి పలుచగా ఉండేలా చూసుకోవాలి. ఈ మిశ్రమాన్ని స్టవ్ మీద పెట్టి, జావ అడుగంటకుండా మధ్యమధ్యలో కలుపుతూ ఉడికించాలి. మూడు నుండి నాలుగు నిమిషాల్లో జావ మరగడం ప్రారంభమవుతుంది. పైన వచ్చే నురుగును తీసివేయాలి. జావ కాస్త చిక్కబడే వరకు మూడు నుండి నాలుగు నిమిషాలు మరిగించి, ఐదారు సార్లు రోలింగ్ బాయిల్ అయిన తరువాత స్టవ్ ఆఫ్ చేయాలి. చల్లారిన తరువాత ఇది మరింత చిక్కబడుతుంది. రాగి జావను పలు రకాలుగా తయారు చేసుకోవచ్చు.. స్వీట్ లేదా స్వీట్ లేకుండా తయారు చేసుకోవచ్చు.. కొంచెం బెల్లం లేదా ఉప్పు ఇంకా పాలు లేదా మజ్జిగ కలుపుకుని తాగవచ్చు.. ఈ మజ్జిగ జావను ఉల్లిపాయ కాంబినేషన్ తో తీసుకుంటే చాలా రుచికరంగా ఉంటుంది. ఈ రెండు రకాల రాగి జావలు కేవలం టేస్టీగా ఉండడమే కాకుండా, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నీరసం, బలహీనత వంటి సమస్యలతో బాధపడేవారు తప్పకుండా వీటిని తమ డైట్‌లో చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు..

## చిన్నపాటి అలకలు.. పదిలమైన బంధానికి వేదికలు




వైవాహిక జీవితం అనేది కేవలం ఇద్దరు వ్యక్తుల ప్రయాణం మాత్రమే కాదు, అది రెండు మనసుల కలయిక. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఒడిదుడుకులు రావడం సహజం. అహంకారం, అపార్థాలు అనేవి గోడలలా మారి బంధాన్ని ఇబ్బంది పెడుతుంటాయి.అయితే, ఈ చిన్నపాటి మనస్పర్థలను అధిగమించినప్పుడే ఆ బంధం మరింత దృఢంగా మారుతుంది. ఏ సమస్య వచ్చినా కలిసి ఎదుర్కోవాలనే సంకల్పం దంపతుల మధ్య ఉండాలి.అభిప్రాయ భేదాలు తలెత్తినప్పుడు మౌనంగా ఉండిపోవడం కంటే, మనసు విప్పి మాట్లాడుకోవడం ఎంతో ముఖ్యం. అలకలు సహజమే కానీ, అవి వివాదానికి దారితీసేలా మరీ ఎక్కువ కాలం కొనసాగించకూడదు. బంధాన్ని తెగేదాకా లాగడం వల్ల ఇద్దరి మధ్య దూరం పెరుగుతుంది తప్ప సమస్య పరిష్కారం కాదు. సున్నితమైన విషయాల్లో ఓర్పుగా వ్యవహరిస్తూ, భాగస్వామిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి.సమస్య ఏదైనా సరే, ఎదుటివారికి మాట్లాడే అవకాశం ఇవ్వడం ఒక ఉత్తమ లక్షణం. మీ వాదన మాత్రమే వినిపించకుండా, భాగస్వామి అభిప్రాయాన్ని కూడా గౌరవంగా వినాలి. అలా అవకాశం ఇవ్వకపోవడం వల్ల వారిలో అసంతృప్తి పెరిగిపోయి, అది లోలోపల ఒక పెద్ద అగ్నిపర్వతంలా మారుతుంది. ఆరోగ్యకరమైన చర్చలు ఎప్పుడూ సంబంధాల్లోని సంక్లిష్టతలను తొలగించి, స్పష్టతను ఇస్తాయి. చివరిగా, ప్రేమ మరియు గౌరవం అనే పునాదుల మీద నిలబడే బంధం ఎప్పటికీ చెక్కుచెదరదు. ఒకరి తప్పులను మరొకరు ఎత్తిచూపడం కంటే, వాటిని సరిదిద్దుకుని ముందుకు సాగడంలోనే నిజమైన విజయం ఉంది. అనుమానాలను పక్కన పెట్టి, నమ్మకాన్ని పెంచుకున్నప్పుడు వైవాహిక జీవితం ఒక మధుర కావ్యంగా మారుతుంది. చిన్న చిన్న సర్దుబాట్లు, ప్రేమపూర్వక సంభాషణలే సంతోషకరమైన సంసారానికి అసలైన సూత్రాలు.

## వాహనాల టైర్ల కింద నిమ్మకాయలు ఆచారమా? ఆరోగ్య సూత్రమా?



నేటి ఆధునిక కాలంలో కూడా కొత్త వాహనం కొన్నా లేదా ప్రయాణాలకు వెళ్తున్నా టైర్ల కింద నిమ్మకాయలు ఉంచడం మనకు కనిపిస్తూనే ఉంటుంది. చాలామంది దీనిని కేవలం ఒక మూఢనమ్మకంగా లేదా దిష్టి తగలకుండా చేసే ప్రక్రియగా భావిస్తారు. అయితే, ఈ సంప్రదాయం వెనుక ఒక బలమైన చారిత్రక కారణం దాగి ఉందనే విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. మన పూర్వీకులు పాటించిన ప్రతి ఆచారం వెనుక ఏదో ఒక సామాజిక ప్రయోజనం దాగి ఉంటుందనడానికి ఇదొక చక్కని ఉదాహరణ. గతంలో రవాణా సౌకర్యాలు ఇప్పటిలా అధునాతనంగా ఉండేవి కావు; ఎడ్లబండ్లు లేదా గుర్రాల మీద మాత్రమే ప్రయాణాలు సాగేవి. వర్షాకాలంలో బురదలో ప్రయాణించేటప్పుడు పశువుల కాళ్లకు ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం ఎక్కువగా ఉండేది. నిమ్మకాయల్లో ఉండే సిట్రిక్ యాసిడ్ ఒక సహజమైన క్రిమినాశకారిగా (ంనిబితిబవజూబితిఇ) పనిచేసి, పశువుల గిట్టలకు వ్యాధులు రాకుండా రక్షణ ఇచ్చేది. అందుకే అప్పట్లో ప్రయాణం మొదలుపెట్టే ముందు నిమ్మకాయలను తొక్కించడం ఒక ఆరోగ్యకరమైన అలవాటుగా ఉండేది.కాలక్రమేణా ఎడ్లబండ్ల స్థానంలో మోటారు వాహనాలు వచ్చాయి కానీ, ఆ నిమ్మకాయలు ఉంచే అలవాటు మాత్రం మారలేదు. పశువుల ఆరోగ్యం కోసం మొదలైన ఈ ప్రక్రియ, కాలక్రమేణా వాహనాలకు "దిష్టి" తగలకుండా ఉండాలనే నమ్మకంగా రూపాంతరం చెందింది. సైన్స్ పరంగా చూస్తే ఇప్పుడు టైర్లకు ఎలాంటి ఇన్ఫెక్షన్లు రావు కాబట్టి దీని అవసరం లేదు. అయినప్పటికీ, సమాజంలో నెలకొన్న బలమైన విశ్వాసాల వల్ల ఈ పద్ధతి తరతరాలుగా కొనసాగుతూ వస్తోంది. శాస్త్రీయ కోణంలో ఇప్పుడు దీని వల్ల ప్రయోజనం లేకపోయినా, మానసిక కోణంలో ఇది డ్రైవర్లకు ఒక రకమైన ధైర్యాన్ని ఇస్తుంది. "దైవ రక్షణ ఉందనే" భావన ప్రయాణీకులలో ప్రశాంతతను నింపుతుంది. ఏది ఏమైనా, ఒకప్పుడు పశువుల రక్షణ కోసం పుట్టిన ఈ 'సిట్రిక్ యాసిడ్' చిట్కా, నేడు ఒక సాంప్రదాయ వేడుకగా మారి మన సంస్కృతిలో భాగమైపోయింది. నమ్మకం ఏదైనా, ప్రయాణం సురక్షితంగా సాగాలనే ఆకాంక్షే దీని వెనుక ఉన్న అసలు ఉద్దేశం.

## వీటితో చుండ్రు సమస్యలకు గుడ్ బై చెప్పేయండి!



ఇప్పుడున్న అమ్మాయిల్లో ఎంతో మంది చుండ్రుతో బాధ పడుతున్నారు. ఎన్ని మెడిసిన్స్ వాడినా కూడా తగ్గక అలాగే ఎవరికీ చెప్పుకోలేక బాధ పడుతున్నారు. అయితే, తీసుకునే ఫుడ్స్ లో జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు కూడా చెబుతున్నారు. అమ్మాయిల్లో చాలా మంది చుండ్రు సమస్యతో ఇబ్బంది పడతారు. వాళ్ళు దీనికి చెక్ పెట్టడం కోసం హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతారు. అయినా కూడా ఎలాంటి ప్రయోజనం లేదు. తినే ఫుడ్స్ లో కొన్ని మార్పులు చేసుకుంటే ఈ సమస్య నుంచి ఉపశమనం పొందోచ్చని నిపుణులు చెబుతున్నారు.పెరుగు: పెరుగులో ఉండే యాంటీ ఫంగల్ చుండ్రు సమస్యకు చెక్ పెడుతోంది. కాబట్టి, దీనిని మీ ఫుడ్ డైట్ లో చేర్చుకోండి. ఎందుకంటే, పెరుగును తిన్న తర్వాత తలలో చుండ్రు మొత్తం తగ్గుతుంది. నిమ్మకాయ: నిమ్మకాయ మన ఆరోగ్యానికే కాదు చుండ్రును కూడా తగ్గిస్తుంది. దీనిలో ఉండే ఆమ్లం చుండ్రును పూర్తిగా తగ్గించి ఆ సమస్య నుంచి ఉపశమనం పొందేలా చేస్తుంది. వేపాకులు: వేపాకులలో ఉండే యాంటీ ఫంగల్ చుండ్రుకు కారణమైన బ్యాకటిరియాను అంతం చేస్తుంది. కాబట్టి, వారంలో రెండు నుంచి మూడు సార్లు వేపాకుల రసం తలకి పట్టించి తల స్నానం చేయండి. కొద్దీ రోజుల్లోనే మీకు మార్పు తెలుస్తుంది. చేపలు: చుండ్రు సమస్య తగ్గించడంలో చేపలు కీలక పాత్ర వహిస్తాయి. అయితే, ఈ విషయం చాలా మందికి తెలియదు. అయితే, సాల్మన్ వంటి చేపలను తీసుకుంటే జుట్టు కూడా బాలంగా ఉంటుంది.

## ఇంత కంటే అవమానం ఉండదు: పసికూన ముందు పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్, ఆస్ట్రేలియా..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో ఇటలీ పోరాటం ముగిసింది. ఈ పసికూన జట్టు గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. తొలిసారి మెగా టోర్నీ ఆడిన ఇటలీ అంచనాలకు మించి రాణించింది. ఫస్ట్ టైమ్ వరల్డ్ కప్ ఆడుతున్నామనే టెన్షన్ లేకుండా బలమైన జట్లపై మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. అంతేకాకుండా ఒక విషయంలో ఇటలీ మాజీ చాంపియన్లు పాకిస్తాన్, ఆస్ట్రేలియా కంటే మెరుగ్గా ఉంది.

అదే గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు కొట్టడం. గ్రూప్ దశలో భాగంగా నాలుగు మ్యాచులు ఆడిన ఇటలీ మొత్తం 34 సిక్సర్లు కొట్టింది. గ్రూప్ దశలో అత్యధిక సిక్సర్లు బాదిన జాబితాలో ఇటాలియన్ టీమ్ నాలుగో స్థానంలో నిలిచింది. ఇదే సమయంలో పాకిస్థాన్ 28, ఆస్ట్రేలియా 14 సిక్సర్లతో ఇటలీ కంటే వెనుకంజలో ఉండటం గమనార్హం.ఈ జాబితాలో 40 సిక్సర్లతో టీమిండియా అగ్రస్థానంలో నిలిచింది. 33 సిక్సర్లతో మరో పసికూన అమెరికా ఈ జాబితాలో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మాజీ ప్రపంచ విజేతలైనా ఆస్ట్రేలియా, పాకిస్తాన్ పసికూనలు ఇటలీ, అమెరికా కంటే తక్కువ సిక్సర్లు కొట్టడంపై క్రికెట్ ఫ్యాన్స్ సెటైర్లు వేస్తున్నారు. ఇంత కంటే అవమానం మరొకటి ఉండదని.. పసికూనలు ముందు పాకిస్తాన్, ఆస్ట్రేలియా పరువు పోగొట్టుకున్నాయని కామెంట్స్ చేస్తున్నారు. చెత్త ప్రదర్శనతో మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా ఈ వరల్డ్ కప్?లో గ్రూప్ దశనలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

**ఐసీసీ 2026 టీ20 వరల్డ్ కప్ గ్రూప్ దశలో ఎక్కువ సిక్సులు కొట్టిన జట్లు:**

భారతదేశం - 40 సిక్సులు
ఇంగ్లాండ్ - 36 సిక్సులు
వెస్టిండీస్ - 36 సిక్సులు
ఇటలీ - 34 సిక్సులు
యూఎస్ఏ - 33 సిక్సులు

# సూపర్--8కి భారత్ జట్టులో మార్పులు?.. ప్లేయర్లకు సునీల్ గవాస్కర్ కీలక సూచనలు

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా జరిగే సూపర్--8 దశలోకి భారత జట్టు అడుగుపెట్టింది. ఫిబ్రవరి 22వ తేదీన అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో తొలి సూపర్--8 మ్యాచ్‌లో టీమిండియా తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌కు ముందు భారత ప్లేయింగ్ ఎలెవన్‌పై పెద్ద ఎత్తున చర్చలు కొనసాగుతున్నాయి. జట్టులో మార్పుపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మాత్రం టీమ్‌లో కేవలం ఒకే ఒక్క మార్పు జరిగే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రెస్ట్ తీసుకున్న అక్షర్ పటేల్ సూపర్--8 మ్యాచ్‌లో తప్పకుండా తుది జట్టులోకి వస్తాడు అని ధీమా వ్యక్తం చేశాడు. అతని కోసంఅర్ష్‌దీప్ సింగ్ ని బెంచ్‌కు పరిమితం చేసే ఛాన్స్ ఉందని పేర్కొన్నాడు. ఇటీవల నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి వరల్డ్ కప్‌లో ఆడిన వాషింగ్టన్ సుందర్ నాలుగు ఓవర్లలో




వికెట్ తీయకపోయినా, లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ అవసరం కాబట్టి, అతడికి మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయని సునీల్ గవాస్కర్ తెలిపారు. అహ్మదాబాద్ పిచ్ స్పిన్‌కు పెద్దగా సహకరించదనే కారణంతో కుల్దీప్ యాదవ్ కు ఈ మ్యాచ్‌లో కూడా ఛాన్స్ దక్కకపోవచ్చని పేర్కొన్నారు. గతంలో సౌతాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లలో కూడా కుల్దీప్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేదని సన్నీ గుర్తు చేశారు. వాషింగ్టన్ సుందర్ 8వ స్థానంలో కూడా బ్యాటింగ్ చేయగలడు.. బంతిని బౌండరీకి తరలించే సామర్థ్యం అతడికి ఉంది.. అదే వాషికి ప్లస్ పాయింట్.. కాబట్టి అర్షదీప్ స్థానంలో అక్షర్ రావడం ఒక్కటే మార్పుగా నేను భావిస్తున్నాను అని మాజీ క్రికెటర్ గవాస్కర్ స్పష్టం చేశాడు. ఇదిలా ఉండగా, వరుసగా మూడు సార్లు డకౌట్స్ తో తీవ్రంగా నిరాశపరిచిన అభిషేక్ శర్మకు కీలక సూచనలు చేశాడు. భారీ షాట్లు కొట్టాలనే ఒత్తిడిని తగ్గించుకుని, ఎక్కువ సేపు క్రీజ్‌లో ఉండేందుకు ప్రయత్నం చేయాలని తెలిపాడు. ఫస్ట్ బాల్ నుంచే సిక్స్ లేదా ఫోర్ కొట్టాలని ప్రయత్నించాల్సిన అవసరం లేదన్నాడు.. ఒక సింగిల్ తీసుకుని ఖాతా తెరవాలి.. నాలుగు డాట్ బాల్స్ వచ్చినా పరవాలేదు.. ఆ తర్వాత వాటిని డాట్ అయినా బాల్స్ ని కవర్ చేయగల సత్తా అభిషేక్ కి ఉందని సన్నీ వెల్లడించారు. సూపర్--8 దశలో ప్రతి మ్యాచ్ కీలకం కావడంతో.. భారత్ తీసుకునే నిర్ణయాలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దక్షిణాఫ్రికాతో జరిగే ఈ మ్యాచ్‌లో టీమిండియా ఏ కాంబినేషన్‌తో బరిలోకి దిగుతుందో వేచి చూడాలి..

# శ్రీలంక జట్టును చిత్తు చేసిన పసికూన జింబాబ్వే..





**హైదరాబాద్ పెన్ పవర్:** 20 ప్రపంచ కప్ 2026 గ్రూప్--దీలో భాగంగా కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ లో జింబాబ్వే ఘన విజయం సాధించింది. 6 వికెట్ల తేడాతో సికందర్ రజా సేన గ్రాంఢ్ విక్టరీ సాధించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో పాతుమ్ నిస్సాంక (62) ఒక్కడే హాఫ్ సెంచరీ చేయగా.. చివర్లో జట్టు భారీ స్కోర్ సాధించడంలో పవన్ రత్నాయకే (44) కీలక ఇన్నింగ్ ఆడాడు. కుశాల్ పెరీరా (22) ఫర్వాలేదనిపించిన మిగతా బ్యాటర్లు అందరు దారుణంగా విఫలమయ్యారు. శ్రీలంక జట్టులోని మిగతా బ్యాటర్లు కుశాల్ మెండిస్ (14) కమిందు మెండిస్ (7), కెప్టెన్ దాసున్ షనకా (6), దుషన్ హేమంత (0) క్రీజులోకి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. చివరి ఓవర్ లో దునిత్ వెల్లలాగే రెండు ఫోర్లు కొట్టడంతో శ్రీలంక 7 వికెట్ల నష్టానికి 178 పరుగులు చేయగలిగింది. దీంతో జింబాబ్వే బౌలర్లలో గ్రేమ్ క్రీమర్, బ్లెస్సింగ్ ముజారబానీ, బ్రాడ్ ఎవాన్స్ తలో రెండు వికెట్లు పడగొట్టగా, ర్యాన్ బర్ల్ ఒక వికెట్ తీసుకున్నాడు. లక్ష్య ఛేదన కోసం బరిలోకి దిగిన జింబాబ్వే జట్టు ప్రారంభం నుంచే లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగింది. జింబాబ్వే ఓపెనర్లు తాడివానాషే మారుమణి, బ్రియాన్ బెన్నెట్ దుకుడుగా బ్యాటింగ్ చేయడంతో టార్గెట్ తగ్గిపోయింది. 69 పరుగుల వద్ద తడివానాషే మరుమాని (34) మొదటి వికెట్ గా డగౌట్ కి వెళ్లిన తర్వాత మైదానంలోకి వచ్చిన ర్యాన్ బర్ల్ సైతం 12 బంతుల్లో 23 పరుగులు చేసి 98 పరుగుల దగ్గర ఔట్ అయ్యాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సికందర్ రాజా కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. జస్ట్ 26 బంతుల్లోనే 2 ఫోర్లు, 4 సిక్సులతో 45 పరుగులు చేసి దుషన్ హేమంత బౌలింగ్ లో భారీ షాట్ ఆడే ప్రయత్నంలో దాసున్ షనకాకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వా బ్యాటింగ్ కి వచ్చిన తషింగా ముసేకివా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేక ఔట్ అయ్యాడు. మరో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ మిడిల్ ఆర్డర్ లో బ్యాటింగ్ కి వచ్చిన టోనీ మున్యోంగా కలిసి జట్టును గెలిపించాడు.

# టైర్ 2 హీరోల్లో బోర్డర్ దాటేసింది వీరే!



కుశిత కల్లపు గ్రేస్‌ఫుల్ గ్లామ్‌లో మెరుస్తుంది



పాన్ ఇండియా సినిమాల ప్రభావం మొదలైన దగ్గరి నుంచి టాలీవుడ్ హీరోల్లో అత్యధిక శాతం మందిని ఓ ప్రశ్న వెంటాడుతోంది. అదే వంద కోట్ల క్లబ్‌లో చేరే సినిమా ఎప్పుడని. చిన్న చిన్న హీరోలు సైతం తమ సినిమాలతో వంద కోట్ల మార్కుని దాటేస్తుంటే వారి కంటే ముందు ఇండస్ట్రీలోకి ప్రవేశించిన హీరోలు ఆ మార్కుని..ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతున్నారు. ఒక్కటంటే ఒక్క సినిమా అయినా పడుతుందా? దాంతో ఆ బోర్డర్‌ని దాటేయలేకపోతామా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

### ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో...

ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద వంద కోట్ల మార్కు బోర్డర్‌ని చాలా సింపుల్‌గా దాటేసి దానికి మించిన వసూళ్లని రాబోయే సినిమాలతో సాధించాలని కొంత మంది హీరోలు ఆశగా అడుగులు వేస్తున్నారు. టైర్ 2 హీరోల్లో ఈ బోర్డర్‌ని ముందు దాటేసిన హీరో రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ. పరశురామ్ డైరెక్ట్ చేసిన -గీత గోవిందం- సినిమాతో వంద కోట్ల క్లబ్‌లో చేరిన విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.132 కోట్లు వసూలు చేసి ఫస్ట్ టైమ్ రౌడీ సత్తా ఏంటో చూపించింది.అప్పటి నుంచి మళ్లీ వంద కోట్లు రాబట్టే సినిమా కోసం శ్రమిస్తున్నా విజయ్‌కి వర్కవుట్ కావడం లేదు. ఆ తరువాత రేసులో నిలిచింది మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్. హీరోగా పరిచయమైన ఫస్ట్ మూవీ -ఉప్పెన-. బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించిన ఈ మూవీ బ్లాక్ బస్టర్ టాక్‌తో వంద కోట్ల మార్కుని చేరింది. దానికి మించి వైష్ణవ్ తేజ్ ట్రై చేస్తున్నా ఫ్లాపులే ఎదురవుతున్నాయి. తన తరువాత మూడు సినిమాలతో రేసులో ముందు వరుసలో నిలిచిన హీరో నేచురల్ స్టార్ నాని. -దసరా- మూవీతో ఫస్ట్ టైమ్ వంద కోట్ల క్లబ్‌లో చేరిన నాని ఆ తరువాత -సరిపోదా శనివారం, హిట్ 3లతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరో అనిపించుకున్నాడు.ఈ రేసులో నిఖిల్ కూడా చేరాడు. తను నటించిన మిస్టరీ యాక్షన్ అడ్వెంచర్ -కార్తికేయ 2-తో ఈ ఫీట్‌ని అందుకున్నాడు. ఈ మూవీ రూ.120 కోట్లకు పైనే రాబట్టింది. మాస్ మహారాజా రవితేజ కూడా -ధమాకా- మూవీతో ఈ క్లబ్‌లో చేరాడు. యాక్షన్ కామెడీ డ్రామాగా త్రినాథరావు నక్కిన తెరకెక్కించిన ఈ మూవీ రూ.110 కోట్లు రాబట్టింది. స్టార్‌బాయ్ సిద్దూ జొన్నలగడ్డ -టిల్లూ స్క్వేర్-తో ఆ ఫీట్‌ని పూర్తి చేశాడు. త సినిమా రూ. 135 కోట్ల వసూళ్లని అందించింది. నాగచైతన్య కూడా నేను సైతం అన్నట్టుగా -తండేల్-తో రూ.100 కోట్లు రాబట్టి ఈ క్లబ్‌లో స్థానం దక్కించుకున్నాడు.

### రేసులో లేని హీరో ఖాతాలో రెండు...

చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీరంగంలో ఎన్నో సినిమాలు చేసిన తేజ సజ్జ -ఓ బేబీ- సినిమాతో యంగ్ యాక్టర్‌గా అందరి దృష్టిని ఆకర్షించాడు. సమంత టైటిల్ పాత్రలో నటించిన ఈ మూవీ సక్సెస్ కావడంతో -జాంబిరెడ్డి-తో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు. ఆ తరువాత ఇష్క్, అద్భుతం అంటూ రెండు సినిమాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ప్రశాంత్ వర్మతో కలిసి -హనుమాన్- అంటూ షాక్ ఇచ్చాడు. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద రూ.296 కోట్లు రాబట్టి అందరిని ఆశ్చర్యపరిచింది. ఈ మూవీ అందించిన జోష్‌తో కొత్త కథలనే ఎంచుకోవాలన్న నిర్ణయానికి వచ్చిన తేజ -మిరాయ్- అంటూ ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఇది కూడా సక్సెస్ అయి రూ.140 కోట్లకు మించి వసూళ్లని రాబట్టడంతో బ్యాక్ టు బ్యాక్ వంద కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన హీరోగా సరికొత్త రికార్డు సాధించాడు. త్వరలో -జై హనుమాన్-తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు.

### వంద కోట్లు దాటని హీరోలు...

మాస్ మహారాజా రవితేజ నుంచి తేజ సజ్జ వరకు టైర్ 2 హీరోల్లో చాలా వరకు వంద కోట్ల బోర్డర్‌ని దాటేయడంతో ఇప్పుడు మిగిలిన హీరోలపై చర్చ మొదలైంది. ఈ మార్కుని ఇప్పటి వరకు రామ్ పోతినేని, శర్వానంద్, గోపీచంద్, అల్లరి నరేష్, రానా దగ్గుబాటి (సోలో హీరోగా), అడివి శేష్, నితిన్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్, సాయి ధరమ్‌తేజ్, వంటి హీరోలున్నాయి. ఈ ఫీట్‌ని సాయి ధరమ్ తేజ్ -విరూపాక్ష- మూవీతో దాటేస్తాడని అనుకున్నారు కానీ ఆ మూవీ రూ.90 కోట్లు మాత్రమే రాబట్టడంతో తను వంద కోట్ల క్లబ్‌లో చేరలేకపోయాడు. మిగిలిన టైర్ 2 హీరోల్లో రామ్ నుంచి రానా వరకు అవకాశం ఉన్న అందుకు తగ్గ సినిమాలు పడటం లేదు. వన్స్ పడితే వంద బోర్డర్ ఈజీగా దాటేస్తారు.



నువేక్ష తన సహజమైన ఆకర్షణ మరియు స్క్రీన్ ప్రెజెన్స్‌తో స్టన్ చేస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965